ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY



తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యం — కార్తీ వాలకీ మీడియా అవకాశం

సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

గురువారం, 19 నవంబర్ 2026 | Thursday 19 November 2026 | హైదరాబాద్ | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 208 | Vol.No 28 Issue No .208 | Hyderabad | www.visionandhra.in



దళిత బహుజనుల

గుండె చప్పుడు తెలంగాణ

- వందేళ్లలో జరగనిది రెండేళ్లలో చేసి చూపించాం
- ఎస్సీ వర్గీకరణ, విద్య, ఉద్యోగం, రాజకీయంలో దళితులకే పెద్దపీట
- పార్లమెంటరీ కమిటీ ముందు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన
- కమిటీ సభ్యుల ప్రశంసల వర్షం

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 18, విజన్ ఆంధ్ర: తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు దేశం మొత్తం చూస్తున్న రాష్ట్రంగా

దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయం లిఖించిన రేవంత్ సర్కార్!



మారింది. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం విషయంలో తెలంగాణ వేస్తున్న అడుగులు దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. బుధవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ సమావేశం ఇందుకు సాక్ష్యంగా నిలిచింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ 02




ఏదో అదృష్టం కొద్దీ

సీఎం అయ్యావు..

ఇంకో రెండేళ్లు ఉంటావు!

- రేవంత్ రెడ్డిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- కొడంగల్‌కు మాత్రమే కాదు, మునుగోడుకు కూడా నిధులు ఇవ్వమని అడిగినందుకు "పండబెట్టి తొక్కుతా" అంటున్నాడు
- నువ్వు తొక్కితే తొక్కించుకునేలా కనిపిస్తున్నానా?

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 18,విజన్ ఆంధ్ర : తెలంగాణ కాంగ్రెస్‌లో మళ్లీ భారీ భూకంపం! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై 06



భారత్‌లో ఇక పేదరికం లేదు, నక్సలిజం లేదు

- మోదీ మాస్టర్ ప్లాన్‌తో దేశం మారిపోతోంది!
- 12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు
- ప్రపంచ బ్యాంక్ సంచలన నివేదిక
- నక్సల్స్‌కు చివరి హెచ్చరిక
- 100 శాతం పథకాలు ప్రతి ఇంటికి చేరాల్సిందేనని ప్రధాని కఠిన ఆదేశం

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 18, విజన్ ఆంధ్ర : దేశ చరిత్రలోనే అత్యంత కీలకమైన రోజుగా బుధవారం నిలిచింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రుల 02

హెచ్ఎండీఏ వేలంలో


కోట్లు పోసి కొన్నా ప్లాట్ మీది కాదు!

22A పేరుతో రిజిస్ట్రేషన్ బంద్!

మొకిలా లేఅవుట్‌లో కొనుగోలుదారులకు శఠగోపం

- 165 ఎకరాల్లో 1,293 ప్లాట్లు, గజం రూ.1,09,500
- డబ్బు తీసుకునేటప్పుడు లేని 22A, రిజిస్ట్రేషన్‌కు వచ్చేసరికి ఎలా వచ్చింది?
- హెచ్ఎండీఏ, రెవెన్యూ మధ్య కొనుగోలుదారులు నలిగిపోతున్నారు
- ప్రభుత్వ వేలంపైనే నమ్మకం పోతే ఇంకెవరిని నమ్మాలి?

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 18,విజన్ ఆంధ్ర: ప్రభుత్వ సంస్థ అయిన హెచ్ఎండీఏ మీద నమ్మకంతో కోట్లు పెట్టి ప్లాట్లు కొంటే, ఇప్పుడు ఆ ప్లాట్లే తమవి కావడం లేదని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలంలో 02



కాళేశ్వరం పేరు ముట్టుకుంటే

ఊరుకోం!

కాంగ్రెస్ నాయకుల పేర్లన్నీ మార్చేస్తాం

- కేటీఆర్ ఘాటు హెచ్చరిక!, ● దేవుడి పేరును రాజకీయం చేస్తారా?
- కేసీఆర్ తన పేరు పెట్టుకోలేదు, దేవుళ్ల పేర్లే పెట్టాడు
- పీవీకి, కాకాకు, అంబేడ్కర్‌కు గౌరవం ఇచ్చింది మేమే
- పేర్లు మార్చితే ప్రజలకు ఒరిగేదేంటి?
- ఎయిర్‌పోర్టు నుంచి ఉప్పల్ స్టేడియం వరకు అన్నీ మారుస్తాం! 02





దళిత బహుజనుల
గుండె చప్పుడు తెలంగాణ

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరంగా వివరించారు. పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే, కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తోందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేవలం మాటలతో కాదు, చేతలతో నిరూపించి చూపించామని ఆయన అన్నారు. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని సీఎం కమిటీకి వివరించారు.

రాజకీయంగా చారిత్రక అవకాశాలు

తెలంగాణలో దళితులకు రాజకీయంగా ఇంతవరకు ఎన్నడూ లేనంత ప్రాధాన్యం ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. శాసన సభ స్పీకర్‌గా దళిత నేతకు అవకాశం కల్పించడం దేశంలోనే అరుదైన విషయమని ఆయన గుర్తు చేశారు. అంతేకాదు, మంత్రివర్గంలోనూ దళితులకు సముచిత స్థానం కల్పించామని, వారి గొంతును ప్రభుత్వ నిర్ణయాల్లో వినిపించేలా చేశామని వివరించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు వివిధ కార్పొరేషన్లు, బోర్డులలోనూ ఎస్సీ, ఎస్టీలకు అనేక అవకాశాలు కల్పించామని సీఎం చెప్పారు. అర్హత, అవకాశం ఉన్న ప్రతీ చోట ఎస్సీ, ఎస్టీలకు స్థానం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కేవలం రిజర్వేషన్ కోసమే కాదు, గౌరవం కోసం, ప్రాతినిధ్యం కోసం ఈ అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన అన్నారు.

వందేళ్ల చరిత్రలో మొదటిసారి – ఉస్మానియా వీసీగా దళితుడు

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పిన అత్యంత కీలకమైన విషయం ఉస్మానియా యూనివర్సిటీ వీసీ నియామకం. వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీకి వీసీగా దళితుడికి అవకాశం కల్పించడం చారిత్రక నిర్ణయమని సీఎం అన్నారు. ఇప్పటివరకు ఎన్నడూ జరగని ఈ మార్పు తమ ప్రభుత్వంలోనే జరిగిందని ఆయన గర్వంగా చెప్పారు. ఉస్మానియాతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐటీలలోనూ ఎస్సీ, ఎస్టీలకు వీసీలుగా అవకాశాలు ఇచ్చామని వివరించారు. విద్యా రంగంలో అత్యున్నత స్థానాల్లో దళితులు కూర్చోవడం అనేది కేవలం ఒక వ్యక్తికి వచ్చిన గౌరవం కాదు, మొత్తం సమాజానికి దక్కిన గౌరవమని సీఎం అన్నారు. విద్య ద్వారానే సమాజం మారుతుందని, అందుకే విద్యా సంస్థల నాయకత్వంలో దళితులకు అవకాశం ఇస్తున్నామని ఆయన చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ – దేశంలోనే తొలి రాష్ట్రం తెలంగాణ

దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో గుర్తు చేశారు. దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతూనే ఉంది. ఎన్నో ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయి, కానీ అమలు చేయలేకపోయాయి. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ హామీని నిలబెట్టుకుని వర్గీకరణను అమలు చేసి చూపించిందని సీఎం చెప్పారు. వర్గీకరణ అమలు చేయడం వల్ల అట్టడుగున ఉన్న దళిత వర్గాలకు న్యాయం జరిగిందని, అందరికీ సమాన అవకాశాలు దక్కే పరిస్థితి వచ్చిందని ఆయన వివరించారు. ఈ నిర్ణయంపై పార్లమెంటరీ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ తీసుకున్న ఈ నిర్ణయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని వారు ప్రశంసించారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ – భవిష్యత్తుకు బాట

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై కూడా కమిటీ సభ్యులు ముఖ్యమంత్రిని అభినందించారు. పేద, దళిత, గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని సీఎం వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు కూడా అంతర్జాతీయ స్థాయి విద్యను పొందాలని, వారిలో ఆత్మవిశ్వాసం పెరగాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. ఈ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు, మెరుగైన బోధన, క్రీడలు, నైపుణ్య శిక్షణ అన్నీ ఉంటాయని, దీంతో దళిత విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీలో ప్రాధాన్యత

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలోనూ ఎస్సీ, ఎస్టీలకే ప్రాధాన్యత ఇచ్చామని సీఎం వివరించారు. సొంత ఇల్లు లేని ప్రతి దళిత కుటుంబానికి ఇల్లు కట్టించడమే లక్ష్యమని ఆయన చెప్పారు. అదేవిధంగా సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధులకు సంబంధించి 50 శాతం పైగా ఎస్సీ, ఎస్టీల కోసం ఖర్చు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. పేదలకు వైద్యం భారం కాకూడదని, ప్రతి దళిత కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందాలని ఈ నిధులను ఖర్చు చేస్తున్నామని ఆయన చెప్పారు.

కమిటీ సభ్యుల ప్రశంసలు

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యంగా వర్గీకరణ, విద్యా రంగంలో తీసుకున్న నిర్ణయాలు దేశ చరిత్రలో నిలిచిపోతాయని వారు అన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, కమిటీ సభ్యులు తాపీర్ గావ్, హరీశ్చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, ప్రసాద రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం

తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే పంటలను ప్రోత్సహించాలి...

ఐటీడీఏ పీఓ మంద మకరందు



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)గిరిజన రైతులు ఉద్యాన పంటల సాగు చేపట్టి ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఉద్యాన శాఖ నర్సరీని సందర్శించిన ఆయన షేడ్ నెట్, నెట్‌హౌస్‌లలో సాగు చేస్తున్న మునగ, వెదురు, కరోండా, డ్రాగన్ ఫ్రూట్ తదితర మొక్కలను పరిశీలించారు. ఐటీడీఏ, గ్రామీణాభివృద్ధి, ఉద్యాన శాఖల సమన్వయంతో గిరిజన రైతులకు షేడ్ నెట్‌లు అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా ఉద్యానవన అధికారి గుడిమల్ల సందీప్ కుమార్‌కు సూచించారు. మామిడి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న టమాటా పంటను పరిశీలించి, అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే ఆయిల్ పామ్, కూరగాయలు, మల్బరీ తదితర పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. గిరిజన రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ అందిస్తూ, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి అలేఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ వేలంలో కోట్లు పోసి కొన్నా ప్లాట్ మీది కాదు!

గెలిచాం, డబ్బులు కట్టాం, పత్రాలు తీసుకున్నాం, కానీ రిజిస్ట్రేషన్ మాత్రం కావడం లేదు. 22ఆలో ఉందంటూ అధికారులు రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో మొకిలా లేఅవుట్ కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. ఇది కేవలం ఒక లేఅవుట్ సమస్య కాదు, హెచ్ఎండీఏ వేలం వ్యవస్థపైనే ప్రజలకు నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్న ఘటనగా మారింది.

మొకిలా వద్ద భారీ వేలం - హైదరాబాద్‌కు దగ్గరలో గోల్డెన్ ఛాన్స్ అని నమ్మారు!

హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మొకిలా వద్ద 165.37 ఎకరాల భూమిలో 1,293 ప్లాట్లు చేసి భారీ ధరలకు వేలం వేసిన హెచ్ఎండీఏ. ఈ ప్రాంతం హైదరాబాద్‌కు అత్యంత దగ్గరగా ఉండడం, భవిష్యత్తులో వేగంగా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో కొనుగోలుదారులు పోటీ పడ్డారు. హెచ్ఎండీఏ లేఅవుట్ అంటే రోడ్లు, డ్రైనేజీ, కరెంట్, పార్కులు అన్నీ సరిగ్గా ఉంటాయని, పత్రాలు పక్కాగా ఉంటాయని అందరూ నమ్మారు. ప్రైవేట్ వెంచర్లలో మోసపోతామేమోనని భయపడే వారు సైతం ప్రభుత్వ సంస్థ అంటే ధైర్యంగా డబ్బులు పెట్టారు. ఇదే తరహాలో ఇటీవల వేలం వేసిన 100 ప్లాట్లను చదరపు గజానికి రూ.1,09,500 చెల్లించి దక్కించుకున్న కొనుగోలుదారులు. గజం లక్షా తొమ్మిది వేల ఐదు వందలు అంటే మామూలు ధర కాదు. 200 గజాల ప్లాట్ కొంటేనే రూ.2 కోట్ల 19 లక్షలు అవుతుంది. 300 గజాల ప్లాట్ అంటే రూ.3 కోట్లకు పైగా. అంత భారీ మొత్తాన్ని కొనుగోలుదారులు బ్యాంకు లోన్లతో, జీవితకాల పొదుపుతో, ఆస్తులు అమ్మి మరీ చెల్లించారు. హెచ్ఎండీఏ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. వేలం పత్రాలు చేతికి వచ్చాయి. ఇక రిజిస్ట్రేషన్ చేసుకుని హాయిగా ఉంటామని అనుకున్న సమయంలోనే షాక్ తగిలింది.

96/పీ సర్వే నంబర్‌లో 22ఆ అడ్డంకి - రిజిస్ట్రేషన్ నిలిపివేత!

అయితే ఈ భూమిలోని 96/పీ సర్వే నంబర్‌లో కొంత భాగం 22ఆలో ఉందని రిజిస్ట్రేషన్లను నిలిపివేసిన రెవెన్యూ అధికారులు. 22ఆ అంటే నిషేధిత భూముల జాబితా. ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమి, దేవాదాయ భూమి, వక్ఫ్ భూమి వంటివి ఈ జాబితాలో ఉంటాయి. ఈ జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదనే నిబంధన ఉంది. అదే సాకు చూపుతూ అధికారులు రిజిస్ట్రేషన్లను ఆపేశారు. కొనుగోలుదారుల ప్రశ్న ఒక్కటే. వేలం వేసే ముందు హెచ్ఎండీఏ ఈ విషయాన్ని ఎందుకు తేల్చలేదు? వేలం వేసే ముందు భూమికి సంబంధించిన అన్ని వివరాలను, రెవెన్యూ రికార్డులను పరిశీలించాల్సిన బాధ్యత హెచ్ఎండీఏదే కదా? 22ఆలో ఉందని తెలిసీ వేలం వేశారా? లేక తెలియక వేలం వేశారా? తెలిసీ వేస్తే అది మోసం అవుతుంది, తెలియక వేస్తే అది నిర్లక్ష్యం అవుతుంది. ఏదైనా సరే నష్టపోయేది మాత్రం కొనుగోలుదారులేనని వారు అంటున్నారు. డబ్బులు తీసుకునేటప్పుడు లేని 22ఆ, రిజిస్ట్రేషన్ సమయంలో ఎలా వచ్చిందని కొనుగోలుదారులు నిలదీస్తున్నారు. వేలం నోటిఫికేషన్‌లో, బ్రోచర్‌లో ఈ 22ఆ విషయం ఎందుకు చెప్పలేదని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ 22ఆ నిజంగానే ఉంటే, ఆ భాగాన్ని పక్కన పెట్టి మిగిలిన ప్లాట్లనైనా రిజిస్ట్రేషన్ చేయాలి కదా? మొత్తం లేఅవుట్‌నే ఎందుకు ఆపేశారని అడుగుతున్నారు.

ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న బాధితులు - వడ్డీ భారం, మానసిక ఒత్తిడి!

కోట్లు చెల్లించి వేలంపాటలో ప్లాట్లు కొంటే రిజిస్ట్రేషన్ నిలిపివేయడం ఏంటని, ఇలా చేస్తే హెచ్ఎండీఏపై, ప్రభుత్వంపై నమ్మకం ఎలా ఉంటుందని నిలదీస్తున్న కొనుగోలుదారులు. హెచ్ఎండీఏ అధికారులను అడిగితే రెవెన్యూ అధికారులను అడగమని, రెవెన్యూ అధికారులను అడిగితే హెచ్ఎండీఏను అడగమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు శాఖల మధ్య కొనుగోలుదారులు నలిగిపోతున్నారు. కొంతమంది కొనుగోలుదారులు బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుని ప్లాట్లు కొన్నారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో బ్యాంకులకు ప్రతి నెలా భారీ వడ్డీ కట్టాల్సి వస్తోంది. ప్లాట్ చేతికి రాకుండానే వడ్డీ కట్టడం అంటే ఎంత బాధో వారికే తెలుసు. మరికొంతమంది తమ జీవితకాల సేవింగ్స్ అంతా పెట్టి ప్లాట్లు కొన్నారు. పిల్లల చదువు కోసం, భవిష్యత్తు కోసం దాచుకున్న డబ్బులను ఇందులో పెట్టారు. ఇప్పుడు ఏం చేయాలో తెలియక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

హెచ్ఎండీఏపై నమ్మకం సన్నగిల్లుతోంది - ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి!

ఈ ఘటనతో హెచ్ఎండీఏ వేలంపై నమ్మకం సన్నగిల్లుతోందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ సంస్థ వేలం వేస్తేనే ఇలాంటి సమస్యలు వస్తే, ప్రైవేట్ వెంచర్లలో ప్లాట్లు కొనే వారి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. హెచ్ఎండీఏ భవిష్యత్తులో వేలం వేసే భూములపై కూడా కొనుగోలుదారులు అనుమానంతో చూసే పరిస్థితి వస్తోందని చెబుతున్నారు. ఇది ప్రభుత్వానికి కూడా నష్టమే. భవిష్యత్తులో వేలాలకు కొనుగోలుదారులు ముందుకు రాకపోతే ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కొనుగోలుదారులు డిమాండ్ చేస్తున్నారు. 96/పీ సర్వే నంబర్‌లో 22ఆ సమస్య ఉంటే దానిని తొలగించి రిజిస్ట్రేషన్లు చేయాలని, లేదా కొనుగోలుదారులకు డబ్బులు వెనక్కి ఇచ్చి వడ్డీతో సహా న్యాయం చేయాలని కోరుతున్నారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల కొనుగోలుదారులు నష్టపోకూడదని అంటున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని కొనుగోలుదారులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తోంది.

భారత్‌లో ఇక పేదరికం లేదు, నక్సలిజం లేదు

మండలి సమావేశంలో భారతదేశ భవిష్యత్తును మార్చేసే నిర్ణయాలు చర్చకు వచ్చాయి. పేదరికం, నక్సలిజం అనే రెండు పెద్ద సమస్యలను పూర్తిగా తుడిచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని ఈ సమావేశం తేల్చి చెప్పింది. ప్రపంచ బ్యాంక్ నివేదిక, హోం శాఖ నివేదిక, ప్రధాని ఆదేశాలు – మూడూ కలిపి ఈ సమావేశాన్ని చారిత్రకంగా మార్చాయి.

50 కోట్ల మంది జీవితాల్లో వెలుగు - ఇది కేవలం లెక్క కాదు, విప్లవం!

2011 నుంచి 2023 మధ్య కాలంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేసినట్లు ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్ పేర్కొంది. ఈ ఒక్క వాక్యం సమావేశంలో అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ప్రపంచంలో ఏ దేశం కూడా ఇంత తక్కువ కాలంలో ఇంత మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురాలేదని మంత్రులు అన్నారు. ఇది భారతదేశం సాధించిన అతిపెద్ద విజయమని, ప్రపంచం మొత్తం భారత్ వైపు చూసేలా చేసిన విజయమని వారు అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ఈ సందర్భంగా భావోద్వేగంతో మాట్లాడారు. "ఇది కేవలం గణాంకం కాదు. 50 కోట్ల కుటుంబాల కళ్లల్లో వచ్చిన వెలుగు. ఒకప్పుడు రెండు పూటలా తిండికి ఇబ్బంది పడిన కుటుంబం ఇప్పుడు సొంత ఇంట్లో, గ్యాస్ పొయ్యి మీద వండుకుని, విద్యుత్ వెలుగుల్లో పిల్లలను చదివిస్తోంది. బ్యాంకు ఖాతా, ఆరోగ్య బీమా, మరుగుదొడ్డి, స్వచ్ఛమైన తాగునీరు – ఇవన్నీ ఇప్పుడు పేదలకు కూడా అందుతున్నాయి. ఇదే నిజమైన స్వాతంత్ర్యం, ఇదే నిజమైన అభివృద్ధి" అని ప్రధాని అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా కోట్లాది మందికి సొంత ఇల్లు, ఉజ్వల యోజన ద్వారా గ్యాస్ కనెక్షన్, జన్ ధన్ యోజన ద్వారా బ్యాంకు ఖాతా, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం, హర్ ఘర్ జల్ ద్వారా ప్రతి ఇంటికి నీరు, స్వచ్ఛ భారత్ ద్వారా మరుగుదొడ్లు – ఈ పథకాలన్నీ కలిసి పేదరికాన్ని దెబ్బకొట్టాయని సమావేశంలో చర్చించారు. కేవలం ఉచితంగా ఇవ్వడం కాదు, పేదలను సొంత కాళ్లపై నిలబెట్టడమే తమ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు. నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, మహిళలకు ప్రత్యేక పథకాల ద్వారా పేదలను శాశ్వతంగా పేదరికం నుంచి బయటకు తీసుకురావాలని ఆయన మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

నక్సలిజానికి చరమగీతం - ఇక కొన్ని జిల్లాలకే పరిమితం!

దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై హోం శాఖ ఈ సమావేశంలో వివరణ ఇచ్చింది. ఒకప్పుడు 200కు పైగా జిల్లాల్లో నక్సలిజం ప్రభావం ఉండేదని, ఇప్పుడు అది వేళ్ల మీద లెక్కపెట్టగలిగే జిల్లాలకు మాత్రమే పరిమితమైందని హోం శాఖ తెలిపింది. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేసిన కృషి ఫలితమని వివరించారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని హోం శాఖ చెప్పింది. అక్కడ రోడ్లు వేశారు, స్కూళ్లు కట్టారు, ఆస్పత్రులు తెరిచారు, మొబైల్ టవర్లు పెట్టారు, పోలీస్ స్టేషన్లు నిర్మించారు. దీంతో అక్కడి ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది. తుపాకీతో కాదు, అభివృద్ధితోనే నక్సలిజాన్ని అంతం చేయాలని ప్రధాని సూచించారు. లొంగిపోయిన నక్సలైట్లకు పునరావాసం, ఉపాధి అవకాశాలు కల్పించాలని, యువత తప్పుదారి పట్టకుండా వారికి విద్య, ఉద్యోగాలు అందించాలని ఆయన ఆదేశించారు. "నక్సలిజం వల్ల అత్యధికంగా నష్టపోయింది గిరిజన ప్రజలే. వారి పిల్లల భవిష్యత్తును నక్సల్స్ నాశనం చేశారు. ఇప్పుడు ఆ గిరిజన ప్రాంతాల్లోనే అభివృద్ధి జరుగుతోంది. ఇక నక్సలిజానికి చోటు లేదు" అని ప్రధాని అన్నారు.

ఒక్క లబ్ధిదారుడు కూడా మిగలకూడదు - ప్రధాని కఠిన హెచ్చరిక

ప్రభుత్వ పథకాలు 100 శాతం లబ్ధిదారులకు అందేలా చూడాలని ప్రధాని మోదీ ఈ సమావేశంలో మంత్రులను కఠినంగా ఆదేశించారు. "పథకం ప్రకటించడం గొప్ప కాదు, అది చివరి వ్యక్తికి చేరడమే గొప్ప. ఒక్క లబ్ధిదారుడు కూడా మిగిలిపోకూడదు. అధికారులు క్షేత్ర స్థాయిలో తిరిగి పథకాల అమలును పరిశీలించాలి. ఫైళ్లలో కాదు, ప్రజల ఇళ్లలో పథకాలు కనిపించాలి" అని ప్రధాని అన్నారు. రేషన్, పెన్షన్, ఇండ్లు, ఉపాధి హామీ, రైతులకు సాయం, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వంటి పథకాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, డిజిటల్ విధానంలో పారదర్శకంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రతి మంత్రిత్వ శాఖ తమ పథకాల పురోగతిని ప్రతి నెలా నివేదిక రూపంలో అందించాలని ప్రధాని ఆదేశించారు.

ముగింపు - పేదరికం లేని, నక్సలిజం లేని నూతన భారత్

ఈ సమావేశంలో పలువురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం ముగింపులో ప్రధాని మరోసారి స్పష్టం చేశారు – "పేదరికం లేని భారత్, నక్సలిజం లేని భారత్ నిర్మాణమే మా లక్ష్యం. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను చూడాలంటే ఇప్పుడే ఈ రెండు సమస్యలను పూర్తిగా అంతం చేయాలి" అని ఆయన అన్నారు.

కాళేశ్వరం పేరు ముట్టుకుంటే ఊరుకోం!

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 18, విజన్ ఆంధ్ర :

తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ పేర్ల యుద్ధం మొదలైంది. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మార్పు అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ మీద ఉన్న కక్షతోనే కాళేశ్వరం పేరు మార్చాలని చూస్తోందని ఆరోపించారు. మీరు కాళేశ్వరం పేరు మారిస్తే, మేము అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నాయకుల పేర్ల మీద ఉన్నవన్నీ మార్చేస్తామని ఘాటుగా హెచ్చరించారు. ఎయిర్‌పోర్టు, ఉప్పల్ స్టేడియం పేర్లను కూడా మార్చేస్తామని స్పష్టం చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది.

కాళేశ్వరం అనేది రాజకీయ నాయకుడి పేరు కాదు - దేవుడి పేరు!

కాళేశ్వరం అనేది రాజకీయ నాయకుడి పేరు కాదని కేటీఆర్ తేల్చి చెప్పారు. ప్రాజెక్టులకు కేసీఆర్ తన పేరు పెట్టుకోలేదని, లక్ష్మీ, పార్వతీ, సరస్వతి, సమ్మక్క, సీతమ్మ, రంగనాయక, కొండపోచమ్మ, మల్లన్న సాగర్ అని దేవుళ్ల పేర్లు పెట్టాడని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు కొలిచే దేవుళ్ల పేర్లు, అమ్మవార్ల పేర్లు, ఆదివాసీ దేవతల పేర్లు పెట్టి ప్రాజెక్టులను నిర్మించామని చెప్పారు. కాళేశ్వరం అంటే కాళేశ్వర స్వామి పేరు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో ఉన్న ప్రసిద్ధ శివాలయం పేరు మీదే ఈ ప్రాజెక్టుకు ఆ పేరు వచ్చింది. తెలంగాణ ప్రజలు ఎంతో భక్తితో కొలిచే దైవం పేరు. అలాంటి పవిత్రమైన పేరును మార్చాలని చూడడం అంటే తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ మీద కోపంతో దేవుడి పేరును మార్చడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. దేవుళ్ల పేర్లు పెట్టిన ప్రాజెక్టులను కూడా మీరు రాజకీయం చేస్తారా? అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ఘనత - కాంగ్రెస్ నాయకులను గౌరవించింది మేమే!

బీఆర్ఎస్ పార్టీకి సంబంధం లేకున్నా కాకా వెంకటస్వామి విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై పెట్టింది మా ప్రభుత్వమని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకుడైన కాకా వెంకటస్వామిని తెలంగాణ ప్రజలు గౌరవిస్తారని, అందుకే ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠించామని చెప్పారు. మేము పార్టీలు చూడలేదు, వ్యక్తులను గౌరవించామని అన్నారు.

మీరు అవమానించిన మీ కాంగ్రెస్ నాయకుడు పీవీ నరసింహారావు పేరు మీద యూనివర్సిటీ పెట్టింది కూడా మా బీఆర్ఎస్ ప్రభుత్వమే అని కేటీఆర్ అన్నారు. పీవీ నరసింహారావును కాంగ్రెస్ పార్టీనే పక్కన పెట్టేసిందని, ఆయనను గౌరవించిన ఘనత బీఆర్ఎస్‌దేనని చెప్పారు. తెలుగు బిడ్డగా, దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను గుర్తించి యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు.

సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి, పక్కనే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టిన ఘనత మాదని కేటీఆర్ చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను గౌరవించేలా దేశంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. మేము ఎప్పుడూ పేర్ల రాజకీయాలు చేయలేదు, అందరినీ గౌరవించాము. మహనీయులను, కాంగ్రెస్ నాయకులను కూడా గౌరవించిన చరిత్ర మాది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కక్షతో పేర్లు మార్చే పనిలో ఉందని విమర్శించారు.

ప్రాజెక్టుల పేర్లు మార్చడం వల్ల ప్రజలకు వచ్చే లాభమేంటి?

ప్రాజెక్టులు, పథకాల పేర్లు మార్చడం వల్ల ప్రజలకు వచ్చే లాభమేంటి? అని కేటీఆర్ ప్రశ్నించారు. అన్నపూర్ణ క్యాంటీన్ అని గొప్ప పేరు పెడితే, ఇందిరమ్మ అని మార్చారు, దాని వల్ల జరిగిన మేలు ఏంటి? అని నిలదీశారు. పేరు మార్చడం వల్ల పేదవాడికి అన్నం పెట్టినట్టు అవుతుందా? రైతుకు నీళ్లు వచ్చినట్టు అవుతుందా? నిరుద్యోగికి ఉద్యోగం వచ్చినట్టు అవుతుందా? అని ప్రశ్నించారు.

పేర్లు మార్చే బదులు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని, రైతులకు నీళ్లు ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, మహిళలకు భద్రత కల్పించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పేర్లు మార్చి గొప్పలు చెప్పుకోవడం కాదు, పనులు చేసి చూపించాలని సవాల్ విసిరారు. పేరు మార్చినంత మాత్రాన ప్రాజెక్టులో నీళ్లు పెరగవు, పంటలు పండవు, ప్రజల కష్టాలు తీరవని అన్నారు. ప్రభుత్వం చేయాల్సిన పని పేర్లు మార్చడం కాదు, ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు నీళ్లు అందించడమని స్పష్టం చేశారు.

జైపాల్ రెడ్డిని రేవంత్ రెడ్డి తిట్టినంత ఎవరూ తిట్టలేదు!

జైపాల్ రెడ్డి పేరిట జిల్లా ఏర్పాటు చేస్తారట, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కూడా జైపాల్ రెడ్డి పేరు పెట్టుకున్నాడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. జైపాల్ రెడ్డిని రేవంత్ రెడ్డి తిట్టినంత ఎవరూ తిట్టలేదని గుర్తు చేశారు. ఒకప్పుడు తిట్టిన వ్యక్తి పేరును ఇప్పుడు వాడుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసమే తప్ప, నిజమైన గౌరవం కాదని విమర్శించారు. జైపాల్ రెడ్డి గారి పేరును రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారని, ఆయనను నిజంగా గౌరవిస్తే ఆయన ఆశయాలను అమలు చేయాలని సూచించారు.

మేము వస్తే అన్నీ మారుస్తాం - కేటీఆర్ వార్నింగ్!

మీరు కేసీఆర్ మీద కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మార్చితే, మేము అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నాయకుల పేర్ల మీద ఉన్న అన్ని పేర్లను మార్చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఎయిర్‌పోర్టు, ఉప్పల్ స్టేడియం పేర్లను కూడా మార్చేస్తామని స్పష్టం చేశారు. పేర్ల రాజకీయం మొదలుపెడితే అది ఎక్కడ ఆగదని, దీ

సంపాదకీయం


చీచీదడ పుట్టిస్తున్న ద్రవ్యోల్బణం

ధరల కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావడంతో ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. దేశంలో టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) మరోసారి పెరిగింది.అక్టోబరులో వార్షిక ప్రాతిపదికన టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరింది.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది.సెప్టెంబరులో నమోదైన 11.39 శాతంతో పోలిస్తే అక్టోబరులో ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. సర్వేలో ఆర్థిక నిపుణులు అంచనా వేసిన 12.1 శాతాన్ని కూడా మించింది.ప్రధానంగా ఆహార పదార్థాలు, చమురు ధరలు పెరగడం ఈ పరిణామానికి కారణమైంది. అక్టోబరులో టోకు ఆహార ధరలు 8.58 శాతం పెరిగాయి.అయితే సెప్టెంబరులో ఈ పెరుగుదల 8.66 శాతంగా నమోదైంది. అంటే ఆహార ధరల పెరుగుదల రేటులో స్వల్ప తగ్గుదల కనిపించింది.మరోవైపు తయారీ రంగ ఉత్పత్తుల ధరలు అక్టోబరులో 9.54 శాతం పెరిగాయి.సెప్టెంబరులో ఈ పెరుగుదల 9.76 శాతంగా ఉంది. దీంతో తయారీ ఉత్పత్తుల ధరల పెరుగుదలలోనూ కొంత తగ్గుదల నమోదైంది.ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల మాత్రం మరింత వేగంగా కొనసాగింది.సెప్టెంబరులో 25.85 శాతంగా ఉన్న ఈ విభాగం ద్రవ్యోల్బణం అక్టోబరులో 32.84 శాతానికి చేరింది.అయితే పెట్రోలియం, సహజ వాయువు ధరల పెరుగుదల మాత్రం గణనీయంగా తగ్గింది.సెప్టెంబరులో 57.32 శాతంగా ఉన్న ఈ ధరల పెరుగుదల అక్టోబరులో 7.80 శాతానికి పరిమితమైంది.మొత్తంగా ఆహార పదార్థాలు, ఇంధనం, చమురు ధరల్లో చోటుచేసుకున్న మార్పులు టోకు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపాయి.జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ గణాంకాల ప్రకారం, దేశంలో 7 శాతానికి మించి ద్రవ్యోల్బణం నమోదైన ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. గత పది నెలలుగా రాష్ట్రంలో ద్రవ్యోల్బణం జాతీయ సగటు కంటే ఎక్కువగా కొనసాగుతోంది. ఇది సామాన్య కుటుంబాల కొనుగోలు శక్తిపై ఒత్తిడి తెస్తోంది.ఈ ఏడాది జనవరిలో తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.92 శాతంగా ఉండగా, నెలవారీగా పెరుగుతూ అక్టోబర్‌లో 7.26 శాతానికి చేరుకుంది.ఫిబ్రవరిలో 5.02, మార్చిలో 5.83, మేలో 6.15, జూన్‌లో 6.36 శాతంగా నమోదైంది. జూలై, ఆగస్టులో కాస్త తగ్గినప్పటికీ సెప్టెంబర్ నుంచి మళ్లీ పెరుగుదల మొదలైంది. ఇప్పుడు ఏడాది గరిష్ఠ స్థాయికి చేరింది.గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అక్టోబర్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 8.05 శాతానికి చేరగా, పట్టణ ప్రాంతాల్లో 6.68 శాతంగా ఉంది. జాతీయ గ్రామీణ సగటు 6.63 శాతంతో పోలిస్తే తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 1.4 శాతం పాయింట్లు అధికం.దీంతో గ్రామీణ కుటుంబాలపై నిత్యావసరాల ధరల భారం మరింత ఎక్కువగా పడుతోంది.ఆహార ధరల పెరుగుదలే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 7.74 శాతం ఉండగా అక్టోబర్‌లో 8.94 శాతానికి పెరిగింది. ఉల్లి ధరలు 116 శాతం పైగా పెరగడం, వెల్లుల్లి, అల్లం, నిమ్మకాయలు, బియ్యం వంటి వస్తువుల ధరలు ఎగబాకడం సామాన్యుల ఇంటి బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.అక్టోబర్‌లో రాష్ట్రంలో వర్షపాతం భారీగా తగ్గడం, ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది కూరగాయలు, పండ్లు, ధాన్యాల ధరలపై మరింత ఒత్తిడి తీసుకురావచ్చు.ధరల పెరుగుదల వల్ల మధ్యతరగతి, నిమ్న మధ్యతరగతి కుటుంబాలు రోజువారీ ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తోంది. కూరగాయలు, పప్పులు, నూనె, పాలు వంటి అవసరాలకు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి రావడంతో ఇతర అవసరాలు వెనక్కి పోతున్నాయి.ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టినప్పటికీ, సరఫరా గొలుసులోని సమస్యలు, వాతావరణ ప్రభావం కొనసాగితే ముందున్న నెలల్లో కూడా ఒత్తిడి ఉండే అవకాశం ఉంది.మొత్తంగా చూస్తే తెలంగాణలో ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావాలంటే ఆహార ఉత్పత్తి పెంపు, సరఫరా మెరుగుదల, అవసరమైన చోట సబ్సిడీలు లేదా మార్కెట్ జోక్యం అవసరం. సామాన్యులు కూడా ధరలు తక్కువగా ఉన్న సీజనల్ కూరగాయలు, స్థానిక ఉత్పత్తులు వాడటం ద్వారా కొంతవరకు ఖర్చులను అదుపులో ఉంచుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితి సామాన్యుడి జేబుపై నిజంగా భారం పెడుతోంది.ద్రవ్యోల్బణం కట్టడికి వచ్చే ద్రవ్య సమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ పెంచడం ఖాయంగానే కనిపిస్తున్నది. ఇదే జరిగితే నిర్మాణ, ఆటో రంగాలకు పెద్ద దెబ్బేనన్న విశ్లేషణలుంటున్నాయి. ఇప్పటికే ఇండ్ల విక్రయాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది.

చలో మేడారం ను విజయవంతం చేయండి

:- దొమ్మాటి కిరణ్ కుమార్ రావు



కాప్రా/ ఓ.యునవంబర్ 18(విజన్ ఆంధ్ర ప్రతినిధి) ఈనెల 22న ములుగు జిల్లా మేడారంలో నిర్వహించనున్న చలో మేడరాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్ దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, కో కన్వీనర్ కీర్తి శ్రీనివాస్, బంగారు మల్లేష్ చారి(శ్రీనివాస చారి), దసరం శ్రీనివాస్,అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల ఐక్యతను చాటడంతో పాటు వారి హక్కులు, సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ పై చర్చించేందుకు మేడారంలో నిర్వహించే సమావేశం కీలకమన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకం అందించడమే ధ్యేయం

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో నూతన చేయూత పింఛన్ల మంజూరు ధ్రువీకరణ పత్రాలు, డిజిటల్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో ప్రతి నెల రూ.11 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తూ వేలాది పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అమలైన ప్రజలకు ఉపయోగపడే పథకాలను కొనసాగిస్తూనే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంపై గత పాలకులు లక్షల కోట్ల అప్పుల భారం



మోపినప్పటికీ పేదల సంక్షేమానికి ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదన్నారు.రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నామని వివరించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. నవంబర్ 19 నుంచి ఈ పథకం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గానికి ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించామని, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించి గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు వంటి రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తోందన్నారు.ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, నీటిని, విద్యుత్ ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, ఖిల్లా ఘణపురం మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు నవనీత క్యామ రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పద్మమ్మ, మండల అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, రవి నాయక్, వెంకట్రావు, మురళీధర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఆగారం ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ గడువు డిసెంబర్ 22 వరకు పొడిగింపు అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం గడువును డిసెంబర్ 22వ తేదీ వరకు పొడిగించిన నేపథ్యంలో, ఈ అవకాశాన్ని అర్హులైన ఓటర్లు సద్వినియోగం చేసుకునేలా రాజకీయ పార్టీలు ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సూచించారు.బుధవారం మధ్యాహ్నం అదనపు కలెక్టర్ తన ఛాంబర్ లో ఎస్ఐఆర్ పురోగతి, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పన తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని వారికి, కొనసాగింపు ప్రక్రియలో భాగంగా మరో అవకాశం కల్పించినట్లు వివరించారు. ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అవసరమైన పత్రాలతో తమ వివరాలను సమర్పించాలని సూచించారు.ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటరు నమోదు, అభ్యంతరాలు, సవరణలకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 29,272 దరఖాస్తులుపట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వనపర్తి జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 29,272 ఓటరు



నమోదు దరఖాస్తులు అందినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. వీటిలో సుమారు 27 వేలకు పైగా దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిశీలించి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ నెల 25వ తేదీన పట్టభద్రుల ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ముసాయిదా జాబితా విడుదల అనంతరం కూడా నిబంధనల ప్రకారం ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించనున్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్ రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

వైద్య శాఖ కార్యక్రమాల పనితీరు మెరుగుపడాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి జిల్లా ప్రతినిధి,నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)వైద్య శాఖ పరిధిలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, వాటి పనితీరును మరింత మెరుగుపరిచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆభా కార్డుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ కనీసం 200 ఆభా కార్డులు జనరేట్ చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు.అదేవిధంగా జిల్లాలో 108 అంబులెన్స్ సేవల వినియోగాన్ని పెంచాలని, అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులు ఈ వాహనాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల సంఖ్యను పెంచాలని, ముందస్తు గుర్తింపు ద్వారా బాధితులకు సకాలంలో వైద్య



సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. టీ-హబ్ ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారికి అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో అమలవుతున్న అన్ని కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో సాధించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, పనితీరులో ఆశించిన పురోగతి సాధించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర మోహన్, ఇతర వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా గంట్ల రాజిరెడ్డి

శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

శేరిలింగంపల్లి. నవంబర్ 18:(విజన్ ఆంధ్ర)తెలంగాణ యూనియన్ ఆఫ్‌వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శేరిలింగంపల్లి కి చెందిన సీనియర్ జర్నలిస్టు గంట్ల రాజిరెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన గంట్ల రాజిరెడ్డిని బుధవారం శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చందనగర్ లోని పి జె ఆర్ స్టేడియంలో నిర్వహించిన కార్యాక్రమనికి రాష్ట్ర నాయకులు పైళ్ల విఠల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డి లతో పాటు జర్నలిస్టులు హాజరై గంట్ల రాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ?ఈ సందర్భంగా గంట్ల రాజిరెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లకు కృతజ్ఞతలు తెలిపారు.



క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు తదితర సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులతో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని రాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

భూపతి చంద్ర స్మారక కథానికల పోటీకి రచనల ఆహ్వానం

హైదరాబాద్, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ-2027కు రచయితలు, రచయిత్రుల నుంచి కథానికలను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎల్.కాంతారావు తెలిపారు. సమకాలీన సామాజిక సమస్యలు, మానవీయ విలువలు, వైవిధ్యమైన అంశాలతో కూడిన కథానికలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోటీలో ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందజేయనున్నారు. అదేవిధంగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. పోటీకి పంపే కథానికలు ఏ4 సైజులో డీటీపీ లేదా వర్డ్ ఫైల్ రూపంలో నాలుగు పేజీలకు మించకుండా ఉండాలి. గతంలో ఏ పత్రికలోనూ ప్రచురితం కాని స్వీయ రచనలనే పంపాలి. కథానిక అనువాదం, అనుసరణ లేదా అనుకరణ కాదని, ఎక్కడా ప్రచురితం కాలేదని, ఇతర పరిశీలనలో లేదని హామీ పత్రం జతచేయాలి. కథానిక ప్రతులపై రచయిత పేరు ఉండకూడదు. కథ పేరుతో పాటు కలం పేరు, స్వంత పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను ప్రత్యేకంగా జతచేయాలి. ఒక్కొక్కరు ఒక కథానిక మాత్రమే పంపేందుకు అర్హులు. కథానికలు పంపేందుకు చివరి తేదీ 2026 డిసెంబర్ 25గా నిర్ణయించారు. ఆసక్తి గలవారు ఎిఎిఎిఖఅ్థుఎిఖఅ్రీ.ఆశిఎ ఈమెయిల్ ద్వారా, 9793059793 వాట్సాప్ నంబర్‌కు లేదా పోస్టు, కొరియర్ ద్వారా పంపవచ్చు. పోస్టు ద్వారా పంపాల్సిన చిరునామా: సమన్వయకర్త, 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ-2027, ఆనంద నిలయం, ఇంటి నంబర్ 1-5-1020/4, బి.ఆర్.రావు నగర్, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్-500010. ఇతర వివరాలకు 9963616999 నంబర్‌ను సంప్రదించాలని కాంతారావు సూచించారు. బహుమతుల విషయంలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయమని, పోటీకి వచ్చిన కథానికలను తిరిగి పంపబోమని, వాటిని ప్రచురించే హక్కు నిర్వాహకులకు ఉంటుందని తెలిపారు.

మేనిఫెస్టోకు మూడేళ్లు కాంగ్రెస్ నయవంచనకు మూడేళ్లు!

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ :18(విజన్ ఆంధ్ర)గొప్పగా చెప్పుకున్న అభయహస్తం.. హామీలను అమలు చేయని మొండి హస్తంగా మారింది అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు మేనిఫెస్టో మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని, దానిని తూచా తప్పకుండా అమలు చేస్తామని మూడేళ్ల మల్లికార్జున ఖర్గే గారి సమక్షంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మూడేళ్లు గడిచినా ఆ హామీలకు దిక్కులేదు. అమలు ఊసే లేదు. అభయ హస్తం.. శూన్య హస్తం అయ్యిందిఓట్లు వేసిన ప్రజలనే కాదు.. ఒట్లు వేసి దేవుళ్లను, పవిత్ర గ్రంథాలను సైతం మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. గాంధీ భవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదు? ఖర్గే గారు, రేవంత్ రెడ్డి గారు, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు గారు, భట్టి విక్రమార్క గారు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాంతొలి క్యాబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ నీటిమూటగానే మిగిలింది. ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు జరిగినా.. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదు? మేనిఫెస్టో పేరుతో మాయమాటలు చెప్పి అధికారంలోకి



వచ్చి, హామీల అమలును గాలికొదిలేసారు.ఆరు గ్యారెంటీలు 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క హామీకి తూట్లు పొడిచారు.గాంధీ పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే కాంగ్రెస్.. గాంధీభవన్ సాక్షిగా ఇచ్చిన హామీలు కూడా అమలు చేయలేక పోవడం సిగ్గుచేటు.కాంగ్రెస్ మోసపూరిత వైఖరి చూస్తే గాంధీ ఆత్మ కూడా క్షోభిస్తుంది.ప్రజల ఆశలను ఓట్లుగా మార్చుకున్నారు. అధికారాన్ని అందుకున్నాక ఆ ఆశలను ఆవిరి చేశారు.హామీలు అమలు చేయకుండా మూడేళ్లుగా ప్రజలను మభ్యపెట్టడమే కాంగ్రెస్ సాధించిన ఘనతకాంగ్రెస్ మాయమాటలను, నయవంచనను తెలంగాణ ప్రజలు ఇప్పటికే గుర్తించారు. ఇక మిగిలింది తగిన గుణపాఠం చెప్పడమే!కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యింది.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి, చేసిన ప్రతి మోసానికి కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదు!

చింతకుంటలో సబ్ కలెక్టర్ పర్యటన వీవో భవన నిర్మాణ సమస్యను త్వరగా పరిష్కరించాలి

సిర్పూర్ (టి), నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం చింతకుంట గ్రామంలో సబ్ కలెక్టర్ హర్ష చౌదరి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా భూ వివాదం కారణంగా నిలిచిపోయిన మహిళా సమైక్య (వీవో) భవన నిర్మాణ పనులను తహసీల్దార్ రహీముద్దీన్, గ్రామ సర్పంచ్ అజ్మీరా చత్రు నాయక్‌తో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణ పనులు నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ స్థలాన్ని వెంటనే సర్వే చేయించి, భూ సమస్యను పరిష్కరించి పనులు



త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అజ్మీరా చత్రు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, భూ సమస్యల కారణంగా అనేక గ్రామాల్లో వీవో భవన నిర్మాణాలు ముందుకు సాగడం లేదని అన్నారు. చింతకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని నాలుగు అంగన్వాడీ కేంద్రాలకు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను త్వరగా కేటాయించాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ హర్ష చౌదరి గ్రామానికి అవసరమైన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సంబంధించిన భూ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీవో భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాజిరెడ్డి మోహన్, వార్డు సభ్యులు బొట్లకుంట శ్రీనివాస్, పబ్బతి శేఖర్, మొగిలి రాజేష్, బానోత్ వినోద్, అజ్మీరా మోహన్, భూక్య విగ్నేష్, చిపల్లి రమేష్, కాటెబోయిన పోశయ్య, పెంటపర్తి రాజ్‌కుమార్, వీవో అధ్యక్షురాలు కన్నెపల్లి కమల, లావుడే విజయ, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమాపై మున్సిపాలిటీలో అవగాహన సమావేశం



ములుగు నవంబర్ 18;విజన్ ఆంధ్ర ప్రతినిధి.ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం కౌన్సిలర్లు, సిబ్బందికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కుటుంబంలో 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఒకరికి ఈ బీమా వర్తిస్తుందని వివరించారు.నామినీ వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని, నమోదు తర్వాత ప్రింట్ తీసి లబ్ధిదారుడి సంతకం తీసుకోవాలని సూచించారు.ములుగు మున్సిపాలిటీలో జీవంతారావుపల్లి, పాల్ సాబ్ పల్లి, బండారుపల్లి, గాంధీ పార్క్, మున్సిపల్ కార్యాలయంలో మొత్తం 5 కేంద్రాల్లో ఈ నెల 20 నుంచి డిసెంబర్ 18 వరకు నమోదు జరుగుతుందని తెలిపారు.సమావేశంలో వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ క్రీడాకారులకు ప్రతిభ నిరూపణకు అవకాశం

-డిసెంబరు 3 నుంచి 9 వరకు ప్రతిభ గుర్తింపు పరీక్షలు
-జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-18(విజన్ ఆంధ్ర)దివ్యాంగ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు 'సాట్‌జీ (ఎస్ఎస్+) -- పారా స్పోర్ట్స్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్ 2026-27' నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్ తెలిపారు. కలెక్టర్ అనుమతితో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, ఆదిత్య మెహతా ఫౌండేషన్ సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలోని 12 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సున్న దివ్యాంగులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. తొలుత ఆన్‌లైన్ స్క్రీనింగ్, అర్హత పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. నవంబరు 20న జిల్లా నోడల్ అధికారులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబరు 3 నుంచి 9 వరకు దివ్యాంగ అభ్యర్థులకు ఆన్‌లైన్ స్క్రీనింగ్, అర్హత పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఇందులో ఎంపికైన వారికి జనవరి 2027లో హైదరాబాద్‌లో 10వ జాతీయ ప్రతిభ గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు.పాల్గొనే అభ్యర్థులు తప్పనిసరిగా యూడీఐడీ కార్డు, దివ్యాంగ ధ్రువీకరణ పత్రం, వయస్సు ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని సూచించారు. 18 ఏళ్లలోపు వారు తల్లిదండ్రులు లేదా సంరక్షకులతో కలిసి పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా దివ్యాంగ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9963960063 నంబరులో సంప్రదించాలని సూచించారు.


పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్వో



నిజామాబాద్ నవంబర్18:(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ నిజామాబాద్ పట్టణంలోని గౌతమ్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని, టీకాల అర్హుల జాబితా లిస్టును, సెషన్ ప్లాన్ను, డ్రాప్ అవుట్ పిల్లల జాబితాను, పరిశీలించి వంద శాతం వ్యాధినిర్ధక టీకాలను ఇవ్వాలని అన్నారు. తప్పిపోయిన ప్రతి పిల్లాడిని ఆశ వ్యక్తిగతంగా పర్యవేక్షించి టీకాలు ఇవ్వాలి అన్నారు. డి ఫ్రీజర్, ఐఎల్ఆర్ ను చూసి, కోల్డ్ చైన్ నిర్వహిస్తూ, టెంపరేచర్ రికార్డు చేయాలన్నారు. ఆసుపత్రిలో జరిగే ప్రసవాలు, గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్టరు, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీల రికార్డులను పరిశీలించి 100% ఆస్పత్రి ప్రసవాలు జరగాలని, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీలను ముందుగానే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణకు 14 ఏళ్ల బాలికలకు హెచ్పీవీ టీకాలను అర్హులైన బాలికలు అందరికీ ఇవ్వాలని, తల్లిదండ్రులకు టీకాపై అవగాహన కలిగించాలని, పెండింగ్ లో ఉన్న టీకాలను మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ ఆరోగ్య మహిళ ద్వారా జీవనశైలి వ్యాధుల నియంత్రణ కోసం మరియు మహిళల ఆరోగ్య కోసం పరీక్షలు నిర్వహించాలన్నారు. ల్యాబ్ రికార్డులు, శాంపుల్ రిపోర్టులు, నాకు రిజిస్టర్, రిజిస్టర్, హెచ్ఎంఐఎస్ రిపోర్ట్ లను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులను రిపోర్టులను ఎప్పటికప్పుడు సవరించుకుంటూ నాణ్యమైన సేవలను అందించాలని వైద్యాధికారికి మరియు వైద్య సిబ్బందికి తెలియజేశారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి వైద్యాధికారిని మైత్రి, ఫార్మసిస్టు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సుర్వం అనితకు జాతీయ కార్యదర్శి అదిత అభినందనలు

మారుమూల గిరిజన గ్రామం నుంచి జిల్లా అధ్యక్షురాలిగా ఎదగడం అభినందనీయం



ఆసిఫాబాద్. నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన సుర్వం అనితకు ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రీమతి అదిత అభినందనలు తెలిపారు. మారుమూల గిరిజన గ్రామమైన మాలిని నుంచి వచ్చిన గిరిజన మహిళకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలను ఎప్పుడూ గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సుర్వం అనితకు సూచించారు. అనంతరం సుర్వం అనిత జాతీయ కార్యదర్శి అదిత నివాసానికి వెళ్లి తన నియామకానికి మద్దతుగా నిలిచి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, పార్టీ పెద్దలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మహిళా నాయకులకు పిలుపునిచ్చారు. త్వరలోనే మండల స్థాయిలో మహిళా కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతికి, మారుమూల ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతంలో మహిళల పాత్ర కీలకమని, మహిళా నాయకులంతా ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలిని సర్పంచ్ మాణిక్ రావు, నాయకులు ఓదేలు, నగేష్, అర్జున్, శంకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సభా ప్రాంగణంలో వివేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక వెంకటస్వామి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి18 నవంబర్ (విజన్ ఆంధ్ర) సిద్దిపేటలో రేపు జరగబోయే 19వ తేదీన సిద్దిపేటలో నిర్వహించే రాష్ట్ర ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి సిద్దిపేటలో పర్యటించి ముఖ్యమంత్రి నిర్వహించే బహిరంగ సభప్రాంతాన్నిసందర్శించి సభఏర్పాట్లనుపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు సిద్ధిపేటకు హెలికాప్టర్ ద్వారా చేరుకొని ముస్తాబాద్ చౌరస్తాలో ఇందిరాగాంధీ గారి విగ్రహానికి పూలమాలవేసి రెండు కిలోమీటర్ల దూరం పాదయాత్ర ద్వారా సభస్థలికి చేరుకొని ఇందిరమ్మ కుటుంబ బీమాపథకాన్నిప్రారంభిస్తారని, ఇందిరమ్మ చీరల పంపిణీ, వివిధ జిల్లా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలను చేసి బహిరంగసభకు భారీ సంఖ్యలో హాజరయ్యే ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తారని తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా విద్యుత్, త్రాగునీరు, మరుగుదొడ్లు, సీటింగ్ తదితర అన్ని సౌకర్యాలనుపగడ్బందీగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్యుల వెంట ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మ తల్లిని ప్రోత్సహించిన మున్సిపల్ వైస్ చైర్మన్

లాప్టాప్ కొనలేని విద్యార్థినికి ఆర్థిక అండ

కుటుంబానికి ఆసరాగా నిలవాలని శుభాశీస్సులు అందజేసిన వైస్ చైర్మన్

వికారాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి మానవతా దృక్పథం



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : చదువులమ్మ తల్లికి లాప్టాప్ అందజేసి భరోసా కల్పించిన వికారాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి. బీటెక్ చదువుతున్న బీటెక్ విద్యార్థినికి లాప్టాప్ అందజేసి చదువుపై భరోసా కల్పించిన మానవతావాది మున్సిపల్ వైస్ చైర్మన్. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోగల 25వ వార్డుకు చెందిన బీటెక్ విద్యార్థిని లాప్టాప్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకొని వెంటనే స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్. మానవతా దృక్పథంతో స్పందించి ఆ విద్యార్థినికి చదువుపై భరోసా కల్పించడమే లక్ష్యంగా లాప్టాప్ అందజేశారు. తన సొంత డబ్బులు 30 వేల రూపాయలతో ల్యాప్‌టాప్ కొని ఆ విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డికి మాట్లాడుతూ – చదువుకునే విద్యార్థులకు సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తానని, పేద విద్యార్థులు చదువులో వెనుకబడకూడదని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. తనకున్నంతలో విద్యార్థులకు, పేదలకు సహాయం చేస్తూనే ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ వినోద్ కుమార్ ఉన్నారు. ల్యాప్‌టాప్ అందుకున్న విద్యార్థి, వారి తల్లిదండ్రులు సుధాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుప్రాముఖ్యత తెలుసుకోవాలి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.



నిర్మల్ జిల్లా,నవంబర్ 18,(విజన్ ఆంధ్ర); విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ప్రాముఖ్యత తెలుసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఓటర్ల అవగాహన కోసం ఎస్ఐఆర్ కు సంబంధించి జిల్లా స్థాయి ఈఎల్ సి (ఎలక్టోరల్ లిటరసీ క్లబ్) పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భారత దేశంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అనేది వజ్రాయుధంలాంటిదని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు ప్రాముఖ్యత తెలుసుకొని సమాజంలో ప్రజలను చైతన్యపరచాలని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకునే స్వేచ్ఛ మన దేశంలో ఉందని వివరించారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు మాట్లాడుతూ, ఓటు హక్కు ఎంతో విలువైనదని అన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటి జిల్లా పేరు నిలపాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులను నియోజకవర్గ బృందాలుగా విభజించి, భారత ఎన్నికల వ్యవస్థ, ఎస్ఐఆర్, తదితర అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలలో ఖానాపూర్ నియోజకవర్గ బృందం విజయం సాధించింది. విజయం సాధించిన విద్యార్థులను అధికారులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. ఈ పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వాతి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ రాజకీయ ప్రతినిధిపై చర్యలు తీసుకోవాలి

భారత్ సమ్మిట్ పేరుతో చట్టపరమైన ఉల్లంఘన

పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ నవంబర్18:(విజన్ ఆంధ్ర) ఇటీవల హైదరాబాద్ లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్ లో విదేశీ రాజకీయ నాయకుడు జియోకోమో ఫిలిటిక్ చట్టాన్ని ఉల్లంఘించి మాట్లాడారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విదేశీయుడైన జియోకోమో తన ప్రసంగంతో వీసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ చట్టాల ఉల్లంఘనకు పాల్పడ్డారని తెలిపారు. కావున పూర్తి విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన సదస్సులో ప్రసంగిస్తూ " ఓటు చోర్.. గద్ది చోడ్" అనే నినాదం చేసి, భారత అంతర్గత వ్యవహారాలను బహిరంగంగా చెప్పడం తగదన్నారు. ఇందుకు రాహుల్ గాంధీ తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవ్వడం సిగ్గుచేటని పేర్కొన్నారు.దేశంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సులు, సెమినార్లు, వర్క్ షాప్ లు ఇతర కార్యక్రమాలు నిర్వహించినప్పుడు విదేశీ ప్రతినిధులు దేశ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని గుర్తు చేశారు. అలాగే ప్రత్యేక పొలిటికల్ క్లియరెన్స్ ఇస్తుందన్నారు. కానీ వీటన్నిటి ఉల్లంఘిస్తూ ప్రసంగం చేయడం దేశ పౌరులను అవమానించడమేనన్నారు. కావున ఈ ఉల్లంఘనలను పరిగణలోకి తీసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పింఛన్ల మంజూరు పత్రాలు అందజేసిన

ఎమ్మెల్యే విజయుడు, మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్



అయిజ నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో పింఛన్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొని స్వయంగా పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పాట ప్రజల చైతన్య దీపిక

బి. కరుణాకర్ ,ఎస్పై (సైబర్ క్రైమ్)



మాహాబుబాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 18(విజన్ఆంధ్ర): మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఈరోజు (బుధవారం) దేశభక్తి గీతాలు (పాటల పోటీ) నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సైబర్ క్రైమ్ ,ఎస్పై బి. కరుణాకర్ మాట్లాడుతూ పాట ప్రజల చైతన్య దీపికా అని అన్నారు. పాట పరిధి చిన్నది పవర్ గొప్పది ఆ మాటకొస్తే ఎక్కుపెట్టిన ధనస్సు కన్న మహా శక్తివంతమైనది, చేతాడంత వ్యాసమైన, ఉపన్యాసమైన మూడు నిమిషాల పాటు రాదు. అంటూ తన రాగంతో రసరమే లోకాలను సృష్టిస్తుంది, తన భావాన్ని సూటిగా దాటిగా నాటి ఆలోచింపజేస్తుంది అని అంటూ, సైబర్ క్రైమ్ గురించి విద్యార్థిని విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు జి. విజేందర్, రుద్రారపు వీరేందర్, న్యాయ నిర్ణయతగా తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారులు బండ వెంకన్న ,డి ప్రవీణ్, వ్యవహరించారు సిబ్బంది బొడ్డుపల్లి భూలక్ష్మి యాదమ్మ ఉపాధ్యాయులు ప్రవీణ్, జి సుమన్, సురాంబా తనూజ ,హిమబిందు గ్రంథాలయ పాఠకులు పుస్తక ప్రియులు తదితరులు పాల్గొన్నారు

పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



మందమర్రి,నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు పట్టుదలతో చదివి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్.ఎస్.ఆర్.డబ్ల్యూ నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. అనంతరం ఏరియాకు తొలిసారిగా వచ్చిన ఆయనను జిఎం రాధాకృష్ణ ఉన్నత అధికారులు శాలువాతో సన్మానించారు. త్వరలోనే బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అశోక్,ప్రధాన ఉపాధ్యాయులు పురుషోత్తం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో తెలంగాణకు రెండో స్థానం

-పెద్దపల్లి జిల్లాకు 'సురక్షిత్' హోదా
-జిల్లా యంత్రాంగం,వైద్య ఆరోగ్య శాఖ సమిష్టి కృషికి జాతీయ గుర్తింపు
-కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-18(విజన్ ఆంధ్ర)హెచ్ఐవీ నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని సాధించడం గర్వకారణమని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. డిసెంబర్ 2023లో జాతీయ స్థాయిలో 32వ స్థానంలో ఉన్న రాష్ట్రం, గత ఆర్థిక సంవత్సరంలో 13వ స్థానానికి చేరుకుని ప్రస్తుతం రెండో స్థానాన్నికైవసం చేసుకోవడం వైద్య ఆరోగ్య శాఖ కృషికి నిదర్శనమన్నారు.రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 20 జిల్లాలు హెచ్ఐవీ నియంత్రణకు నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను సాధించి 'సురక్షిత్' హోదా పొందాయని తెలిపారు. ఈ గుర్తింపు పొందిన జిల్లాల్లో పెద్దపల్లి కూడా ఉండటం సంతోషకరమన్నారు. లక్ష్యాల సాధనలో వైద్యాధికారులు, సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేశారని అభినందించారు. హెచ్ఐవీపై అవగాహన, సకాలంలో పరీక్షలు, నిరంతర చికిత్సతో నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థంగా కొనసాగించాలని సూచించారు.

5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు వేడుకల ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్ నవంబర్18:(విజన్ ఆంధ్ర)నిజామాబాద్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐ.పి.యస్ క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జానకంపేటలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్ ముగింపు వేడుకల కోసం ఏర్పాటు చేస్తున్న పరేడ్ గ్రౌండ్ , ప్రధాన వేదిక (స్టేజ్) , అతిథుల గ్యాలరీ , క్రీడాకారులు మరియు పోలీస్ సిబ్బందికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా బోధన్ ఎసిపి శ్రీనివాస్ , ఐటీ సెల్ ఎసిపి నరేందర్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్ , బోధన్ రూరల్ సీఐ విజయబాబు , రిజర్వ్ ఇన్స్పెక్టర్ ధరణి , ఎం.టి.ఓ శేఖర్ బాబు , ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వినోద్ , ఎస్సైలు , ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొనడం జరిగింది.

కృత్రిమ రంగులు లేని హిమాలయన్ రాక్ సాల్ట్



హైదరాబాద్, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : సహజసిద్ధమైన ఆహార పదార్థాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో హిమాలయన్ రాక్ సాల్ట్‌కు ఆదరణ పెరుగుతోందని టాటా సాల్ట్ సంస్థ ప్రతినిధులు బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ టాటా సాల్ట్ హిమాలయన్ రాక్ సాల్ట్‌లో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి సహజ ఖనిజాలు స్వల్ప పరిమాణంలో ఉంటాయని తెలిపారు. ఈ ఉప్పుకు సహజంగా వివిధ రంగులు రావడానికి అందులోని ఖనిజ కణాలే కారణమని పేర్కొన్నారు. ఉప్పును నీటిలో కరిగించి వడపోస్తే నీటిలో కరగని రంగు కణాలు ఫిల్టర్‌పై మిగిలిపోతాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రయోగశాల పరీక్షల్లో తమ ఉత్పత్తిలో కృత్రిమ ఆహార రంగులు లేవని, సంబంధిత నాణ్యత, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. వంటల్లోనూ, వంటకాలకు చివరగా ప్రత్యేక రుచి అందించేందుకూ హిమాలయన్ రాక్ సాల్ట్‌ను ఉపయోగించవచ్చని తెలిపారు. సహజ ఖనిజాల ఉనికితో పాటు టాటా బ్రాండ్ నాణ్యతపై వినియోగదారులకు నమ్మకం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై టీజేఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



హైదరాబాద్, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్(టీజేఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం రవీంద్ర భారతిలో రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు ఉప్పల లక్ష్మణ్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లు త్వరగా కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. టీజేఏకు ప్రభుత్వ గుర్తింపు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి రమణారావు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి జిల్లాలో యూనియన్‌ను బలోపేతం చేయాలని జనరల్ సెక్రటరీ గోరి పిలుపునిచ్చారు. ఎన్‌యూజేఐ ఉపాధ్యక్షులు రాజేంద్రనాథ్, ఖలీల్, ఖాసీం, రాజలింగం, సత్నం సింగ్, వివిధ జిల్లాల అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, విద్య, వైద్యం, ఇళ్ల స్థలాలు, గృహాల సమస్యలతో పాటు జనవరిలో నిర్వహించనున్న రాష్ట్ర, జిల్లా సార్వత్రిక ఎన్నికలపై చర్చించారు.

వి బి జి రామ్ జి పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు – జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 18:(విజన్ ఆంధ్ర)వి బి జి రామ్ జి పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లాలోని కెరమెరి మండల కేంద్రంలో వి బి జి రామ్ జి పథకంలో నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదు మేరకు బుధవారం మండల కేంద్రంలోని గల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వి బి జి రామ్ జి పథకంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెట్ల పథకంలో పనులు చేయకున్నా, కూలీలు హాజరు కాకున్నా హాజరైనట్లుగా నిధులు కాజేసారని ఫిర్యాదు రావడంతో కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, ఎం.బి. బుక్కులను పరిశీలించగా నిధులు కాజేసినట్లు తేలడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అక్రమాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఆపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్, నవంబర్ 18 :(విజన్ ఆంధ్ర) మాక్లూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. వంట గది, స్టోర్ రూంలో సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. విద్యార్థినుల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. సరుకుల సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని, స్టాక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. కాగా, గత కొన్ని రోజులుగా నిత్యావసరాలలో కొన్ని రకాల సరుకులను కాంట్రాక్టర్ పంపకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్పెషల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తేగా, ఎప్పటికప్పుడు నిత్యావసరాల కోసం విద్యా శాఖ ద్వారా ప్రత్యేకంగా నిధులను అందజేయించారు. నిత్యావసరాలు సమకూర్చే కాంట్రాక్ట్ ఏజెన్సీని సంప్రదించి సరుకులు సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు. కాగా, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు. ఇంటర్ మీడియట్ విద్యార్థినులకు నీట్ కోచింగ్ అందిస్తుండడం పట్ల కలెక్టర్ అభినందిస్తూ, అత్యధిక మందికి ప్రవేశాలు లభించేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థినులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి భేటీ అయ్యారు. వారికి పలు ప్రశ్నలు వేస్తూ అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, ఎంఈఓ సత్యనారాయణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తదితరులు ఉన్నారు

ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పార్టీ కండువా తో సమావేశం లో పాల్గొనాలి డి సి సి అధ్యక్షుడు నరేశ్ జాదవ్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, వివిధ నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న నాయకులకు, ప్రజాప్రతినిధులకు మరియు పార్టీ ముఖ్య బాధ్యులకు నా విజ్ఞప్తి.మనమందరం కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులుగా, మన భుజంపై కాంగ్రెస్ పార్టీ కండువాను తప్పనిసరిగా ధరించాలని కోరుతున్నాను.ముఖ్యంగా ప్రతి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో, పార్టీ కార్యక్రమంలోనే కాకుండా, ప్రభుత్వ పరంగా నిర్వహించే అధికారిక సమావేశాలు, సమీక్షా సమావేశాలు మరియు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యే సందర్భాల్లో కూడా వివిధ నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా తమ భుజంపై కాంగ్రెస్ పార్టీ కండువాను ధరించాలని మనవి చేస్తున్నాను.కాంగ్రెస్ పార్టీ కండువా కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు. అది మన పార్టీ గుర్తింపుకు, సిద్ధాంతాలకు, విలువలకు మరియు మన బాధ్యతకు ప్రతీక. మనం ప్రతి సందర్భంలోనూ కండువా ధరించడం ద్వారా ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తింపు, గౌరవం మరింత స్పష్టంగా కనిపించడంతో పాటు, పార్టీ కార్యకర్తల్లో కూడా నూతన ఉత్సాహం, మనోధైర్యం పెరుగుతాయి.అందువల్ల పార్టీ గౌరవాన్ని పెంపొందించేందుకు, కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచేందుకు, మనమందరం ప్రతి పార్టీ సమావేశాల్లో, పార్టీ కార్యక్రమంలో మరియు ప్రభుత్వ పరమైన అధికారిక సమావేశాల్లో సైతం కాంగ్రెస్ పార్టీ కండువాను తప్పనిసరిగా భుజంపై ధరించాలని కోరుతూ మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంను విజయవంతం చేయాలి

నవంబర్ 19న సిద్దిపేట నుంచి పథకాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నవంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గద్వాల సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి పలువురు జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19న సిద్దిపేట జిల్లా నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రారంభించే సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో కూడా పథకాన్ని ఒకేసారి ప్రారంభించాలని స్పష్టం చేశారు.ప్రారంభోత్సవ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించనున్న నేపథ్యంలో ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించాలని సీఎస్ సూచించారు. రాబోయే రెండు వారాల పాటు గ్రామాల వారీగా, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తుల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన దరఖాస్తు ఫారాన్ని సేకరించాలని, అందులో బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు తదితర అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా నమోదు చేయించాలని తెలిపారు. దరఖాస్తుల సేకరణ సమయంలో బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు అందేలా గ్రామ, వార్డు స్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దరఖాస్తుల సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఏ కుటుంబం కూడా ఈ పథకం ప్రయోజనాలకు దూరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సీఎస్ సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాలు, ప్రజా సమావేశాల ద్వారా పథకం వివరాలను ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.గ్రామాలు, మున్సిపల్ వార్డుల స్థాయిలో నిర్వహించే ప్రత్యేక శిబిరాల వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని తెలిపారు.జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి ప్రారంభోత్సవ కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాల నిర్వహణ, దరఖాస్తుల సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, సిపిఓ పాపయ్య ,ఈడియం శివ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ
జిల్లాలోని 335 గ్రామపంచాయతీలు, 2 మున్సిపాలిటీల పరిధిలో అర్హుల గుర్తింపునకు ప్రత్యేక కార్యాచరణ
జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐ.ఎ.ఎస్.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 18:(విజన్ ఆంధ్ర)రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి, కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు.కుటుంబంలో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తి అనుకోకుండా మరణించినప్పుడు ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను తగ్గించి, వారి జీవన భద్రతకు భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు 5 లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

18 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారికి అర్హత

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన వ్యక్తులు అర్హత పొందుతారని తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియలో రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకొని కుటుంబ వివరాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. జనాభా లెక్కల సేకరణ వివరాలు పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని, ఒకవేళ రేషన్ కార్డు లేకపోతే ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

335 గ్రామపంచాయతీలు, 2 మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలోని 335 గ్రామపంచాయతీలు, 2 మున్సిపాలిటీల పరిధిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామపంచాయతీల వారీగా, పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ వార్డుల వారీగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు. జనాభా, వార్డులు/గ్రామపంచాయతీల సంఖ్య ఆధారంగా శిబిరాలు నిర్వహించి లబ్ధిదారుల వివరాలు, సంతకంతో కూడిన దరఖాస్తు పత్రాలను స్కాన్ చేసి సంబంధిత బీమా సంస్థకు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు లబ్ధిదారుల వివరాలు సేకరించిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని, ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని వివరాలు అందించవలసి ఉంటుందని తెలిపారు. కార్యచరణ ప్రణాళికలో భాగంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంలో చోటు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు, పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హుల వివరాల సేకరణ, పరిశీలన ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజలకు పథకంపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.

వివరాల నమోదుప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంలో వివరాల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, మొదట జిల్లా పేరు, ఆ తర్వాత మున్సిపాలిటీ, మండలం, గ్రామం, వార్డు పేర్లను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకంలో వర్తించే బీమాదారునిగా కుటుంబ పెద్ద పోషకుడు, తండ్రి / భర్త పేరు నమోదు చేసి కుటుంబసభ్యుల పేర్లు, బంధుత్వం వివరాలు నమోదు చేయవలసి ఉంటుందని, భవిష్యత్తులో బీమా మొత్తం చెల్లించేందుకు వీలుగా నామినీ పేరు, ప్రతిపాదకులు నియమించిన వ్యక్తి బీమాదారులతో ఉన్న సంబంధం, ఆధార్ సంతకం, చివరగా అధికారిక సంతకం ప్రక్రియతో లబ్ధిదారుని సంతకాన్ని కంప్యూటర్ లో నిక్షిప్తం చేస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలి జిల్లాలోని మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలో నివసించే అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పథకం అర్హతలు, అవసరమైన వివరాలపై అవగాహన కల్పించాలని, అర్హుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హుల వివరాల సేకరణ, పరిశీలన ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ, అనుకోని ఆపద సమయంలో వారికి అండగా నిలిచే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతతో పని చేయాలని తెలిపారు.

టీఏజీఎస్ రాష్ట్ర మహాసభల గోడప్రతుల ఆవిష్కరణ ఈ నెల 27, 28 తేదీల్లో నాలుగో రాష్ట్ర మహాసభలు

సిర్పూర్ (టి), నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం చీలపల్లి, లింబుగూడ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నాలుగో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడప్రతులను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం నాయకుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోడు భూముల హక్కుల సాధన, అటవీ హక్కుల పరిరక్షణ, ఆదివాసీల ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు రాజ్యాంగ హక్కుల సాధనే లక్ష్యంగా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, నిరుద్యోగం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం, పీసా చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ఆదివాసీల భాష, సంస్కృతి, జీవన విధానం, సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 27న సాంస్కృతిక కార్యక్రమాలతో మహాసభలు ప్రారంభమవుతాయని, 28న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మహాసభలకు ఆదివాసీలు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ కార్యదర్శి తిరుమల, నాయకులు సునీత, సిడాం రాంబాయి, మెస్రం బిజులబాయి, ఆత్రం విజయలక్ష్మి, వేలాది కళావతి, సూర్పం తానుబాయి, కుర్సెంగ నీలాబాయి, సూర్పం లచ్చుబాయి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన.. సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

- సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి: అధికారులకు మంత్రి ఆదేశం

- రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు







సంగారెడ్డి డెస్క్ నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సిద్దిపేట జిల్లాలో పర్యటించారు. ఈ నెల 19న (గురువారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సభా ప్రాంగణం, వేదిక ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించిన మంత్రి.. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా రూ.544.11 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు.బహిరంగ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున సభా వేదిక, కుర్చీలు, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టమ్, వైద్య శిబిరం, అంబులెన్స్‌ల ఏర్పాటు తదితర అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు.అలాగే ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు హెలిప్యాడ్ ఏర్పాటు, ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు.ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సభను విజయవంతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు.

భక్తి అంటే పూజ కాదు - మనసును భగవంతునికి అర్పించడం

- దాతగా నిలిచిన మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం

- కల్వకుర్తి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా నిత్య అన్నప్రసాద వితరణ





కల్వకుర్తి:లి భక్తి అంటే కేవలం దేవాలయానికి రావడం, పూజ చేయడం మాత్రమే కాదు, మనసును పూర్తిగా భగవంతునికి అర్పించడమే నిజమైన భక్తి అని మరోసారి నిరూపితమైంది. కల్వకుర్తి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం జరిగిన నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఇదే భావన కనిపించింది. శివ గురు స్వామి కార్వంగ ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్వకుర్తి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం దాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి స్వయంగా ఆయన హాజరు కాలేదు, అయినప్పటికీ దాతగా తన బాధ్యతను నెరవేర్చి, స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగేలా ఏర్పాటు చేశారు.

రాకపోయినా తగ్గని భక్తి - మనసుతోనే సేవ

ఎడమ సత్యం రాలేకపోయినా, ఆయన తరపున కార్యక్రమం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. “భక్తి అంటే పూజ కాదు, మనసును భగవంతునికి అర్పించడం. మనలో ప్రతి ఒక్క స్వామి భక్తితో దేవుని స్మరించుకుంటారు. అలాంటి స్వాములకు అన్నప్రసాదం పెట్టడం అంటే సాక్షాత్తు ఆ భగవంతునికే భోజనం పెట్టినట్లు” అని ఎడమ సత్యం తన సందేశంలో తెలిపినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయన రాకపోయినా ఆయన భక్తి భావం, సేవా గుణం కార్యక్రమంలో స్పష్టంగా కనిపించిందని భక్తులు అన్నారు. అన్నదానం కంటే గొప్ప దానం లేదని, తాను రాలేకపోయినా స్వాములకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని ఆయన ముందే అన్ని ఏర్పాట్లు చేశారని నిర్వాహకులు చెప్పారు.

మంత్ర జపంతో మార్మోగిన ఆలయం

కార్యక్రమంలో ముందుగా స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వాములంతా కలిసి అన్నప్రసాదం స్వీకరించే ముందు అన్నప్రసాద మంత్రాన్ని జపించి భోజనం చేశారు. ఆ సమయంలో ఆలయ ప్రాంగణం మొత్తం భక్తి భావంతో, మంత్ర ధ్వనులతో మార్మోగిపోయింది. భోజనం అనంతరం దాతగా ఉన్న ఎడమ సత్యంకు స్వాములు ప్రత్యేక దీవెనలు అందించారు. “రాలేకపోయినా మనసుతో మాతోనే ఉండి అన్నదానం చేయించిన ఎడమ సత్యంకు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని” కోరుకున్నారు.

భారీగా తరలివచ్చిన స్వాములు

ఈ కార్యక్రమంలో శివ గురు స్వాములు, హనుమాన్ గురు స్వాములు, అయ్యప్ప గురు స్వాములతో పాటు పెద్ద సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. భక్తులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నిత్యం ఇలా అన్నప్రసాద వితరణ జరగడం వల్ల ఎంతో మంది భక్తులకు, స్వాములకు ఆకలి తీరుతోందని, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శివ గురు స్వామి కార్వంగ ఆనంద్ గౌడ్‌ను, దాతగా వ్యవహరించిన ఎడమ సత్యంను భక్తులు అభినందించారు.

ఏఐకేఎస్ అధ్యక్షులుగా అశోక్ ధావలే,ప్రధాన కార్యదర్శిగా విజూ కృష్ణన్.

- కోశాధికారిగా పుష్పేంద్ర త్యాగి ఎన్నిక.

- 27 మందితో ఆఫీస్ బేరర్లు, 86 మందితో సీకేసీ,167 మందితో ఏఐకేఎస్ జాతీయ కమిటీ.



ఉమ్మడి నల్లగొండబ్యూరో,(విజన్ ఆంధ్ర): అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షులుగా అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శిగా విజూ కృష్ణన్,కోశాధికారిగా పుష్పేంద్ర త్యాగి ఎన్నికయ్యారు.నల్లగొండలోని సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లో గల అచ్యుతానంద్ హాల్‌లోని శంకరయ్య వేదికగా జరుగుతున్న ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు.మొత్తం167 మందితో ఏఐకేఎస్ జాతీయ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో నుంచి 86 మందితో సెంట్రల్ కిసాన్ కౌన్సిల్ (సీకేసీ)ను ఏర్పాటు చేశారు. 27 మందిని ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా12 మంది,ఉపాధ్యక్షులుగా హన్నన్ మొల్లా,అమ్రారామ్,ఈపీ జయరాజన్,అమాల్ హల్దార్,ఎంవిజయ్ కుమార్,ఎస్.కే.ప్రీజా,ఇంద్రజిత్ సింగ్,జితేందర్ చౌదరి,బాదల్ సరోజ్,వినోద్ కుమార్, ముక్తుసింగ్,డి.రవీందర్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా12 మంది సంయుక్త కార్యదర్శులుగా పి.కృష్ణ ప్రసాద్,అవదేశ్ కుమార్,మరియం ధావలే,కేఎన్ బాలగోపాల్,వల్సన్ పనోలి,అజిత్ నావలే,రతన్ దాస్, పరేష్ పాల్,టీ.సాగర్, పోతినేని సుదర్శన్,స్వామి నటరాజన్,ప్రభాకర్ రెడ్డి ఎన్నికయ్యారు.తెలంగాణ నుంచి 8 మంది తెలంగాణ నుంచి ఏఐకేఎస్ జాతీయ కమిటీలోకి 8 మంది ఎన్నికయ్యారు.టీ.సాగర్,పోతినేని సుదర్శన్,జూలకంటి రంగారెడ్డి,వీరేపల్లి వెంకటేశ్వర్లు,బి.రాంబాబు,పి.జంగారెడ్డి,కందాల ప్రమీల,మూడ్ శోభన్వీ,రిలో నుంచి సీకేసీలోకి టీ. సాగర్,పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి ఎన్నికయ్యారు.ఆంధ్రప్రదేశ్ నుంచి 5 గురు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏఐకేఎస్ జాతీయ కమిటీలోకి 5 గురిని తీసుకున్నారు.ప్రభాకర్ రెడ్డి,వి. కృష్ణయ్య,సూర్యనారాయణ,ఎం.హరిబాబు,బి. బలరామ్వీరిలో నుంచి సీకేసీలోకి ప్రభాకర్ రెడ్డి,వి.కృష్ణయ్య,ఎం.హరిబాబును తీసుకున్నారు.

కైలాసగుట్టపై వెలిగిన సేవా జ్యోతి!

చీకటిని చీల్చిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సొంత నిధులతో రెండు హైమాస్ట్ లైట్లు - భక్తుల హర్షాతిరేకం

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్,కల్వకుర్తి, నవంబర్ 18,విజన్ ఆంధ్ర : కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రం కైలాసగుట్ట ఇప్పుడు కొత్త కాంతులతో మెరిసిపోతోంది. ఎన్నో ఏళ్లుగా భక్తులు పడుతున్న చీకటి బాధకు శాశ్వత పరిష్కారం దొరికింది. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీ.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తన సొంత నిధులతో కైలాసగుట్టపై రెండు భారీ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించి భక్తుల మనసు గెలుచుకున్నారు.

చీకట్లో భయంతో వెళ్లే పరిస్థితి - ఇప్పుడు వెలుగుల బాట

కైలాసగుట్టకు ప్రతిరోజూ వందలాది మంది భక్తులు వస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు, దర్శనాలు, ప్రదక్షిణలతో గుట్ట కళకళలాడుతుంటుంది. కానీ సూర్యుడు అస్తమించగానే పరిస్థితి మారిపోయేది. గుట్టపై సరైన వెలుతురు లేకపోవడంతో భక్తులు భయం భయంగా నడవాల్సి వచ్చేది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు రాత్రి వేళ గుట్ట దర్శనానికి రావాలంటేనే జంకేవారు. ఈ సమస్యను ఎంతో మంది చెప్పారు, ఎన్నోసార్లు విన్నవించారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అలాంటి సమయంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముందుకు వచ్చారు. “భక్తులు ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకోలేను” అంటూ సొంత ఖర్చుతో రెండు హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు గుట్ట మొత్తం పట్టపగలులా వెలిగిపోతోంది. రాత్రి వేళ కూడా భక్తులు ధైర్యంగా దర్శనం చేసుకోవచ్చు.

"సేవే నా ధర్మం - భక్తుల సౌకర్యమే నా సంకల్పం"

ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ భక్తుల హృదయాలను తాకేలా మాట్లాడారు. “ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం నా బాధ్యతగా భావిస్తాను. ముఖ్యంగా ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. కైలాసగుట్ట అభివృద్ధికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తాను” అని ఆయన తెలిపారు. కేవలం లైట్లతో ఆగిపోను, గుట్ట పరిసరాల్లో మంచినీటి సౌకర్యం, విశ్రాంతి గదులు, పార్కింగ్, రోడ్డు సౌకర్యం వంటి మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు. ఆధ్యాత్మిక క్షేత్రాలను అభివృద్ధి చేయడం అంటేనే భగవంతుని సేవ చేయడమని, ఆ సేవలో తాను ఎప్పుడూ ముందుంటానని చెప్పారు.

కమిటీ సభ్యుల కృతజ్ఞతలు - భక్తుల ఆనందం

కైలాసగుట్టపై హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పట్ల కైలాసగుట్ట కమిటీ సభ్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. “ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, భక్తుల అవసరాలను గుర్తించి సొంత నిధులతో లైట్లు ఏర్పాటు చేయించడం నిజంగా అభినందనీయం. ప్రజా సేవలో భాగంగా ఆధ్యాత్మిక ప్రదేశాలకు అందిస్తున్న ఈ సహకారం మరింత మందికి స్ఫూర్తిదాయకం. భగవంతుని ఆశీస్సులతో గొప్ప స్థానాలకు చేరుకోవాలని కోరుకుంటున్నాం” అని కమిటీ సభ్యులు తెలిపారు. లైట్లు వెలిగిన వెంటనే గుట్టపై భక్తులు





సంబరాలు చేసుకున్నారు. “ఇక రాత్రి అయినా భయం లేదు. పిల్లలతో కలిసి ధైర్యంగా రావచ్చు” అని మహిళా భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

భారీగా తరలివచ్చిన ప్రముఖులు, భక్తులు

ఈ కార్యక్రమంలో పురం శేఖర్ రెడ్డి, బావాండ్ల మధు, సూరం తిరుపతి రెడ్డి, రఘు యాదవ్ స్వామి, కుడుముల శేఖర్ రెడ్డి, సాదు మురళీధర్ రెడ్డి, సురేష్ గౌడ్, వేణుగోపాల్ అయ్యగారు, దామర్ల శేఖర్, పురం మహేశ్వర్ రెడ్డి, బాలరాజు యాదవ్, బాలయ్య, దేశం శ్రీనివాసులు, రవి, పుమాల్, సాయి, సందీప్, ఉపేందర్ రెడ్డి, శివలతో పాటు వందలాది మంది భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కల్వకుర్తిలో ప్రజా సేవకుడిగా ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, ఈ లైట్ల ఏర్పాటుతో మరోసారి తన సేవా గుణాన్ని, భక్తి భావాన్ని చాటుకున్నారని స్థానికులు కొనియాడుతున్నారు. కైలాసగుట్ట అభివృద్ధిలో ఇది తొలి అడుగు మాత్రమేనని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకం క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలి

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు,

- అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కవరేజీ,

- 18 నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన కుటుంబ సభ్యుల్లో ఒకరికి మాత్రమే బీమా వర్తింపు,

- ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్‌డెస్క్‌ల ద్వారా పక్కాగా దరఖాస్తుల నమోదు, కలెక్టర్ ప్రతిమా సింగ్,

మెదక్, నవంబర్ 18:(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత జిల్లా అధికారులతో పాటు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్.. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియ, ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కవరేజీ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన సభ్యుల్లో ఒకరికి మాత్రమే బీమా వర్తిస్తుందని స్పష్టం చేశారు.

కుటుంబ వివరాల నమోదు పక్కాగా ఉండాలి:

రేషన్ కార్డులు కలిగిన కుటుంబాల వివరాలు ఇప్పటికే అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా ప్రీ-ఫిల్డ్ ఫారమ్‌ల రూపంలో ఉంటాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన వివరాలను పూర్తిచేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు



అనంతరం ప్రింట్ అవుట్ తీసుకొని లబ్ధిదారుల సంతకాలు సేకరించి హార్డ్ కాపీలను భద్రపరచాలని ఆదేశించారు. రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను ప్రత్యేక ఫారమ్‌ల ద్వారా సేకరించి, అర్హతలను పరిశీలించిన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఆధార్ ధ్రువీకరణలో అప్రమత్తంగా ఉండాలి:

దరఖాస్తుల నమోదుకు ఆధార్ ఆధారిత ఓటీపీతో పాటు బయోమెట్రిక్ ధ్రువీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్రతి క్యాంపులో బయోమెట్రిక్ పరికరాలు, కంప్యూటర్లు, ప్రింటర్లు అందుబాటులో ఉంచడంతో పాటు ముందుగానే వాటి పనితీరును పరిశీలించాలని ఆదేశించారు. ఆధార్ కార్డు ప్రతిపై సంబంధిత లబ్ధిదారుడి సంతకం తీసుకోవాలని స్పష్టం చేశారు.

నామినీ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి:

జీవిత బీమా పథకంలో నామినీ వివరాలు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. లబ్ధిదారులు ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొన్నప్పుడు వారికి కేటాయించే వాటాల మొత్తం 100 శాతం ఉండేలా చూడాలని సూచించారు. మైనర్లను నామినీలుగా పేర్కొన్న సందర్భంలో నిబంధనల ప్రకారం గార్డియన్ వివరాలను కూడా నమోదు చేయాలని ఆదేశించారు.

ప్రత్యేక క్యాంపులలో కౌంటర్ల ద్వారా దరఖాస్తుల స్వీకరణ:

ప్రజలు తమ నివాస ప్రాంతానికి కేటాయించిన ప్రత్యేక కౌంటర్లలోనే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒకే కుటుంబం నుంచి వేర్వేరు ప్రాంతాల్లో దరఖాస్తులు నమోదుకాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక జనాభా ఉన్న గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మేరకు అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి:

ప్రత్యేక కౌంటర్లకు వచ్చే ప్రజలకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించి, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేసేందుకు ప్రత్యేక రిజిస్టర్లు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీ, మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, వివిధ మండలాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన లబ్ధిదారులందరికీ పథకం ప్రయోజనం అందేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్ , డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, ఈడియం సందీప్ డిపిఓ యాదయ్య, ,,మున్సిపల్ కమిషనర్స్ వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు .

ఏదో అదృష్టం కొద్దీ సీఎం అయ్యావు.. ఇంకో రెండేళ్లు ఉంటావు!

సొంత పార్టీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారం రేపుతున్నాయి. “ఏదో అదృష్టం కొద్దీ సీఎం అయ్యావు.. ఇంకో రెండేళ్లు ఉంటావు” అంటూ ఆయన నేరుగా సీఎంను టార్గెట్ చేయడం కాంగ్రెస్ వర్గాల్లోనే కాదు, ప్రతిపక్షాల్లో కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకు గుసగుసగా ఉన్న అసంతృప్తి ఇప్పుడు బహిరంగ యుద్ధంగా మారిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తన నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు అడిగినందుకు సీఎం తనను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. “కొడంగల్‌కు మాత్రమే కాదు, మునుగోడుకు కూడా నిధులు ఇవ్వమని అడిగినందుకు రేవంత్ రెడ్డి నన్ను ‘పండబెట్టి తొక్కుతా’ అంటున్నాడు” అని రాజగోపాల్ రెడ్డి చెప్పడంతో అక్కడున్న కార్యకర్తలు, ప్రజలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు.

"నువ్వు తొక్కితే తొక్కించుకునేలా కనిపిస్తున్నానా?"

“నువ్వు తొక్కితే తొక్కించుకునేలా కనిపిస్తున్నానా రేవంత్ రెడ్డి?” అంటూ రాజగోపాల్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. తాను ఎవరికీ భయపడే వ్యక్తిని కాదని, ప్రజల కోసం ఏ స్థాయికైనా వెళ్తానని ఆయన స్పష్టం చేశారు. “నేను ఎమ్మెల్యేగా గెలిచింది ప్రజల ఓట్లతో. నా నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేయాలని అడగడం నా హక్కు. అది తప్పా? నిధులు అడిగితే బెదిరింపులా?” అంటూ ఆయన నిలదీశారు.

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు కేవలం ఒక నియోజకవర్గ సమస్యగా చూడటం లేదు. ఇది కాంగ్రెస్‌లో సీఎం తీరుపై పెరుగుతున్న అసంతృప్తికి అద్దం పడుతోందని పార్టీ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. సీఎం తన సొంత నియోజకవర్గం కొడంగల్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, మిగిలిన నియోజకవర్గాలను పట్టించుకోవడం లేదని చాలా మంది ఎమ్మెల్యేలు లోలోపల



మండిపడుతున్నారని తెలుస్తోంది. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి ఆ అసంతృప్తిని బహిరంగంగా బయటపెట్టడంతో మిగిలిన ఎమ్మెల్యేలు కూడా గొంతు విప్పే అవకాశం ఉందని అంటున్నారు.

కొడంగల్ జం మునుగోడు - నిధుల యుద్ధం!

తెలంగాణలో సీఎం నియోజకవర్గం కొడంగల్‌కు భారీగా నిధులు వస్తున్నాయని, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అందరికీ తెలిసిన విషయమే. అదే సమయంలో మునుగోడు లాంటి నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాగునీరు వంటి ప్రాథమిక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని మునుగోడు ప్రజలు వాపోతున్నారు. “కొడంగల్‌కు ఇచ్చినట్టే మునుగోడుకు కూడా ఇవ్వండి. నేను ఏదో నా జేబులో వేసుకోవడానికి అడగడం లేదు. నా ప్రజల కోసం అడుగుతున్నాను” అని రాజగోపాల్ రెడ్డి అన్నారు. “సీఎం అంటే ఒక నియోజకవర్గానికే సీఎం కాదు, రాష్ట్రం మొత్తానికి సీఎం. అన్ని నియోజకవర్గాలను సమానంగా చూడాలి” అని ఆయన హితవు పలికారు.

ఈ వ్యాఖ్యలతో కొడంగల్ – మునుగోడు మధ్య నిధుల వివక్ష అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై పెద్ద చర్చ జరుగుతోంది. “మునుగోడు ప్రజలు ఓట్లు వేయలేదా? వారికి అభివృద్ధి వద్దా?” అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

అదృష్టం కొద్దీ సీఎం - రెండేళ్లేనా?

రాజగోపాల్ రెడ్డి చేసిన మరో వ్యాఖ్య ఇప్పుడు అందరినీ ఆలోచింపజేస్తోంది. “ఏదో అదృష్టం కొద్దీ సీఎం అయ్యావు.. ఇంకో రెండేళ్లు ఉంటావు” అని ఆయన అన్నారు. ఈ మాట వెనుక చాలా అర్థాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. రేవంత్ రెడ్డి సీఎం కావడం ఆయన సొంత బలంతో కాదని, పరిస్థితులు కలిసి రావడం వల్లే అని రాజగోపాల్ రెడ్డి పరోక్షంగా చెప్పారని అంటున్నారు.

అంతేకాదు, “ఇంకో రెండేళ్లు ఉంటావు” అన్న మాటతో రేవంత్ రెడ్డి పూర్తి కాలం సీఎంగా ఉండరని, మధ్యలోనే మార్పు ఉంటుందని రాజగోపాల్ రెడ్డి జోస్యం చెప్పారా? అన్న చర్చ కూడా జరుగుతోంది. కాంగ్రెస్‌లో సీఎం మార్పు ఉంటుందన్న ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేనే ఇలా మాట్లాడటంతో ఆ ప్రచారానికి మరింత బలం చేకూరింది.

కోమటిరెడ్డి బ్రదర్స్ జం రేవంత్ - పాత కథేనా?

కోమటిరెడ్డి సోదరులు – వెంకట్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి – రేవంత్ రెడ్డి మధ్య విభేదాలు కొత్తవేమీ కావు. గతంలో కూడా చాలా సార్లు వీరి మధ్య మాటల యుద్ధం జరిగింది. పార్టీలో సీనియారిటీ, నియోజకవర్గ అభివృద్ధి, టికెట్ల విషయంలో వీరి మధ్య ఎప్పుడూ చిన్న చిన్న గొడవలు జరుగుతూనే ఉన్నాయి. కానీ ఈసారి రాజగోపాల్ రెడ్డి మాటలు గతంలో కంటే చాలా ఘాటుగా ఉండటంతో పరిస్థితి చేయి దాటిపోతోందని అంటున్నారు.

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఇటీవల అసెంబ్లీకి పోటీ చేయబోనని, పార్లమెంట్‌కు వెళ్తానని అంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో ఆయన సోదరుడు రాజగోపాల్ రెడ్డి సీఎంపై ఇలా విరుచుకుపడటం కాంగ్రెస్ అధిష్ఠానానికి పెద్ద తలనొప్పిగా మారింది.

కాంగ్రెస్‌లో కలకలం - అధిష్ఠానం ఏం చేస్తుంది?

రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. సొంత పార్టీ ఎమ్మెల్యేనే సీఎంపై బహిరంగంగా విమర్శలు చేయడం పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుందని నేతలు భావిస్తున్నారు. ఢిల్లీ పెద్దలు ఈ విషయం

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు.

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.



నిజామాబాద్ నవంబర్18:(విజన్ ఆంధ్ర) రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం పాటుపడతానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 34, 39వ డివిజన్లలో బుధవారం రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో కేంద్ర నిధులతో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. కార్పొరేషన్ లో ఇటీవల కేటాయించిన 20 లక్షల నిధులతో పాలు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫండ్ కేటాయించాలని, దీంతో మరిన్ని పనులు ముందుకు సాగుతాయని తెలిపారు.

మిర్చి కంపౌండ్ లో పాఠశాల ఆకస్మిక తనిఖీ...

నగరంలోని మిర్చి కంపౌండ్ లో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన చేస్తుండగా పరిశీలించారు. అయితే మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా నాణ్యత ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

నిర్మల్ శ్యామ్‌గఢ్ కోట భూముల కబ్జాపై సమగ్ర విచారణ జరిపించాలి

- ప్రభుత్వ భూములను పరిరక్షించి, అక్రమ రెవెన్యూ రికార్డులను రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఏవో కు వినతిపత్రం అందజేసిన ఆప్

రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్.





నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): నిర్మల్ పట్టణంలోని చారిత్రక శ్యామ్‌గఢ్ కోట భూముల రెవెన్యూ రికార్డుల్లో ప్రైవేట్ వ్యక్తుల పేర్లు నమోదైన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏవో ప్రవీణ్ కుమార్‌కు ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటకు సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులు, ఖాస్రా పహాణీ, సేత్వార్, సర్యులర్ ముంతఖబ్‌లను పరిశీలించాలని కోరారు. అలాగే అక్రమంగా జారీ అయినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పట్టాదారు పాస్‌బుక్కులు, పహాణీలలో నమోదైన ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత రికార్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని చారిత్రక శ్యామ్‌గఢ్ కోట ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు.

వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.




నిర్మల్ జిల్లా,నవంబర్ 18,(విజన్ ఆంధ్ర); జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం నిర్మల్ పట్టణంలో ప్రస్తుతం నిర్వహించబడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో సంబంధిత అధికారులతో, నూతన వైద్య కళాశాల నిర్మాణ వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య కళాశాల నిర్మాణ పురోగతిని శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అన్ని విధాలైన సౌకర్యాలతో కూడిన వైద్య కళాశాల నిర్మించాలన్నారు. వైద్య విద్యను అభ్యసించేందుకు వీలుగా అన్ని విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. చేపట్టిన పనులు నాణ్యవంతంగా ఉండాలన్నారు. విద్యార్థుల వసతి నివాసాల నిర్మాణాలు కూడా పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో వైద్య విద్యను అభ్యసించి, వసతి పొందేందుకు అనుగుణంగా నిర్మాణాలను చేపట్టాలన్నారు. కళాశాల నిర్మాణ పనులు అన్నింటిని తానే స్వయంగా ప్రతి వారం సమీక్షిస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ఆర్ అండ్ బి ఎఈ అంజనేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా డాక్టర్ బి.ఎస్. రావు మెమోరియల్ క్రీడా పోటీలు ప్రారంభం

- విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం

పెంపొందించడంలో క్రీడలు కీలకం: ఉప్పల్ సీఐ రామలింగారెడ్డి



హైదరాబాద్, నవంబర్ 18: శ్రీ చైతన్య పాఠశాల హబ్సిగూడ-2 క్యాంపస్ (నారాయణగూడ జోన్) ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఎస్. రావు మెమోరియల్ క్రీడా పోటీల ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బి.ఎస్. రావు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ క్రీడా సంబరాలకు ముఖ్య అతిథిగా ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి హాజరయ్యారు. తొలుత డాక్టర్ బి.ఎస్. రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన, అనంతరం క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, రంగురంగుల బెలూన్లను గాలిలోకి వదిలి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు స్నీయ క్రమశిక్షణ, సమన్వయం, నాయకత్వ లక్షణాలు, ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నారాయణగూడ జోన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నూర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న హబ్సిగూడ-2 పాఠశాల బృందాన్ని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. జోన్ రీజనల్ ఇన్‌ఛార్జ్ వెంకటేష్ బండి మాట్లాడుతూ విద్య అనేది మేధస్సుతో పాటు శారీరక దృఢత్వాన్ని కూడా పెంపొందించాలని, విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిజమైన క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి కోన మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. జట్టుకృషి, పట్టుదల, క్రమశిక్షణతోనే విజయాలు సాధ్యమని, విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల బ్యాండ్ వాయిద్యాల నడుమ నాలుగు హౌస్‌ల విద్యార్థులు నిర్వహించిన క్రమశిక్షణాయుతమైన మార్చ్‌పాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం క్రీడా జ్యోతి రిలే, జ్యోతి ప్రజ్వలన, క్రీడాకారుల ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సామూహిక కవాతు, మాస్ డ్రిల్స్, లయబద్ధమైన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రాథమిక ట్రాక్ ఈవెంట్లతో క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు పుల్లారావు, రాజేంద్ర ప్రసాద్, డీన్ నాగరాజు, ఐపీఎల్ ఇన్‌ఛార్జ్ వెంకటేష్ గుప్తా, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ సరస్వతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


చెత్త తీయరు... తీస్తే ఎత్తరు....!!











హాజీపూర్ (మంచిర్యాల), నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ వారు పురవీధుల్లో చెత్తను పక్షం రోజులు దాటినా తీయడం లేదు. ఒకవేళ తీసినా, నాలాల నుండి వ్యర్థాలను బయటకు తీసి రోడ్డు మీదే పడవేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల పురవీధుల పరిస్థితి 'పెనం నుండి పొయ్యిలో పడ్డట్టు' అవుతోందనడంలో అతిశయోక్తి లేదు. నాలా వ్యర్థాలు తీయకపోతే దుర్వాసన, దోమలు, ఈగల బాధ ఒకవైపు ఉంటే, తీసిన వ్యర్థాలను రోడ్డు మీద పడవేసి వారం రోజులైనా అటువైపు కన్నెత్తి చూడని మున్సిపాలిటీ వారి నిర్వాకం వల్ల మరో సమస్య ఎదురవుతోంది. బయట వీధుల్లో ఆడుకునే పిల్లలు ఆ వ్యర్థాలను కాళ్లకు అంటించుకొని ఇంటి లోపలికి తెలియకుండానే తీసుకొస్తున్నారు. దీనివల్ల వ్యాధికారక బ్యాక్టీరియా వ్యాపించి టైఫాయిడ్, ఇతర అంటురోగాలకు రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానించినట్లు అవుతోంది. సరిగ్గా నెల రోజుల క్రితం ఎవరిని పలకరించినా వారు ఎదుర్కొంటున్న జ్వరాల గురించే మాట్లాడుకున్న సంగతి విదితమే. వ్యాధుల బారిన పడి పాఠశాలలకు పిల్లలు గైర్హాజరు కావడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణమే.

అకాల వర్షాలు, పగటిపూట విపరీతమైన ఎండ, అంతలోనే ఎముకలు కొరికే చలి వల్ల మంచిర్యాల వాసులు వాతావరణ మార్పులతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధులు రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) లేమితో చతికిలబడుతున్నారు. సర్కారు దావఖానాలకు, పీహెచ్‌సీ (గ్రామీణ) కేంద్రాలకు వెళితే మందుల కొరత ఉండటంతో, తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి నెలవారీ మొక్కుబడి తీర్చుకున్నట్లు వేల రూపాయలు చదివించుకుని వస్తున్నారు.అయితే, ఈ సమస్యలన్నింటికీ అసలైన మూల కారణమైన పారిశుద్ధ్య లోపంపై ఏ రాజకీయ పార్టీ కూడా సీరియస్‌గా దృష్టి సారించినట్లు కనిపించడం లేదు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడు ప్రధాన పార్టీల ప్రతినిధులు కార్పొరేటర్లుగా గెలిచారు. కొసమెరుపు ఏంటంటే.. ఎన్నికల సమయంలో నాలాల నుండి వ్యర్థాలను ఆలస్యం చేయకుండా తీస్తామని, తీసిన వ్యర్థాలను వెంటనే తరలిస్తామని ప్రధాన హామీగా తమ ఎజెండాలో పెట్టుకుని విజయం సాధించారు. కానీ గెలిచిన అనంతరం వారు కూడా ఆ హామీని మూలన పెట్టేశారు. అసలే ఇరుకు రోడ్లు, ఆపై చెత్తాచెదారంతో నడవడానికి కూడా వీలులేని పురవీధులు ఎన్నో ఉన్నాయి. ఎదురెదురుగా టూ-వీలర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బైపాస్ రోడ్డు డంపింగ్ యార్డ్..

మున్సిపల్ కార్పొరేషన్ వారు కేవలం వ్యర్థాల తరలింపులోనే జాప్యం చేస్తున్నారా అంటే అదీ కాదు. ప్రతి వీధిలో ఒక అనధికారిక (అన్-అఫీషియల్) చెత్త వేసే స్థలం తయారైంది. ఆ ప్రదేశంలో 'ఇక్కడ చెత్త వేయరాదు' అని బాజాప్తా రాసి ఉన్నా బేఖాతరుగా చెత్త కుప్పలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా స్థానిక బైపాస్ రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం యథేచ్ఛగా పేరుకుపోయింది. ముక్కు మూసుకోకుండా ఆ దారిలో ప్రయాణం చేయడం ఒక సాహసమే. వ్యర్థాల నుండి వచ్చే దుర్వాసన వచ్చిపోయే వారికి చిరాకు తెప్పిస్తోంది. బైపాస్ రోడ్డు నాలా పక్కన వేసిన చెత్తలో పందులు, కుక్కలు ఆవాసం ఏర్పాటు చేసుకుని వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మొన్న ఆదివారం నాడు బైపాస్ రోడ్డులో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఒక వ్యక్తికి చెత్త కవర్ ఎదురుగా ఎగిరి రావడంతో ప్రమాదానికి గురయ్యారు. చెత్త సేకరణలో అలసత్వం వల్ల వాటిల్లే ప్రమాదాలకు ఈ ఘటన అద్దం పడుతోంది. పారిశుద్ధ్య లోపం వల్ల జరుగుతున్న ఈ నష్టాలపై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మీరు ఎలా స్పందిస్తారని 'విజన్ ఆంధ్ర' ఒక మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ జవాన్‌ను ప్రశ్నించింది. తన పేరు బయటకు రాకూడదనే హామీ తీసుకున్న అనంతరం ఆయన స్పందిస్తూ.. "పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉండటం, ఉన్నవారిని సమర్థవంతంగా వినియోగించుకోలేకపోవడం ఒక కారణమైతే, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పలుకుబడి కలిగిన కొన్ని డివిజన్లలో కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంది. తక్కువ పలుకుబడి కలిగిన డివిజన్లలో నామమాత్రంగా అంటే ఆరు లోపు మాత్రమే కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. నాలాల వ్యర్థాలు ఎప్పటికప్పుడు తీసి తరలించాలంటే సిబ్బంది ఇప్పుడు ఉన్నవారి కన్నా రెట్టింపు (డబుల్) కావాల్సిన అవసరం ఉంది" అని తెలిపారు.

బాలికల పాఠశాలకు ట్రాఫిక్ అడ్డంకులు.....

- కత్తిమీద సాములా విద్యార్థినుల ప్రయాణం:

- గేటు ముందు అక్రమ పార్కింగ్‌తో నరకయాతన

- పనులు పూర్తయినా తీరని ట్రాఫిక్ వెతలు.

- ట్రాఫిక్ సీఐ హనన్ హెచ్చరికలు..

- ట్రాఫిక్ ఏసీపీ, సీఐలకు హెచ్ఎం వినతి.





మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 18: (విజన్ ఆంధ్ర) మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ ప్రాంతంలో ఉన్న స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నిత్యం తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమవుతున్నారు. పాఠశాలకు రావాలన్నా, సాయంత్రం ఇళ్లకు వెళ్లాలన్నా గేటు దాటి బయటకు అడుగుపెట్టాలంటేనే విద్యార్థినులు జంకే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ట్రాఫిక్ సీఐ, ఏసీపీలను వినతిపత్రం అందజేశారు.

పనులు పూర్తయినా.. తగ్గని తీవ్రత:

ఈ సమస్య ఇప్పటిది కాదు. గతంలో రోడ్డు విస్తరణ, భూగర్భ నాలా వ్యవస్థ ఏర్పాటు కోసం చాలా రోజుల పాటు రహదారి పనులు జరిగాయి. అప్పట్లో పనుల వల్ల ఇబ్బందులు పడిన విద్యార్థినులకు, ఇప్పుడు రోడ్డు పనులు ఒక కొలిక్కి వచ్చినా పరిస్థితి మరింత ముదిరిందే తప్ప తగ్గడం లేదు. మార్కెట్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలకు వచ్చే వినియోగదారులు 'నో పార్కింగ్' స్థలాల్లోనే తమ వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. దీంతో రహదారి కుంచించుకుపోయి సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఒకవైపు వాహనాల రద్దీ, మరోవైపు చెవులు చిల్లులు పడే హారన్ల మోతతో కాలిబాటపై నడవడానికి కూడా వీలులేకుండా పోయింది. బరువైన బ్యాగులు, చేతిలో టిఫిన్ బాక్సులతో నడవడం విద్యార్థినులకు కత్తిమీద సాములా మారింది. ఎన్నిసార్లు అధికారులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి అడుగులు పడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గాయపడుతున్న విద్యార్థినులు:

జిల్లా కేంద్రంలో బాలికల కోసం ఉన్న ఏకైక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కావడంతో, పట్టణ నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ఇక్కడికి వస్తుంటారు. వీరిలో చాలామంది ఆటోలపై ఆధారపడతారు. గేటు ముందు కనీసం కాలు పెట్టే స్థలం కూడా లేకపోవడంతో, 200 నుండి 300 మీటర్ల దూరంలో ఆటోలను నిలుపుతున్నారు. అక్కడి వరకు నడిచి వెళ్లే క్రమంలో ఇటీవల రెండు వేర్వేరు ఘటనల్లో వాహనాలు తగిలి కొందరు బాలికలు గాయపడ్డారు.

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సీఐ దిశానిర్దేశం:

ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో నవంబర్ 17న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హసన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలపరాదని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ట్రాఫిక్ పోలీసుల సమావేశం జరిగినప్పటికీ, వ్యాపార సముదాయాల వద్ద అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా నియంత్రిస్తేనే తమ పిల్లలకు రక్షణ ఉంటుందని, లేదంటే ముందుముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి విద్యా ప్రమాణాలు, హాజరు శాతం, ఏకాగ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండలంలో గల మోడల్ స్కూల్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, కోటపల్లి మండల తహసీల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యారంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఉదయం పూట అల్పాహారం తీసుకోకుండా పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సి.ఎం. బ్రేక్‌ఫాస్ట్ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా చదువుకోవడంతో పాటు క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుండగా, మంచిర్యాల జిల్లాలో సుమారు 35 వేల మంది విద్యార్థులకు, చెన్నూర్ నియోజకవర్గంలో సుమారు 12 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఎవరూ ఆకలితో పాఠశాలకు రాకూడదనే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. తాను 2009 నుంచి 2014 వరకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాంతంలో 109 మోడల్ పాఠశాలలు మంజూరయ్యాయని గుర్తుచేశారు. కోటపల్లి మోడల్ స్కూల్‌లో 301 మంది బాలురు, 237 మంది బాలికలు విద్యనభ్యసిస్తుండటం సంతోషంగా ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుండి క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. తాము భవిష్యత్తులో డాక్టర్లు, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు కావాలనే సంకల్పంతో చదువుకోవాలని, లక్ష్య సాధనకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని తెలిపారు. పాఠశాల స్థాయిలోనే వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, మంచి నడవడిక అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత పాఠశాలలో మంచి ఫలితాలు సాధిస్తున్నప్పటికీ, సి.ఎం. బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుతో ఇకపై 100 శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ గ్రేడ్‌లు సాధించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులు 100 శాతం డిస్టింక్షన్ ఫలితాలు సాధిస్తే పాఠశాలకు ప్రత్యేక బహుమతి అందజేస్తానని తెలిపారు. మోడల్ స్కూల్‌లో సుమారు 500 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా భోజనశాల నిర్మాణానికి 40 లక్షల రూపాయలు అవసరమని, ఇందులో 20 లక్షల రూపాయలు జిల్లా కలెక్టర్ ద్వారా, మరో 20 లక్షల రూపాయలు డిఎంఎఫ్‌టి నిధుల నుండి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తున్నామని, ఇప్పటికే డిగ్రీ కళాశాలకు 2 కోట్ల రూపాయలు, ఇంటర్మీడియట్ కళాశాలకు 1.50 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, కోటపల్లిలో సుమారు 90 లక్షల రూపాయలతో ఎస్.సి. వసతి గృహ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 2 వేల 500 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల వసతి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అదనపు వసతి గృహ సీట్ల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వివిధ నైపుణ్యాలను అభ్యసించాలని సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 4 వేల కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వీటి ద్వారా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించి, ఆహార నాణ్యత, మెనూ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ గదిని ప్రారంభించారు.చెన్నూర్ మండలం కన్నేపల్లి నుండి సంకారం వరకు 90 లక్షల రూపాయల ఎం.ఆర్.ఆర్. 2024-25 నిధులతో పునరుద్ధరించిన బి.టి. రహదారిని ప్రారంభించారు. సంకారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు బెంచీలను అందజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతులను సమకూర్చాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




గ్రూప్-II, గ్రూప్-III పోటీ పరీక్షలకు ఉచిత ఫౌండేషన్ కోచింగ్ కు మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలి

- జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా

గద్వాల నవంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్,మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్-II, గ్రూప్-III పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు ఉచిత ఫౌండేషన్ కోచింగ్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ కార్యక్రమానికి ముస్లిం,క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, పార్సీ,జైన మతాలకు చెందిన అర్హులైన ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో నిర్ణీత గడువులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.అర్హులైన అభ్యర్థులు 17.11.2026 నుంచి 26.11.2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, శిక్షణ తరగతులు 27.11.2026 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.ఈ ఉచిత శిక్షణకు సంబంధించిన రిజిస్ట్రేషన్, శిక్షణ తరగతులు తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని కాలేజ్, ఎంఏఎం. క్యాంపస్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం అభ్యర్థులు 040-23236112,9059050062 ఫోన్ నంబర్లను లేదా directorsmccctelangana@gmail.com ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. మైనారిటీ వర్గాలకు చెందిన యువతీ యువకులు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రూప్-II, గ్రూప్-III పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా కోరారు.

పట్టభద్రుల ఓటరు జాబితా పకడ్బందీగా పూర్తి చేయాలి

- కలెక్టర్ హేమంత్ సహదేవరావు



ములుగు, నవంబర్ 18:విజన్ ఆంధ్ర ప్రతినిధి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా నూతన రూపకల్పనను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సుమన్ కుమార్ దాస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఫారం-18 దరఖాస్తులను బల్క్‌గా స్వీకరించరాదని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల సంఘం సూచించింది. అర్హులైన పట్టభద్రుల పేర్లు మాత్రమే జాబితాలో చేరేలా చూడాలని, అనర్హుల పేర్లు చేరకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ జాబితా పనులు గడువులోగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ తదితరులు పాల్గొన్నారు.

యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు చక్కటి వేదిక


- మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)అదిలాబాద్ జిల్లా స్థాయిలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవం (ణఱఠతీఱఎ్ రావజువశ్రీ శీబ్ష్ట్ర ఖీవర్ఱజుశ్రీ) ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలు, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. చదువుతో పాటు కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం వంటి వివిధ రంగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. యువత దేశ భవిష్యత్తుకు పునాదులని, వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, దానికి తగిన కృషి చేస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ యువజనోత్సవంలో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని, విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించి అదిలాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారు, ఎంపీ గోడం నాగేశ్ గారు, కార్యనిర్వాహక సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) జిల్లాలో చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండలం మద్దికల్ గ్రామాన్ని తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్, ఉపసర్పంచ్ లతో కలిసి సందర్శించి రీసర్వే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. రైతులు రీసర్వే ప్రక్రియకు సహకరిస్తుండటం సంతోషంగా ఉందని తెలిపారు. పనుల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో తహసిల్దార్‌తో కలిసి హాజరయ్యారు. గ్రామసభలో రీసర్వే ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిశీలించి, రైతుల భాగస్వామ్యంతో పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జైపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీసర్వే ప్రక్రియ, కోర్టు కేసులు, జి.ఓ. ఎం.ఎస్. నంబర్ 76, జి.ఓ. ఎం.ఎస్. నంబర్ 59, ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ, భూ భారతి ఫైళ్లు, మీ- సేవ ద్వారా జారీ చేయవలసిన సర్టిఫికెట్ల పెండింగ్పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూల్ నిర్వహణను మరింతగా మెరుగుపర్చాలి

- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలి

- అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు



నిజామాబాద్, నవంబర్ 18 :(విజన్ ఆంధ్ర) ఇందల్వాయి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహణను మరింతగా మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతి గృహాల నిర్వహణ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, భోజన సదుపాయాలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉన్నా వాటిని కప్పిపుచ్చకుండా వాస్తవ పరిస్థితులను తన దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. సమస్యలను ముందుగానే గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారం చూపే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, మరమ్మతు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, శారీరక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందేలా పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భోజన పదార్థాల నాణ్యతను ప్రతిరోజూ పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అనారోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను వెంటనే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు బాధ్యతతో పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, ప్రాంతీయ సమన్వయకర్త గంగారాం నాయక్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమాతో ఆర్థిక భరోసా

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) రాష్ట్రంలోని ప్రతి అర్హత కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా 5 లక్షల రూపాయల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పథకం క్రింద ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన సంపాదించే ఒక వ్యక్తిని బీమా పరిధిలోకి తీసుకోవాలని, కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నట్లయితే ఎవరిని బీమా పరిధిలోకి తీసుకోవాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకునే అవకాశం కల్పించాలని తెలిపారు. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించనున్నందున లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలిపారు. నమోదు ప్రక్రియలో భాగంగా గ్రామాలు, పట్టణాలు, వార్డుల వారీగా ప్రత్యేక సహాయక నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుల వివరాల ఆధారంగా కుటుంబాలను గుర్తించడంతో పాటు, రేషన్ కార్డులలో పేర్లు లేని వారు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కూడా ప్రత్యేక దరఖాస్తు విధానం ద్వారా నమోదు అవకాశం కల్పించాలని సూచించారు. బీమా పొందే వ్యక్తి వివరాలు, ఆధార్ ఆధారిత పుట్టిన తేదీ, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నందున వారికి అందే వాటాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల నమోదు, అవసరమైన సేవలు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో పథకం అమలుకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ను నోడల్ అధికారిగా నియమించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాలలో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని వివరించారు. పథకం విజయవంతంగా అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని, మండల స్థాయి అధికారులు, వార్డు అధికారులకు ప్రభుత్వం నిర్దేశించిన ఎస్ఓపిపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపాలిటీలకు ప్రత్యేక లాగిన్ సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రతి నమోదు శిబిరంలో ఇంటర్నెట్ కనెక్షన్, ప్రింటర్, స్కానర్ వంటి అవసరమైన సాంకేతిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 2 గ్రామాలు మినహా మిగిలిన అన్ని గ్రామాలలో శిబిరాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 2 గ్రామాలలో ముందుగా నింపిన దరఖాస్తు ఫారాలను శిబిరాలలో అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి అర్హత కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించి, ఎవరూ మిగిలిపోకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పి.ఎం. శ్రీ పాఠశాలల అభివృద్ధికి ఉత్తమ విద్యా విధానాలపై అధ్యయనం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 18 విజన్ ఆంధ్ర ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్యాబోధన, ఆధునిక బోధనా పద్ధతులు, ఉత్తమ పాఠశాల నిర్వహణ విధానాలపై అధ్యయనం చేసి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో జిల్లాకు చెందిన 25 మంది పి.ఎం. శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత కో-ఆర్డినేటర్లతో కూడిన బృందం ఈ నెల 21వ తేదీ వరకు 4 రోజుల విద్యా అధ్యయన పర్యటనలో భాగంగా బెంగళూరు, మైసూరు ప్రాంతాలలోని ప్రముఖ విద్యాసంస్థల సందర్శనకు సంబంధించిన పర్యటన బస్సును జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధ్యయన పర్యటనలో భాగంగా బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, మైసూరులోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ తదితర ప్రముఖ విద్యాసంస్థలను బృందం సందర్శిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థలలో అమలవుతున్న ఆధునిక విద్యాబోధనా పద్ధతులు, పాఠశాల నాయకత్వ లక్షణాలు, విద్యా ప్రణాళికలు, వినూత్న బోధనా విధానాలు, విద్యార్థుల సామర్థ్యాల పెంపుదలతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తారని తెలిపారు. విద్యారంగంలో వస్తున్న నూతన మార్పులు, ఆధునిక బోధనా పద్ధతులు, ఉత్తమ పాఠశాల నిర్వహణ విధానాలపై ఉపాధ్యాయులు నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ అధ్యయన పర్యటనలో తెలుసుకున్న అంశాలు, పొందిన అనుభవాలు, ఉత్తమ విధానాలను తమ పాఠశాలలలో సమర్థవంతంగా అమలు చేసి, పి.ఎం. శ్రీ పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పి.ఎం. శ్రీ పాఠశాలల కో-ఆర్డినేటర్లు, 25 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 18 విజన్ ఆంధ్ర జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి 289 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందని, పి.సి.ఎస్.ఎ.పి. మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు కేంద్రాలలో పూర్తి చేయవలసిన 16 ప్రశ్నలకు సంబంధించి ఇప్పటి వరకు 175 కేంద్రాలలో నమోదు పూర్తయిందని, మిగిలిన కేంద్రాలలోనూ వెంటనే ప్రక్రియ పూర్తి చేసి కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 1 లక్ష 78 వేల 628 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని అంచనా వేయగా, గోదాములతో సహా జిల్లాలో మొత్తం 1 లక్ష 74 వేల 550 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లు, ప్యాడీ డ్రైయర్లు, ఆటోమేటెడ్ ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, కాలిపర్స్, హస్క్ రిమూవర్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ధాన్యం నిల్వలకు తగిన ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. ధాన్యం మిల్లింగ్ కోసం జిల్లాలో 33 రైస్ మిల్లులను గుర్తించడం జరిగిందని, వీటిలో 14 బాయిల్డ్ రైస్ మిల్లులు, 19 రా రైస్ మిల్లులు ఉన్నాయని, వీటి మొత్తం మిల్లింగ్ సామర్థ్యం 1 లక్ష 46 వేల 750 మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఇంకా బ్యాంకు గ్యారంటీలు సమర్పించని రైస్ మిల్లర్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలను నియంత్రణలో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, ఎల్‌డిఎం తిరుపతి, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణ

- సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, నవంబర్ 18 :(విజన్ ఆంధ్ర) ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై విస్తృత స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు వీలుగా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కాంపిటీషన్స్--2026లో భాగంగా జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 120 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి కాన్ఫరెన్స్ హాల్ ను సందర్శించి పోటీల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు, ఎన్నికల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడంతో పాటు, బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కాంపిటీషన్స్--2026ను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. పోటీలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సంబంధిత అధికారులు ఉన్నారు.

పెన్షన్ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబోలు నరసింహారెడ్డి..



హైదరాబాద్: నవంబర్ 18; తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబోలు నరసింహారెడ్డి విమర్శించారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు ఇచ్చిన పెన్షన్ పెంపు హామీలను ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రస్తుతం అందిస్తున్న ఆసరా పెన్షన్‌ను నెలకు రూ.2,016 నుంచి రూ.4,000కు పెంచుతామని, వికలాంగులకు నెలకు రూ.6,000 పెన్షన్ అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీలు అమలుకు నోచుకోకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండగా, మరోవైపు మందులు, వైద్య ఖర్చుల భారంగా మారడంతో పెన్షన్లపై ఆధారపడుతున్న వృద్ధులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వికలాంగులు ఇతరులపై ఆధారపడకుండా గౌరవంగా జీవించేందుకు రూ.6,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం వారి జీవితాలపై ప్రభావం చూపుతోందన్నారు. అదేవిధంగా కొత్తగా పెన్షన్‌కు అర్హత పొందిన అనేకమంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటికీ పెన్షన్లు మంజూరు కాక ఎదురుచూస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి జాప్యం లేకుండా పెన్షన్లు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన రూ.4,000 ఆసరా పెన్షన్, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ హ

ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా వైద్య అధికారి

- ఊరుకొండ, పుల్కుర్తి, దామెర ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య జిల్లాలోని ఊరుకొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పుల్కుర్తి సబ్ సెంటర్, దామెర గ్రామీణ కుటుంబ సంక్షేమ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న సాధారణ టీకాల కార్యక్రమాలను పరిశీలించారు. టీకాల కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేసి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవం చేసిన తల్లికి సన్మానం ఈ సందర్భంగా ఊరుకొండకు చెందిన వీరబాబు భార్య కీసరి చందనను డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఆమె 29-09-2026న ప్రభుత్వ వైద్య సంస్థలో 2.75 కిలోల బరువున్న మగ శిశువుకు సాధారణ ప్రసవం ద్వారా జన్మనిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే కార్యక్రమాలకు చందనను బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తిస్తూ ఆమెను అభినందించారు.ప్రభుత్వ వైద్య సంస్థలపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు, సురక్షితమైన ప్రసవ సదుపాయాలు కల్పించాలని డీఎంహెచ్ఓ సూచించారు.

ఓటరు జాబితాలో పేరు లేని వారికి మరో అవకాశం

- ఏఎస్డీడీ ఓటర్ల నమోదుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

- డిసెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురణ..లిజిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 18(విజన్ ఆంధ్ర) : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని ఏఎస్డీడీ ఓటర్లకు తిరిగి పేరు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎస్డీడీ ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ నవంబర్ 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు, డిసెంబర్ 10లోగా ఫారాల పరిశీలన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార గడువును డిసెంబర్ 15 వరకు పొడిగించగా, తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, పేరు లేని వారు అవసరమైన పత్రాలతో సంబంధిత బూత్ స్థాయి అధికారిని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తికి ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

-నూతన సంవత్సర డైరీల ముద్రణపై చర్చ - కలెక్టర్ సానుకూల స్పందన



సంగారెడ్డి బ్యూరో , నవంబర్ :18(విజన్ ఆంధ్ర) : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ జావిద్ అలీ, జిల్లా కార్యదర్శి వేల్పూరి రవి ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా బుధవారం నాడు కలిశారు. ఈ సందర్భంగా రాబోయే నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉద్యోగుల కోసం నూతన సంవత్సర డైరీల ముద్రణకు సంబంధించి జిల్లా కలెక్టర్‌తో నాయకులు చర్చించారు. ఈ విషయంపై కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కోశాధికారి కాసిని శ్రీకాంత్, అసోసియేట్ అధ్యక్షులు జి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, కృష్ణ, నాగేశ్వర్ రావు, సెంట్రల్ యూనియన్ ఉపాధ్యక్షులు ఘౌస్ హస్మీ, టౌన్ అధ్యక్షులు యాదవ్ రెడ్డి, పటాన్‌చెరు మండల అధ్యక్షులు ప్రమోద్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు షరీఫ్, సురేఖ, నాగమణి, లత, లావణ్య, రాజు, రషీద్, రామప్ప, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు నాయకులు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగుల సంక్షేమం, సంఘ అభివృద్ధికి యూనియన్ తరపున కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా బొమ్మక్ శ్రీనివాస్

- పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపినజిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు



బోడుప్పల్,నవంబర్ 18(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా బోడుప్పల్ డివిజన్ కు చెందిన బొమ్మక్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతులమీదుగా నియామక పత్రాన్ని బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మక్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో తాను చేసిన సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తనకు ఈ పదవీ ఇవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ పదవీ రావడానికి కృషి చేసినందుకు గాను ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పోగుల నరసింహ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే బృహత్తర బాధ్యతలను తీసుకుంటానని తెలిపారు.

గంజాయి నిందితుడు అరెస్టు, రిమాండ్.

- 22 గ్రాముల గంజాయి స్వాధీనం.

- 22 గ్రాముల గంజాయి స్వాధీనం.

- గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి.

- జైనథ్ సిఐ జి శ్రావణ్

ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)గతంలో బేల మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గంజాయి తరలిస్తుండగా అనుమానస్పదంతో తనిఖీలు నిర్వహించగా నిందితుడు బాది గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ వద్ద 22 గ్రాముల గంజాయి లభ్యమైనట్టు, ఇతనిపై బేల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి న్యాయస్థానం అనుమతితో ఈరోజు అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు జైనథ్ సిఐ జి శ్రావణ్ తెలిపారు. గంజాయి తాగిన సేవించిన వ్యాపారం చేసిన పండించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి పండించిన వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేయడం జరుగుతుందని గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రజలు ప్రతి ఒక్కరు యువత ముందుండి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధు కృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ప్రతి అర్హత కుటుంబానికి ఆర్థిక భరోసా

- అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ అందించాలి

- నమోదు ప్రక్రియలో అర్హులెవరూ మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జిల్లాలో అన్ని గ్రామాలు, పట్టణ వార్డుల్లో నమోదు శిబిరాలకు ఏర్పాట్లు పూర్తి..

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 18(విజన్ ఆంధ్ర)ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం కూడా పథకం ప్రయోజనానికి దూరం కాకుండా సమగ్ర కార్యాచరణతో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన సంపాదించే ఒక వ్యక్తిని బీమా పరిధిలోకి తీసుకోవాలని, కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదించే వారు ఉంటే ఎవరిని ఎంపిక చేసుకోవాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులందరికీ పథకం ప్రయోజనం అందించాలని, బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల ఆధారంగా కుటుంబాలను గుర్తించడంతో పాటు రేషన్ కార్డుల్లో పేర్లు లేని వారు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కూడా ప్రత్యేక దరఖాస్తు విధానం ద్వారా నమోదు అవకాశం కల్పించాలని తెలిపారు. ఆధార్ ఆధారిత పుట్టిన తేదీ, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, మీ సేవ కేంద్రాల ద్వారా కూడా అవసరమైన సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. పథకం అమలుపై ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. మండల స్థాయి అధికారులు, వార్డు అధికారులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక కార్యాచరణ విధానంపై (ఎస్ఓపీ) శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. నమోదు ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎంపీడీవోలు, మున్సిపాలిటీలకు ప్రత్యేక లాగిన్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి నమోదు శిబిరంలో ఇంటర్నెట్ కనెక్షన్, ప్రింటర్, స్కానర్ వంటి సాంకేతిక సదుపాయాలు ఏర్పాటు చేశామని, అన్ని గ్రామాల్లో శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ముందుగా నింపిన దరఖాస్తు ఫారాలను కూడా శిబిరాల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి అర్హ కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటీడీఏ పీఓ మంద మకరంద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మల్దకల్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



మల్దకల్ నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఎమ్మెల్యే కి గ్రామ సర్పంచ్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అభివృద్ధిలో భాగంగా 30 లక్షల వ్యయంతో వ్యవసాయ గోదాం కు, 10 లక్షల వ్యయంతో మహిళా సమైక్య భవనానికి భూమి పూజ చేశారు.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామంలో దశమి కట్ట దగ్గర నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.తాగునీటి పైప్లైన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీటవేస్తూ మహిళలకు మహిళ సమైక్య ఏర్పాటు చేసుకొని మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్క మహిళ మహిళా సమైక్యాలు సభ్యురాలుగా ఉండాలి. మహిళాలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం వడ్డీ లేకుండా మహిళలకు రుణాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మహిళలు మహిళా సంఘాలలో సభ్యురాలుగా ఉండి ఆర్థికంగా బలోపితం కావాలని ప్రభుత్వం ఇచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహిళా సమాఖ్య భవనంలో మహిళలు సమావేశాలు నిర్వహించుకోవాలి అని తెలపారు.మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే గ్రామం నియోజకవర్గ, జిల్లా రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మన రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని సరైన సమయంలో సరైన చోటు నిల్వ చేసుకునేందుకు ఎలాంటి నిల్వ స్థలాలు లేక ఎంతో నష్టాలను చూస్తున్నారని అన్నారు.అకాల వర్షాల వల్ల ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఎక్కడ నిల్వ చేయాలో తేలిక గ్రామాల్లో సరైన స్థలం లేకుండా ఉండడం వల్ల ఎంత నష్ట పోతామో రైతులుగా మనందరికీ తెలుసు అందుకు ప్రతి గ్రామంలో గోదాముల నిర్మాణం ఎంతో అవసరం ఉందని తెలిపారు.గోదాంలు ఉంటే నిల్వ సౌకర్యాలు పెరగడం ద్వారా రైతులు తమ పంటను వెంటనే తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి తగ్గుతుంది. ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశం పేరుగుతుందని అన్నారు. గ్రామంలోని ప్రజలకు తాగునీటి సమస్యలు తీసే విధంగా పైప్లైన్ ద్వారా నేరుగా ప్రతి ఇంటికి తాగునీటిని అందించడం జరుగుతుంది తెలిపారు. గ్రామాలలో అందరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే గ్రామం అన్ని విధాలుగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు.గ్రామ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పిపిసిఎస్. చైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, జిల్లా సీనియర్ నాయకులు విక్రమ్ సింహారెడ్డి, గోపాల్ రెడ్డి, ఆలయ చైర్మన్ ప్రహల్లాద రావు, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు తూమ్ కృష్ణారెడ్డి,, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచ్ యాకోబ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పథకాల ఫలాలు అందేలా సమన్వయంతో పనిచేయాలి

- అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు.. గడువులోగా పూర్తి చేయాలి

- దిశ సమావేశంలో అధికారులకు ఎంపీ గోడం నగేష్ ఆదేశం

- రైల్వే, జాతీయ రహదారులు, విద్య, మహిళా శిశు సంక్షేమం, ఉపాధి హామీ, పీఎం జన్‌మన్ పథకాలపై సమీక్ష



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ సూచించారు. అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ గోడం నగేష్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల పనితీరు, పెండింగ్ సమస్యలపై సమీక్షించారు. రైల్వే శాఖ పరిధిలోని అభివృద్ధి పనులు, జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ, విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్, మహిళా శిశు సంక్షేమం, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ, పీఎం జన్‌మన్, జన్‌ధన్ యోజన, గిరిజన సంక్షేమం, పోషకాహార పంపిణీ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, మహిళా శిశు సంక్షేమం, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే నిధులను సక్రమంగా వినియోగిస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. శాఖల మధ్య సమన్వయంతో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభం, పురోగతికి సంబంధించిన వివరాలను ముందస్తుగా తనకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక పర్యటనలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. విద్యాశాఖపై సమీక్షిస్తూ మధ్యాహ్న భోజన పథకం, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, నిధుల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించాలని, డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని భవిత కేంద్రాల ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్ష సందర్భంగా గ్రామీణ కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలని ఎంపీ సూచించారు. ఉపాధి హామీ నిధులతో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ పనులపై సమీక్షిస్తూ సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్) నిధులతో కాప్రి--బేలా, ఇచ్చోడ--డేడ్ర రహదారుల విస్తరణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార పంపిణీపై సమీక్షించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీలో రోస్టర్ విధానం, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అర్హులైన కుటుంబాలకు పీఎం జన్‌మన్, జన్‌ధన్ యోజన తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని పేర్కొన్నారు. లబ్ధిదారులను గుర్తించి పథకాల అమలులో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. దిశ సమావేశంలో ఎంపీ సూచించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఖేలో ఇండియా పోస్టర్లను ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరంద్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఏ పీడీ రాథోడ్ రవీందర్, ట్రాన్స్‌కో ఎస్ఈ సుభాష్, డీఈఓ మాధవి, డీపీఓ రమేష్, ఐసీడీఎస్ పీడీ మిల్కా, దిశ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జైదుపల్లి విద్యార్థి శివానంద్ ఎంపిక



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : గ్రామీణ ప్రాంత విద్యార్థులను సానబెడితే ఆణిముత్యాలుగా విరాజిల్లుతారనే నానుడిని నిజం చేసిన విద్యార్థి. ఉపాధ్యాయులు మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి క్రమశిక్షణతో శిక్షణ ఇస్తే ఆణిముత్యాల్లా ప్రకాశిస్తారు. చదివిన పాఠశాలకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి, జిల్లాకు, కనిపెంచిన తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్టలు తెస్తారనడులో ఎలాంటి సందేహం ఉండదు. వికారాబాద్ మండల పరిధిలోగల జైదుపల్లి గ్రామానికి చెందిన తాళ్ళపల్లి గోపాల్ కుమారుడు తాళ్ళపల్లి శివానంద్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు (అండర్-17) ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి శివానంద్ రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు శివానంద్‌ను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శివానంద్ ఎంపిక పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని గ్రామాల్లో పండుగలా ప్రారంభించాలి


- కలెక్టర్ హేమంత్ సహదేవరావు.



ములుగు నవంబర్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేటలో ప్రారంభించనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ములుగు జిల్లాలోనూ అదే రోజు అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో పండుగ వాతావరణంలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. సీఎస్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రతి కుటుంబం నుంచి బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలతో దరఖాస్తులు సేకరించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ఏ కుటుంబం కూడా పథకానికి దూరం కాకుండా చూడాలని, వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. పథకం ప్రయోజనాలను మైక్ ప్రచారం, పోస్టర్లు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, సీపీఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ బీమా భద్రత కల్పించాల

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందికి కృత్రిమ మేధస్సు పై శిక్షణ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ :18(విజన్ ఆంధ్ర) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందికి కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంపై మూడు రోజుల ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించారు. విద్యా ఆవిష్కరణ, పురోగతి కేంద్రం (సీఏఐఏ) ఆధ్వర్యంలో 'ఏఐ డీప్ డ్రైవ్' పేరిట ఈ కార్యశాల చేపట్టారు. సీఏఐఏ డైరెక్టర్ డాక్టర్ అనుపమ నిత్యానంద్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చాట్‌జీపీటీ, గూగుల్ ఏఐ, గూగుల్ ఫ్లో, కాన్వా వంటి ఏఐ సాధనాల వినియోగంపై అవగాహన కల్పించారు. చిత్రాలు, వీడియోల రూపకల్పన, ప్రాంప్టింగ్, రోజువారీ కార్యాలయ పనుల్లో ఏఐ వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలతో శిక్షణ ఇచ్చారు. ఏఐని బాధ్యతాయుతంగా వినియోగిస్తూ పని సామర్థ్యం, ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా తమ డిజిటల్ నైపుణ్యాలు మెరుగుపడ్డాయని సిబ్బంది తెలిపారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న గీతం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

టీబీ రోగులకు 15 నిక్షయ్ పోషణ కిట్ల పంపిణీ

- క్షయ వ్యాధి రహిత సమాజమే మన లక్ష్యం

- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. అప్పయ్య



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో బుధవారం 15 మంది క్షయ వ్యాధి (టీబీ) బాధితులకు నిక్షయ్ పోషణ కిట్లను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. అప్పయ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డా. అప్పయ్య మాట్లాడుతూ, క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణమే మనందరి లక్ష్యమని పేర్కొన్నారు. టీబీ వ్యాధితో బాధపడుతున్న రోగులు వైద్యుల సూచనల మేరకు నిర్ణీత సమయానికి క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. మందులతో పాటు పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కనీసం ఒక టీబీ రోగిని ఆరు నెలల పాటు దత్తత తీసుకొని, వారికి అవసరమైన పోషకాహార సహాయం అందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సహకారం రోగులు త్వరగా కోలుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ మల్లేశం, గారు టీబీ రోగుల సంక్షేమం కోసం 10 నిక్షయ్ పోషణ కిట్లను ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమని, ఇది ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి సాక్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డా.ఇందిరా, అడిషనల్ డీఎంహెచ్ఓ డా. మధన్ మోహన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ మరియు ఇన్‌ఛార్జ్ జిల్లా క్షయ నివారణ అధికారి డా. ప్రదీప్ రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణారావు, ఏఓ రాజేష్ కుమార్ గౌడ్, ఎంజీఎం ఏ ఆర్ టి నోడల్ అధికారి డా. సూర్యప్రకాష్, మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి, డీహెచ్ఈఓ సందెల శ్రీనివాస్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ కిరణ్, నగేష్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పర్యటనవిజయవంతంచేయాలి

- అధికారులకు మంత్రి ఆదేశం

- సభావేదిక స్థలాన్ని, బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



సిద్దిపేటజిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : తెలంగాణరాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శదామోదర్ రాజనర్సింహ సిద్దిపేట లో పర్యటించారు. రేపు (19.11.2026) జరిగే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను అన్ని శాఖల అధికారులుసమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి దామోదర్రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటన లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంప్రారంభోత్సవంతోపాటుఅభివృద్ధి,శంకుస్థాపనలను ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిప్రారంభించనున్నారనిమంత్రివెల్లడించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహఅధికారులను ఆదేశించారు. బహిరంగ సభకు భారీగా ప్రజలు తరలిరానున్న నేపథ్యం లో వేదిక ఏర్పాట్లు, కుర్చీలు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతరాయ విద్యుత్తు, సౌండ్ సిస్టమ్, మెడికల్ క్యాంపు, అంబులెన్స్‌లు , హెలిప్యాడ్ ,ముఖ్యమంత్రి గారి పాదయాత్ర, వాహన పార్కింగ్ ఏర్పాట్ల పై మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు జిల్లా కలెక్టర్, అధికారులతో చర్చించారు.

విద్యార్థుల్లో ఓటు హక్కుపై అవగాహన పెంపొందించాలి - ఆర్డీవో కృష్ణవేణి



ములుగు, నవంబర్ 18;విజన్ ఆంధ్ర ప్రతినిధి : విద్యార్థుల్లో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించాలని ములుగు ఆర్డీవో కృష్ణవేణి సూచించారు. ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయంలో జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ములుగు నియోజకవర్గంలోని 10 మండలాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కృష్ణవేణి పిలుపునిచ్చారు. ఓటరు జాబితా, ఈవీఎంలు, వీవీప్యాట్, పోలింగ్ ప్రక్రియపై పోటీలు నిర్వహించి విద్యార్థుల అవగాహనను పరీక్షించారు. విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎంఈఓ వజ్జ తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ వరంగల్ కేంద్ర గ్రంథాలయం లో నూతన పుస్తకాల ప్రదర్శన ప్రారంభం

- పుస్తక పఠనమే ప్రగతికి తొలిమెట్టు కిట్స్‌లో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- వినియోగదారులకు ఉత్తమ గ్రంథాలయ అధ్యాపక అవార్డు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీల నిర్వహణ మరియు విజేతలకు బహుమతుల ప్రదానం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): పుస్తక పఠన సంస్కృతిని పెంపొందించడం, విద్యార్థుల్లో విజ్ఞాన సముపార్జన పట్ల ఆసక్తిని కలిగించడం, గ్రంథాలయాల ప్రాముఖ్యతను చాటిచెప్పే లక్ష్యంతో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్), వరంగల్ కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు అనిప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె అశోక రెడ్డి సగర్వం గా తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను లిముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), వరంగల్ గ్రంథాలయాధికారి డా. వై. శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డా. వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ, పుస్తకాలు మనిషి జీవితానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని, డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠనానికి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞాన, సాంకేతిక, సాహిత్య, సామాజిక అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదివి తమ జ్ఞాన పరిధిని విస్తరించుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని, సృజనాత్మకతను, విమర్శనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించే విజ్ఞాన కేంద్రాలని వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా వికాసంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని నిరంతర పఠన అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.లిచర్చా వేదిక (డిబేట్) పోటీల విజేతలు విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ, తార్కిక విశ్లేషణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు నిర్వహించిన డిబేట్ పోటీల్లో ఎంబీఏ విద్యార్థిని చంద్రిక తడువాయి ప్రథమ బహుమతి, సాత్విక్ సదువాల ద్వితీయ బహుమతి, రిథ్విక రాగళ్ల తృతీయ బహుమతి సాధించారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.గ్రంథాల యాధికారి, కార్యక్రమ కన్వీనర్ డా. కె. ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం పఠన సంస్కృతిని ప్రోత్సహించడం, గ్రంథాలయ సేవలపై అవగాహన కల్పించడం అని తెలిపారు. ఉత్తమ గ్రంథాలయ వినియోగదారులకు పురస్కారాలు 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉత్తమ గ్రంథాలయ వినియోగదారులుగా ఎంపికైన సిబ్బంది, విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.సిబ్బంది విభాగంలో సి.ఎస్.ఈ. విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. సాయి కల్యాణ్ ఎంపికయ్యారు. విద్యార్థుల విభాగంలో ఎం.టెక్ (ఎస్సీ) విద్యార్థి పి. శివసిద్ధత్ కేశవ శర్మ, సీఎస్ఎం విభాగానికి చెందిన కె. అనుప్రి ఉత్తమ గ్రంథాలయ వినియోగదారులుగా గుర్తింపు పొందారు. వ్యాసరచన పోటీల్లో మెకానికల్ విభాగానికి చెందిన కె.బి. మిలింద్ రెడ్డి ప్రథమ బహుమతి, సీఎస్ఎం విభాగానికి చెందిన సిరి చందన ద్వితీయ బహుమతి, మెకానికల్ విభాగానికి చెందిన ఎన్. హాసిని తృతీయ బహుమతి సాధించారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, డీన్ అకడమిక్ ప్రొఫెసర్ ఎస్. నరసింహారెడ్డి, లైబ్రరీ అడ్వైజరీ కమిటీ (ఎల్ఏసీ) చైర్మన్ ఁ డీన్ ఆర్ ఁ డీ ప్రొఫెసర్ బి. రమాదేవి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి.ఆర్ రమేష్ రెడ్డి, ప్రొఫెసర్ కె శ్రీధర్, ప్రొఫెసర్ నిరంజన్ ప్రొఫెసర్ జ్యోతి ప్రభ, అసోసియేట ప్రొఫెసర్ అండ్ పి ఆర్ శి డా డి ప్రభాకరరా చారి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, 200 విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- పట్టభద్రుల ఓటరు జాబితా రూపకల్పనను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- పట్టభద్రుల ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష.

- పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా అధికారులు



గద్వాల నవంబర్ 18(విజన్ ఆంధ్ర బ్యూరో) : పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాల ఓటరు జాబితా డి-నోవో (కొత్తగా) రూపకల్పన ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా అధికారులకు సూచించారు. పట్టభద్రుల ఓటరు జాబితా డి-నోవో రూపకల్పనలో ఇప్పటివరకు సాధించిన పురోగతిపై బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులు, ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్న వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు, దరఖాస్తుల పరిశీలన, ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతిని వివరించారు. ఇప్పటివరకు జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 22,987 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించి అందిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించినట్లు వెల్లడించారు. ఇంకా 40 దరఖాస్తులు పరిశీలనకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిశీలించి పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో 14,172 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం నిర్ణీత విధి విధానాల ప్రకారం తదుపరి ప్రక్రియను పూర్తి చేసి, డిసెంబర్ 30వ తేదీన తుది పట్టభద్రుల ఓటరు జాబితాను ప్రకటించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు అనర్హుల పేర్లు ఓటరు జాబితాలో చేరకుండా జాగ్రత్తలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు బహిరంగ ప్రకటనలు, వార్తాపత్రికల ద్వారా ప్రచారం నిర్వహించామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అల్యూమిన్, తదితర అసోసియేషన్ల సహకారంతో ముందుకెళ్లడం జరిగిందన్నారు. సామూహికంగా సమర్పించే దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి, ప్రతి దరఖాస్తు అర్హతను స్వతంత్రంగా ధ్రువీకరించిన తర్వాతే ఆమోదిస్తున్నామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. అంతకుముందు ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి చేపట్టిన డీ-నోవో ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, కచ్చితత్వం పాటించాలని, అర్హత లేని వ్యక్తులకు ఓటరు జాబితాలో చోటు కల్పించరాదని ఆదేశించారు. ప్రస్తుత ఓటరు జాబితా తయారీ పూర్తిగా కొత్తగా చేపడుతున్న డీ-నోవో ప్రక్రియ అని, గతంలో ఉన్న ఓటరు జాబితాలో పేర్లు ఉన్నంత మాత్రాన ప్రస్తుతం కూడా అవి ఆటోమేటిక్‌గా కొనసాగవని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని రాజకీయ పార్టీలు, ప్రజలు, ఇతర భాగస్వాములకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి విద్యార్హతలను సంబంధిత ధ్రువీకరణ పత్రాల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. తగిన విద్యార్హతలు లేని వ్యక్తులను ఓటరు జాబితాలో చేర్చరాదని, అనర్హుల నమోదు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఒకే వ్యక్తి పేరు వేర్వేరు ప్రాంతాల్లో నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దరఖాస్తుల్లో పేరు, తండ్రి పేరు, చిరునామా తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనుమానాస్పద దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సరైన ఆధారాలతో నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో సంఖ్య పెంచడం కంటే అర్హులైన ఓటర్లను మాత్రమే చేర్చి నాణ్యమైన జాబితా రూపొందించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియకు వినియోగించే సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ వ్యవస్థలను ముందుగానే పూర్తిస్థాయిలో పరీక్షించాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు, అనువాద లోపాలు, అప్లికేషన్ సెంటర్లలో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. సరైన పరీక్షలు, ధ్రువీకరణ లేకుండా కొత్త సాఫ్ట్‌వేర్ లేదా ఫీచర్లను అమలు చేయరాదని స్పష్టం చేశారు. ఓటరు జాబితా తయారీ ప్రతి దశలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, వారి అభ్యంతరాలు, సూచనలను నమోదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశాల వివరాలు, తీసుకున్న నిర్ణయాలను రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు. రోల్ అబ్జర్వర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తుల పరిశీలన, అర్హతల నిర్ధారణ, పత్రాల ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. గత సమావేశంలో సూచించిన ప్రత్యేక డ్రైవ్ నిర్వహణపై కూడా వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్ లో ఆర్డిఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇసుక నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలి

- అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- తుమ్మిళ్ల ఇసుక రీచ్ నిర్వహణ పక్కాగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నవంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలో ఇసుక నిర్వహణను పారదర్శకంగా చేపట్టడంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా స్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక నిర్వహణను పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ,ప్రజలకు అవసరమైన ఇసుకను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.తుంగభద్ర,కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రస్తుతం నదుల్లో నీటి మట్టం తక్కువగా ఉన్నందున నదీ గర్భంలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల పర్యావరణానికి, భూగర్భ జలాలకు నష్టం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.నదుల పరివాహక గ్రామాల్లో సంబంధిత సర్పంచులు,గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు,ఇతర శాఖల అధికారులతో గ్రామ సభలు నిర్వహించి అక్రమ ఇసుక తవ్వకాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ తవ్వకాలు లేదా రవాణా జరిగినట్లయితే వెంటనే అధికారులకు సమాచారం అందించేలా ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు,రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జూరాల రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా మోటార్ పంపులు ఏర్పాటు చేయడం,నీటిని తోడటం వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టాలని కలెక్టర్ సూచించారు.ఈ ప్రాంతాల్లో అనధికార మోటార్ పంపుల కనెక్షన్లను గుర్తించి,సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పోలీస్,ఇరిగేషన్,రెవెన్యూ శాఖల అధికారులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక జిల్లాలోకి ప్రవేశించకుండా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని తెలిపారు. ఇసుక రవాణాకు ఉపయోగించే ప్రధాన మార్గాలను గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు.అక్రమ రవాణాకు ఉపయోగించే ప్రధాన మార్గాల్లో అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలోని తుమ్మిళ్ల ప్రభుత్వ ఇసుక రీచ్ నిర్వహణను పక్కాగా చేపట్టాలన్నారు.ప్రభుత్వ నిబంధనలు,అనుమతుల మేరకే ఇసుక తవ్వకాలు జరగాలని,ఇసుక నిల్వలు,తవ్వకాలు,విక్రయాలు,రవాణా వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు.రీచ్ నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ అక్రమాలకు తావులేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.అదేవిధంగా జిల్లాలో గృహ నిర్మాణాలు చేపడుతున్న ప్రజలు,ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు అవసరమైన ఇసుకను నిబంధనల ప్రకారం త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇసుక సరఫరాలో అనవసర జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణా, అధిక ధరలకు విక్రయాలు, అనధికార నిల్వలపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రజలకు అవసరమైన ఇసుకను పారదర్శకంగా అందించడంతో పాటు నదులు,సహజ వనరులు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఇసుక నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, అక్రమ కార్యకలాపాలకు సహకరించినా సంబంధిత వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏ.డి.మైన్స్ ఆనంద్ కుమార్ స్టీఫెన్,ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాసులు,తహసీల్దార్ ప్రభాకర్,కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ప్రతి కుటుంబాన్ని భాగస్వామ్యం చేయాలి - సీఎస్ సంజయ్ జాజు

- నవంబర్ 19న ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర వ్యాప్తంగా పథకం ప్రారంభోత్సవాలు

- గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో రెండు వారాల పాటు ప్రత్యేక దరఖాస్తుల స్వీకరణ శిబిరాలు

- ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించాలి

- బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలి

- సోషల్ మీడియా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రతి ఇంటికీ పథకం సమాచారం చేరవేయాలి

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.బుధవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19న సాయంత్రం సిద్దిపేట జిల్లా నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం జరిగే సమయంలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో కూడా పథకాన్ని ప్రారంభించాలని ఆదేశించారు.ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రారంభోత్సవాలు పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులను కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని, అన్ని ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి గ్రామం, వార్డ

అనుమతులు లేకుండా గుట్టపై అక్రమ తవ్వకాలు.. ముగ్గురు అరెస్ట్

- జేసీబీ, టిప్పర్ వాహనాలు స్వాధీనం.. నిందితులకు రిమాండ్

- అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు: మావల ఎస్‌హెచ్‌ఓ ప్రేమ్ కుమార్



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర):లిలి ఆదిలాబాద్ జిల్లా మావల మండలం మావల గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టపై మట్టి తవ్వకాలు చేపట్టి, తరలించేందుకు ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను మావల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి జేసీబీ, టిప్పర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 15న మావల పోలీసులు గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఓ చిన్న గుట్ట సమీపంలో జేసీబీ, టిప్పర్ వాహనాలతో మట్టి తవ్వి లోడింగ్ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. పోలీసులు వారిని విచారించగా, పాంధేన సతీష్, మోసిన్ ఖాన్, షేక్ నవీద్‌గా గుర్తించారు. మట్టి తవ్వకాలు, రవాణాకు సంబంధించి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, చెల్లుబాటు అయ్యే పత్రాలు తమ వద్ద లేవని వారు వెల్లడించారు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వాహనాలతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 772/2026తో బీఎన్ఎస్ సెక్షన్ 303(2), పీడీపీపీఏ సెక్షన్ 3 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల వివరాలు:పాంధేన సతీష్ (37), మావల గ్రామం; మోసిన్ ఖాన్ (34), ద్వారకానగర్, ఆదిలాబాద్; షేక్ నవీద్ (35), మసూద్ నగర్, ఖానాపూర్. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక, ఇతర ఖనిజ సంపదను తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని మావల ఎస్‌హెచ్‌ఓ బి.డి. ప్రేమ్ కుమార్ హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించిన సమాచారం 8712659973 వాట్సప్ నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనలో ధన్వాడ వాసికి ప్రథమ బహుమతి

- కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో ప్రతిభ చాటిన దండిగి అనురాధ

- గ్రామస్తుల అభినందనలు....



నారాయణపేట, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా ధన్వాడ గ్రామానికి చెందిన దండిగి రాము సతీమణి దండిగి అనురాధ కూచిపూడి నృత్య ప్రదర్శనలో తన ప్రతిభను చాటుతూ ప్రథమ బహుమతి సాధించారు. కాశీలోని విశ్వేశ్వరుని సన్నిధిలో కాసి విశ్వేశ్వరునికి నిత్యంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు. తన సొంత సంస్థ అయిన శ్రీ సాయిశ్వర్ ఆర్ట్స్ అకాడమీ తరఫున ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనురాధ అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు శాస్త్రీయ నృత్య కళాకారిణులు ఈ కార్యక్రమానికి హాజరై తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. వారితో పోటీపడి అనురాధ ప్రథమ బహుమతి సాధించడం విశేషంగా నిలిచింది. కూచిపూడి నృత్యంపై ఆమెకున్న ఆసక్తి, సాధన, అంకితభావం ఈ విజయానికి కారణమని పలువురు అభిప్రాయపడ్డారు. ధన్వాడ గ్రామానికి చెందిన మహిళ జాతీయ స్థాయి వేదికపై తన ప్రతిభను చాటుతూ ప్రథమ బహుమతి సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనురాధను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జిల్లా ఫైర్ అధికారిని వెంటనే విధుల నుంచి తొలగించాలి

- లంచాల పేరుతో వేధింపులు.. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు

- నిబంధనలకు విరుద్ధంగా చాందా దగ్గర రాజేశ్వర దుకాణం కు అనుమతులు

- ఫోన్ పే ద్వారా రూ.25 వేల ముడుపులు తీసుకున్నారని ఆరోపణ

- నిబంధనల ప్రకారం షాపులు ఏర్పాటు చేసుకునే తాత్కాలిక నిర్వాహకులకు అడ్డంకులని ఆవేదన





ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలో క్రాకర్స్ విక్రయాల అనుమతుల విషయంలో ఫైర్ అధికారుల తీరుపై క్రాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు యెల్లి అరుణ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎఫ్ఎను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ప్రెస్ మీట్ లో మాట్లాడారు. లంచాల పేరుతో జిల్లా ఫైర్ అధికారి సురేష్ క్రాకర్స్ షాప్ నిర్వాహకులను వేధిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఫోన్ పే ద్వారా డీఎఫ్ఓ కు రూ.25 వేల అమౌంట్ ను ఇచ్చినట్టు ఆరోపణలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చాందా బెల్లూరి దగ్గర రాజేశ్వర దుకాణానికి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మరోవైపు రాంలీలా మైదానంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తాత్కాలిక క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులకు అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని, దీంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో క్రాకర్స్ విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, గాంధీ చౌక్లోని మల్లికార్జున స్టీల్ నిర్వాహకుడు గంగాధర్ షాప్ లో ఏడాది పొడవునా క్రాకర్స్ విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేసుకునే వారిపై ఆంక్షలు విధించడం, ఇతరులకు అనుమతులు ఇవ్వడంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ మేరకు వారు కోరారు. కార్యక్రమంలో క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, మహేందర్ గౌడ్, గొర్ల సంతోష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ నిల్వలపై దాడులు తప్పవు

- బియ్యం ధరలను అదుపులో పెట్టాలి

- రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

- రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు

- హనుమకొండలో సీపీఐ భారీ ధర్నా



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, తక్షణమే బియ్యం ధరలను ప్రభుత్వం అదుపులో పెట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. బియ్యం ధరలను అదుపు చేయకుంటే అక్రమ నిల్వలపై సీపీఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. ధరల నియంత్రణ, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం తదితర డిమాండ్లతో సీపీఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ లో బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ కృత్రిమ కొరత సృష్టిస్తూ వ్యాపారులు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని, దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెరిగిన బియ్యం ధరలను తక్షణమే అదుపులోకి తీసుకురావాలని, అక్రమంగా నిల్వ చేసిన గోదాములపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు అన్ని రకాల నిత్యావసర సరుకులను పప్పులు, నూనె, చక్కెర మొదలైనవి, సబ్సిడీపై పంపిణీ చేయాలని, ప్రజల ఆకలి కేకలను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మండల కార్యదర్శి ఎన్. అశోక్ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు అలకుంట్ల యాకయ్య, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, పొక్కుల సదానందం, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, నోముల కిశోర్, మాలోత్ మంగ, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, అలకుంట్ల మల్లయ్య, కనకం కావ్యశ్రీ, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతలోని ప్రతిభకు యువజన ఉత్సవాలు చక్కని వేదిక

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఆదిలాబాద్‌కు గుర్తింపు తీసుకురావాలి

- జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ప్రారంభించిన ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీ గోడం నగేష్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎంపీ గోడం నగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. యువత పోటీతత్వాన్ని అలవర్చుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, నృత్యాలకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉందని, పురాతన దేవాలయాల్లోని శిల్పకళలోనూ మన పూర్వీకుల కళా వైభవం, నృత్యరీతులు ప్రతిబింబిస్తాయని వివరించారు. గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. పోటీల్లో పాల్గొనేటప్పుడు అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని తమలోని ప్రతిభను సంపూర్ణంగా ప్రదర్శించాలని సూచించారు. 1998లో ఆదిలాబాద్‌లో జాతీయ స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుత ఉత్సవాల్లో పాల్గొంటున్న యువతీయువకులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల వరకు విజేతలుగా నిలిచి అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. యువతలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంతోపాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీధి నాటకాలు, జానపద గీతాలు, నృత్యాలు, వ్యాసరచన, చిత్రలేఖనం, కవితా రచన తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. బాలికలు వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని, బాలురు సైతం అన్ని రంగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. యువత నైపుణ్యాభివృద్ధికి స్టెప్ ద్వారా అవసరమైన శిక్షణ కార్యక్రమాలను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం యువతీయువకులు ప్రదర్శించిన వివిధ కళారూపాలు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఈఓ స్టెప్ సతీష్, పోటీల న్యాయ నిర్ణేతలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో మహిళలకు అగ్రస్థానం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంలో మహిళలకు అగ్రస్థానం కల్పిస్తుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన చేయూత పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, తదితరులు హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించి... రాష్ట్ర గీతాన్ని ఆలపించారు అనంతరం లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళల సాధికారత సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మహిళల అభ్యున్నతికి చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సానుకూల మార్పులు తీసుకొస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికీ చేయూత పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు ప్రజాప్రతినిధుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అధికార యంత్రాంగమే నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్లు మంజూరు చేసే విధానానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఒకే రోజు 2,698 మందికి పెన్షన్ల మంజూరు పత్రాలు అందించడం ప్రజాపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలు, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించబడ్డాయని ఎమ్మెల్యే వివరించారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, ఇతర సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తున్నామని చెప్పారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అర్హులైన మిగతా లబ్ధిదారులకు కూడా దశలవారీగా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఒకేసారి మంజూరు చేయడం సాధ్యం కాదని, అర్హత ఆధారంగా విడతలవారీగా అందిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలం ఉన్న అర్హులకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విధానాన్ని కూడా వివరించారు. పేదల గృహ అవసరాలను తీర్చేందుకు కొత్తగా టవర్స్ నిర్మాణానికి కూడా చర్యలు చేపట్టామని తెలిపారు. పెన్షన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి పెన్షన్లు లేదా ఇతర సంక్షేమ పథకాల మంజూరు కోసం ఎవరైనా ఒక్క రూపాయి డిమాండ్ చేసినా సహించేది లేదని హెచ్చరించారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులైన ప్రజలకు చేరాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన క్యాంపు కార్యాలయానికి లేదా స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇప్పటికే పెన్షన్లు మంజూరైన వారితో పాటు ఇంకా అర్హత ఉండి పెన్షన్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, క్యాంపు కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం లేదా మున్సిపల్ అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజులు ఆలస్యమైనా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ .. కాళోజి కళాక్షేత్రంలో చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం... వేలాదిగా వచ్చిన లబ్ధిదారులతో ఒక పండగ వాతావరణంలా కనిపిస్తుందన్నారు కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల కోసం అనేక దరఖాస్తులు వస్తుంటాయని పేర్కొన్నారు. వారందరికీ పింఛన్లు మంజూరు అవుతుండడంతో లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియగా సాగుతుందన్నారు. ప్రభుత్వం అందించే పింఛన్లు కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో సహాయకరంగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్, జిడబ్ల్యూ ఎంసి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధ ధరలు ప్రకటించాలి

- బియ్యం బ్లాక్ మార్కెట్ ను అరికట్టి ధరలు తగ్గించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు మోతే లింగారెడ్డి



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించి రైతులు ఉత్పత్తి చేసే ఆహార వాణిజ్య అన్ని రకాల పంటలకు చట్టబద్ధ ధరలు నిర్ణయించాలని, బ్లాక్ మార్కెట్టును అరికట్టి మధ్య దళారీ వ్యవస్థను నిర్మూలించి బియ్యం కృత్రిమ కొరతను సృష్టించిన వ్యాపార వాణిజ్య వర్గాలను చట్ట ప్రకారం శిక్షించాలని, బియ్యం ధరలు తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మార్వో కార్యాలయం ముందు హసన్ పర్తి మండల సిపిఐ ఆధ్వర్యంలో బియ్యం ధరలు తగ్గించాలని మార్కెట్ ను అరికట్టాలని నిత్యావసర వస్తువులు రేషన్ షాపుల ద్వారా అందించాలని డిమాండ్ తో ధర్నా నిర్వహించి ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేయడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నినో ద్వారా ఏర్పడిన కరువును ఆసరాగా చేసుకుని బ్లాక్ మార్కెట్ దొంగలు బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెంచడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రభుత్వం వెంటనే బియ్యం ధరలు అదుపు చేసి కృత్రిమ కొరత సృష్టించిన వ్యాపారులని శిక్షించాలని డిమాండ్ చేశారు వ్యవసాయ శాస్త్రవేత్త స్వామి నాథన్ సిఫారసులను అమలు చేయుట ద్వారా రైతాంగాన్ని చట్టబద్ధ మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణ ధరల నిర్ణయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో భారత రాజ్యాంగం ఏడవ షెడ్యూల్లో ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నేటి రైతాంగ పరిస్థితి వరి వేస్తే ఉరే దిక్కు అన్నట్లు ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ అసమతుల్యంతో వర్షాభావంతో నీరు లేక పంటల దిగుబడి లేక సరియైన ధర లేక మద్దతు ధర, బోనస్ అందక రైతాంగం ఆత్మహత్యలకు దారితీస్తుందని, వెంటనే ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకుంటూ కరువు నివారణ చర్యలు చేపట్టాలని,21 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా కార్యదర్శి దొమ్మాటి ప్రవీణ్ కుమార్, షేక్ బాబు, ముజ్జిగ పరుశరాములు, నాంపల్లి లక్ష్మయ్య, ముజ్జిగ అజయ్, గోపు బుచ్చిరెడ్డి, కొత్త గట్టు శ్యాంసుందర్, కల్వచర్ల వెంకటేశ్వర్లు, ఈశ్వర్ లింగం, తిక్క సూర్య ప్రకాష్, లింగాడపు వెంకటయ్య, సూరారం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆడిటోరియం రీడింగ్ హాల్ ప్రారంభం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : హనుమకొండ జిల్లాలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్ ఆధ్వర్యంలో.. నూతన ఆడిటోరియం రీడింగ్ హాల్ లను బుధవారం.. వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి చేతుల మీదుగాఘనంగా ప్రారంభించడం జరిగింది.ఈ ఆడిటోరియం, రీడింగ్ హాల్ వ్యయం 97 లక్షల గ్రంథాలయ సంస్థ నిధులతో టీజీఈ డబ్ల్యు ఐ డి సి ద్వారా నిర్మించడం జరిగింది.గ్రౌండ్ ఫ్లోర్ ఆడిటోరియం నందు 500 కూర్చోవడానికి, మొదటి అంతస్తులో అధునాతన వసతులతో 200 మంది పాఠకులకు సరిపడా రీడింగ్ హాల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది ఈ కార్యక్రమం లో టి జి డబ్ల్యూ ఐ డి సి ఈ.ఈ పి. అరుణ్ కుమార్ , జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యదర్శి ఏ. సరిత , గ్రంథాలయం సంస్థ సిబ్బంది, డిప్యూటీ లైబ్రరియన్ కరుణ కుమారి , సీనియర్ అసిస్టెంట్ నిఖిల్ , గ్రేడ్ -2 లైబ్రరియన్ మల్లికార్జున రావు, గ్రేడ్ - 3 లైబ్రరియన్ పురుషోత్తం రాజు, జూనియర్ అసిస్టెంట్ సాయి కృష్ణ, గ్రంథ సిబ్బంది & గ్రంధం పాఠకులు పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డు బుక్క బజారులో నూతన సీసీ రోడ్డుకు శంకుస్థాపన, మిషన్ భగీరథ పనుల పరిశీలన.



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్18(విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ పట్టణంలోని 32వ వార్డు బుక్క బజారులో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ అదేవిధంగా 32వ వార్డులో కొనసాగుతున్న నూతన మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 36 వార్డులకు స

ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలకు నూతన శకం

- ప్రిన్సిపాల్‌గా ప్రొఫె. విజయ బాధ్యతలు
- ఘనంగా స్వాగతం పలికిన విద్యార్థులు
- కళాశాల అభివృద్ధిపై భారీ ఆశలులి



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 18,విజన్ ఆంధ్ర :

తెలంగాణ విద్యా చరిత్రలోనే ప్రత్యేక స్థానం కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫె. విజయ నియమితులయ్యారు. ఈ నియామకంతో కళాశాలలో నూతన ఉత్సాహం నెలకొంది. బాధ్యతలు స్వీకరించిన వెంటనే విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ రహీం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల బృందం ప్రిన్సిపాల్ ఛాంబర్‌కు చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం అంతా సందడిగా మారింది. విద్యార్థులు సంతోషంతో నినాదాలు చేస్తూ నూతన ప్రిన్సిపాల్‌కు స్వాగతం పలికారు.

చరిత్ర కలిగిన కళాశాలకు కొత్త నాయకత్వం

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల అంటేనే ఒక చరిత్ర. దశాబ్దాలుగా ఎంతో మంది మేధావులు, రాజకీయ నాయకులు, రచయితలు, అధికారులు ఈ కళాశాల నుంచే ఎదిగారు. అలాంటి ప్రతిష్ఠాత్మక కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడం అంటే మామూలు విషయం కాదు. ప్రొఫె. విజయ అనుభవం, విద్యా రంగంలో ఆమెకున్న పట్టు, విద్యార్థుల పట్ల ఆమెకున్న చొరవే ఈ పదవికి ఆమెను ఎంపిక చేయడానికి కారణమని విశ్వవిద్యాలయ వర్గాలు చెబుతున్నాయి. కళాశాలలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల అవసరాలు, పరిశోధన రంగంలో రావాల్సిన మార్పులపై ప్రొఫె. విజయకు పూర్తి అవగాహన ఉందని అధ్యాపకులు అంటున్నారు. ఆమె నాయకత్వంలో కళాశాల మరో మెట్టు ఎక్కుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల ఆకాంక్షలు - రహీం ఏం చెప్పారు?

ఈ సందర్భంగా రీసెర్చ్ స్కాలర్ రహీం మాట్లాడుతూ కళాశాల భవిష్యత్తుపై తన ఆశలను వ్యక్తం చేశారు. “ఆర్ట్స్ కళాశాలకు ఎంతో గొప్ప చరిత్ర ఉంది. ఇక్కడ చదివిన ఎంతో మంది నేడు దేశవ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ప్రొఫె. విజయ నాయకత్వంలో ఆ చరిత్రకు మరింత వన్నె తెచ్చే పనులు జరుగుతాయని నమ్ముతున్నాం. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, పరిశోధనలకు ప్రోత్సాహం అందించడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నాం” అని రహీం అన్నారు. అంతేకాదు, విద్యార్థుల తరఫున కొన్ని కీలక విజ్ఞప్తులను కూడా ఆయన ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. కళాశాలలో లైబ్రరీని ఆధునీకరించడం, డిజిటల్ లైబ్రరీ సౌకర్యం కల్పించడం, తరగతి గదులను మెరుగుపరచడం, పరిశోధన చేస్తున్న స్కాలర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడం, హాస్టల్ వసతులు మెరుగుపరచడం, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు.

అధ్యాపకులు, విద్యార్థుల్లో నూతన ఉత్సాహం

ప్రొఫె. విజయ నియామకం పట్ల అధ్యాపకులు కూడా హర్షం వ్యక్తం చేశారు. ఆమె చాలా క్రమశిక్షణ కలిగిన అధ్యాపకురాలిగా, విద్యార్థులతో స్నేహపూర్వకంగా వ్యవహరించే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారని వారు చెబుతున్నారు. విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు, కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, జాతీయ స్థాయి సదస్సులు నిర్వహించడంలో ఆమె ముందుంటారని అధ్యాపకులు ఆశిస్తున్నారు. విద్యార్థినీ విద్యార్థులు కూడా ప్రిన్సిపాల్ మార్పును సానుకూలంగా చూస్తున్నారు. “కొత్త ప్రిన్సిపాల్ వచ్చారు, కళాశాలలో చాలా మార్పులు వస్తాయి. మా సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయి” అని వారు చెబుతున్నారు. ముఖ్యంగా రీసెర్చ్ స్కాలర్లు తమ పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావంతో ఉన్నారు.

ప్రొఫె. విజయ హామీ


విద్యార్థుల శుభాకాంక్షలను స్వీకరించిన ప్రొఫె. విజయ వారిని ఆప్యాయంగా పలకరించారు. విద్యార్థులందరికీ ధన్యవాదాలు తెలిపారు. “ఈ కళాశాల నాది, మీది, మన అందరిది. అందరం కలిసి పని చేస్తేనే కళాశాల అభివృద్ధి సాధ్యం. విద్యార్థుల అభ్యున్నతికి, పరిశోధనల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను. మీ సమస్యలు నా దృష్టికి తీసుకురండి, పరిష్కరించడానికి ప్రయత్నిస్తాను” అని హామీ ఇచ్చారు. కళాశాలలో క్రమశిక్షణ, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుదలకు ప్రాధాన్యత ఇస్తానని ఆమె స్పష్టం చేశారు.

ముగింపు


ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల చరిత్రలో ఇది మరో మైలురాయి. నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫె. విజయ నియామకంతో విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఆమె నాయకత్వంలో ఆర్ట్స్ కళాశాల జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందుతుందని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తుల పరిశీలనకు ఈ నెల 20 గడువు

మహబూబ్‌నగర్ జిల్లాలో 45,477 దరఖాస్తులు.. మరో 1,600 క్షేత్రస్థాయి విచారణలో



మహబూబ్‌నగర్, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కోసం అందిన దరఖాస్తుల పరిశీలనను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఖుష్బూ గుప్తా తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా పునఃరూపకల్పన (డి నోవో) ప్రక్రియపై బుధవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేటూరు ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఫారం–18 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన పురోగతిని డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు పట్టభద్రుల ఓటరు నమోదుకు మొత్తం 45,477 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ఈసారి సుమారు 10 వేల దరఖాస్తులు అదనంగా వచ్చాయని వెల్లడించారు. వీటిలో సుమారు 1,600 దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మరో రెండు రోజుల్లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేటూరు మాట్లాడుతూ ఓటరు నమోదు, జాబితా రూపకల్పనలో ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వం పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో నవీన్, ఎన్నికల డీటీ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో కలకలం!

మంత్రులకే ఓటమి భయం..

- **వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోమంటున్న మంత్రులు!**
- **కరువు పరిస్థితులతో గెలుపు కష్టమని అనుచరులతో అంటున్న మంత్రులు**
- **పార్లమెంట్ బాట పడుతున్న ఉత్తమ్, కోమటిరెడ్డి**
- **రిటైర్మెంట్ దిశగా తుమ్మల**
- **వారసులను బరిలో దించాలని జూపల్లి, దామోదర ఆలోచన!**

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్,
నవంబర్ 18,విజన్ ఆంధ్ర :

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపుతున్న వార్త ఇది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోమని అప్పుడే కాడి ఎత్తేస్తున్న ఐదుగురు కాంగ్రెస్ మంత్రులు ఉన్నారన్న ప్రచారం కాంగ్రెస్ పార్టీలో పెద్ద చర్చకు దారితీస్తోంది. అధికారంలో ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలంగా లేవని, కరువు పరిస్థితులు ఇలానే ఉంటే గెలవడం కష్టమని ఆ మంత్రులు తమ అనుచరులతో అంటున్నట్టు తెలుస్తోంది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహలు ఈ జాబితాలో ఉన్నారని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

అధికార పార్టీలోని కీలక మంత్రులే ఇలా వెనక్కి తగ్గుతున్నారన్న వార్తతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. ప్రతిపక్ష పార్టీలు ఈ విషయాన్ని ఆయుధంగా మార్చుకుని విమర్శలు చేస్తున్నాయి. “అధికారంలో ఉండగానే గెలుస్తామన్న నమ్మకం లేకపోతే ఇంక ప్రజలకు ఏం చేస్తారు?” అంటూ ప్రతిపక్ష నేతలు ఎద్దేవా చేస్తున్నారు. అయితే ఇది కేవలం ప్రచారమా? లేక మంత్రుల నిజమైన మనసులోని మాటా? అన్నదానిపై కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కరువు భయం - గెలుపుపై అనుమానం!

కరువు పరిస్థితులు ఇలానే ఉంటే గెలవడం కష్టమని మంత్రులు అనుచరులతో అంటున్నట్టు సమాచారం. తమ నియోజకవర్గాల్లో నీటి కొరత, పంటల నష్టం, రైతుల అసంతృప్తి పెరిగిపోతున్నాయని, ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని వారు ఆందోళన చెందుతున్నారట. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులు అనుకున్నంత వేగంగా జరగకపోవడం కూడా తమకు ఇబ్బందిగా మారిందని మంత్రులు తమ సన్నిహితులతో చెబుతున్నట్టు తెలుస్తోంది. ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు అడగడానికి మొహం చెల్లడం లేదని కొంతమంది మంత్రులు వాపోతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కరువు ప్రభావం ఎక్కువగా ఉండడంతో, అక్కడి ఓటర్లను ఒప్పించడం చాలా కష్టమని మంత్రులు భావిస్తున్నారట. “ఈ సారి గెలవడం చాలా కష్టం, గెలిచినా మెజారిటీ రాదు” అని వారు అంచనా వేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

అసెంబ్లీ వద్దు - పార్లమెంట్ ముద్దు!

అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడం కష్టమని పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకుంటున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నారని సమాచారం. అసెంబ్లీ కంటే పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభమని, అక్కడ జాతీయ అంశాలు పనిచేస్తాయని, స్థానిక సమస్యల ఒత్తిడి తక్కువగా ఉంటుందని వారు భావిస్తున్నారట.

ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే ఎంపీగా పనిచేసిన అనుభవం ఉండడంతో, మళ్లీ ఢిల్లీ బాట పట్టాలని ఆలోచిస్తున్నారని తెలుస్తోంది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా తన నియోజకవర్గంలోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ నుంచి పోటీ చేస్తే మంచిదని తన అనుచరులతో అంటున్నారట. వీరిద్దరూ పార్లమెంట్‌కు వెళ్లిపోతే వారి అసెంబ్లీ స్థానాల్లో ఎవరిని నిలబెట్టాలన్నది కూడా పెద్ద ప్రశ్నగా మారింది. వారి కుటుంబ సభ్యులకే ఆ స్థానాలు ఇస్తారా? లేక నమ్మకస్తులకు ఇస్తారా? అన్నదానిపై కూడా చర్చ జరుగుతోంది.

రిటైర్మెంట్ దిశగా తుమ్మల!

ఇక రిటైర్మెంట్ ఇవ్వడం ఉత్తమమని అనుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారని సమాచారం. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం తర్వాత ఇక విశ్రాంతి తీసుకోవాలని, యువతకు అవకాశం ఇవ్వాలని తుమ్మల భావిస్తున్నారట. వయసు, ఆరోగ్యం, రాజకీయ ఒత్తిడి వంటి అంశాలు ఆయన నిర్ణయానికి కారణమని సన్నిహితులు చెబుతున్నారు. తుమ్మల వంటి సీనియర్ నేత రిటైర్మెంట్ ఆలోచన చేయడం పార్టీకి పెద్ద నష్టమని ఆయన అభిమానులు అంటున్నారు. కానీ తుమ్మల మాత్రం “ఇక చాలు, ఇప్పటికే చాలా చేశాను” అన్న ధోరణిలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఆయన రిటైర్ అయితే ఆయన నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఎవరు దిక్కు అన్నది పెద్ద ప్రశ్న.

వారసులను బరిలో దించాలని జూపల్లి, దామోదర!

తాము నిలబడి ఓడిపోతే పరువు పోతుందని తమ స్థానాల్లో వారసులను బరిలో దించాలని అనుకుంటున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ ఉన్నారని సమాచారం. జూపల్లి తన కుమారుడు జూపల్లి అరుణ్‌ను, దామోదర రాజనర్సింహ తన కుమార్తె త్రిషను బరిలో దించాలని అనుకుంటున్నారట.

“మనం ఓడిపోతే మన పరువుతో పాటు కుటుంబ పరువు కూడా పోతుంది. అదే వారసులు పోటీ చేస్తే గెలిచినా, ఓడినా అది వారి తొలి అడుగు అవుతుంది. వారికి అనుభవం వస్తుంది” అని వారు భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వారసత్వ రాజకీయాలపై ఇప్పటికే విమర్శలు వస్తున్న సమయంలో మంత్రులు తమ వారసులను రంగంలోకి దించడం కాంగ్రెస్‌కు మంచిదా? చెడ్డదా? అన్న చర్చ కూడా జరుగుతోంది. కానీ తమ రాజకీయ వారసత్వాన్ని నిలబెట్టుకోవడానికి ఇదే సరైన సమయమని వారు భావిస్తున్నారట.

కాంగ్రెస్‌లో కలవరం - అధిష్ఠానం ఏం చేస్తుంది?

ఐదుగురు మంత్రులు ఒకేసారి పోటీకి దూరంగా ఉండాలని అనుకుంటున్నారన్న వార్త కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా తలనొప్పిగా మారింది. వచ్చే ఎన్నికల్లో ఈ ఐదుగురు మంత్రుల నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి ఏమిటి? వారి స్థానంలో ఎవరిని నిలబెట్టాలి? అన్నదానిపై అధిష్ఠానం ఆలోచిస్తోందట. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై మంత్రులతో చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. “ఎవరూ వెనక్కి తగ్గవద్దు, అందరూ కలిసి పోరాడుదాం” అని సీఎం చెప్పే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

మరోవైపు ఈ ప్రచారాన్ని కొంతమంది కాంగ్రెస్ నేతలు కొట్టిపారేస్తున్నారు. “ఇదంతా ప్రతిపక్షాల సృష్టి, మంత్రులెవరూ పోటీకి భయపడటం లేదు” అని వారు అంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఈ ప్రచారం బలంగా వినిపిస్తోంది. మంత్రుల అనుచరులే ఈ విషయాన్ని బయటకు చెబుతుండడంతో ఈ ప్రచారానికి బలం చేకూరుతోంది.

వచ్చే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఇలాంటి ప్రచారాలు మరింత పెరిగే అవకాశం ఉంది. మంత్రులు నిజంగానే పోటీ నుంచి తప్పుకుంటారా? లేక చివరి నిమిషంలో మనసు మార్చుకుని బరిలో దిగుతారా? అన్నది చూడాలి. ఏదేమైనా ఐదుగురు మంత్రుల వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



హైదరాబాద్ మహానగరం అంతా ప్రకటనల దందా!

- **ఎక్కడ చూసినా అక్రమ బస్ షెల్టర్లు, ఇల్లీగల్ డిజిటల్ బోర్డులు!**
- **99 శాతం డిజిటల్ బోర్డులకు అనుమతులే లేవు**
- **ఫుట్‌పాత్‌లు మాయం, ప్రజల నడకకు నరకం**
- **బస్సు ఆగని చోట కూడా బస్ షెల్టర్ ఎందుకు?**
- **యాడ్ ఏజెన్సీలు, అధికారుల మధ్య కుమ్మక్కు**
- **జీహెచ్ఎంసీ విజిలెన్స్ విచారణ**
- **ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి!**

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 18,విజన్ ఆంధ్ర :

హైదరాబాద్ మహానగరం ఇప్పుడు ప్రకటనల దందాతో నిండిపోయింది. ఎక్కడ చూసినా అక్రమ బస్ షెల్టర్లు, ఇల్లీగల్ డిజిటల్ బోర్డులు, ట్రాఫిక్ అంబ్రెల్లాలు దర్శనమిస్తున్నాయి. నగరం అందంగా ఉండాల్సింది పోయి, ప్రకటనల మాయాజాలంతో కళ్లు మిరుమిట్లు గొలిపేలా తయారైంది. పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్‌లు కూడా ప్రకటనల కోసం ఆక్రమించబడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనుమతులు లేకుండానే నగరంలోని పలు ప్రాంతాల్లో డిజిటల్ బోర్డులు, బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెలుగు ప్రత్యేక కథనం సంచలన విషయాలను బయటపెట్టింది. ఈ కథనం తర్వాత నగరంలో పెద్ద చర్చ మొదలైంది. ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయం ఎవరి జేబుల్లోకి వెళ్తోందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

99 శాతం డిజిటల్ బోర్డులకు అనుమతులే లేవు!

నగరంలో 99 శాతం డిజిటల్ బోర్డులకు అనుమతులు లేవని కథనం పేర్కొంది. ఇది సాధారణ విషయం కాదు. నగరంలో వంద బోర్డులు ఉంటే, అందులో 99 బోర్డులు అక్రమంగా ఏర్పాటు చేసినవే అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేబీఆర్ పార్క్ వద్ద మినహా ఇతర ప్రాంతాల్లో డిజిటల్ బోర్డులకు అనుమతులు లేవని వెల్లడించింది. కేబీఆర్ పార్క్ వంటి వీఐపి ప్రాంతంలో తప్ప మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ అక్రమ బోర్డులే రాజ్యమేలుతున్నాయి.

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్ సిటీ, బేగంపేట, పంజాగుట్ట, అమీర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీ నగర్, కూకట్‌పల్లి, మియాపూర్ ఇలా ఎక్కడ చూసినా భారీ డిజిటల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. రాత్రి పూట ఈ బోర్డుల నుంచి వచ్చే వెలుగులతో వాహనదారులకు కళ్లు చెదిరిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాలకు కూడా ఇవి కారణమవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారం బోర్డులు పెట్టేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు.



1,500 బస్ షెల్టర్లు, 800 ట్రాఫిక్ అంబ్రెల్లాలకు మాత్రమే అనుమతులు!

మూడు కార్పొరేషన్ల పరిధిలో సుమారు 1,500 బస్ షెల్టర్లు, 800లోపు ట్రాఫిక్ అంబ్రెల్లాలకు అనుమతులు ఉన్నట్లు సమాచారం. కానీ వాస్తవంగా నగరంలో ఉన్న బస్ షెల్టర్ల సంఖ్య దీనికి ఎన్నో రెట్లు ఎక్కువగా ఉందని తెలుస్తోంది. బస్సులు ఆగని ప్రాంతాల్లో కూడా ప్రకటనల కోసం బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంటే ప్రజల సౌకర్యం కోసం కాదు, కేవలం ప్రకటనల ఆదాయం కోసమే ఈ షెల్టర్లు పెడుతున్నారని స్పష్టమవుతోంది.

బస్ షెల్టర్ అంటే బస్సు కోసం ఎదురుచూసే ప్రయాణికులు ఎండ, వాన నుంచి రక్షణ పొందడానికి ఉండాలి. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నం. బస్సు ఆగని చోట, బస్సు రూట్ లేని చోట కూడా షెల్టర్లు కట్టేసి, దానిపై పెద్ద పెద్ద ప్రకటనలు వేసి కోట్లు సంపాదిస్తున్నారు. ఫుట్‌పాత్‌పై నడుస్తున్న సాధారణ ప్రజలకు మాత్రం నడవడానికి చోటు లేకుండా పోతోంది. వృద్ధులు, చిన్న పిల్లలు, దివ్యాంగులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది ప్రమాదాలకు దారితీస్తోంది.

రాత్రికి రాత్రే బస్ షెల్టర్ ఏర్పాటు - బంజారాహిల్స్ ఉదంతం!

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లో తాజ్ బంజారా హోటల్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై రాత్రికి రాత్రే బస్ షెల్టర్ ఏర్పాటు చేసిన ఉదంతాన్ని కథనం ప్రస్తావించింది. పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్‌ను ఆక్రమించి, రాత్రికి రాత్రే షెల్టర్ వేయడం అంటే అధికారుల అండదండలు లేకుండా జరగదని ప్రజలు అంటున్నారు. ఇలాంటి ఘటనలు నగరంలో చాలా చోట్ల జరుగుతున్నాయి. రాత్రి పూట ఎవరూ చూడకుండా పనులు చేసేసి, ఉదయానికి బోర్డు, షెల్టర్ సిద్ధంగా ఉండడం ఇప్పుడు సర్వసాధారణమైపోయింది.

ఈ వ్యవహారంలో కొన్ని యాడ్ ఏజెన్సీల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే ఏజెన్సీకి వందలాది బోర్డులు, షెల్టర్లు ఎలా వచ్చాయి? టెండర్లు లేకుండా, అనుమతులు లేకుండా ఎలా ఏర్పాటు చేస్తున్నారు? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.



60 అక్రమ బోర్డులు తొలగింపు - విజిలెన్స్ విచారణ!

అనుమతులు లేని 60 డిజిటల్ బోర్డులను అధికారులు తొలగించారు. అక్రమ ప్రకటనల వ్యవహారంపై జీహెచ్ఎంసీ విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టింది. కొన్ని యాడ్ ఏజెన్సీలు, అధికారుల మధ్య కుమ్మక్కు ఆరోపణలు కూడా వెలువడ్డాయి. ఈ విచారణలో ఎంతమంది బయటపడతారో, ఎవరెవరిపై చర్యలు తీసుకుంటారో చూడాలి. కేవలం 60 బోర్డులు తొలగిస్తే సరిపోదు, నగరంలో ఉన్న వేలాది అక్రమ బోర్డులన్నింటినీ తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విజిలెన్స్ విచారణలో అధికారుల పాత్ర బయటపడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం చిన్న ఉద్యోగులను బలి చేసి పెద్ద వారిని వదిలేయకూడదని, ఎంత పెద్ద వారైనా సరే చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది.

ప్రజల ప్రశ్నలు - ప్రభుత్వం సమాధానం చెప్పాలి!

పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్‌లను ప్రకటనల కోసం ఆక్రమించడం ఎంతవరకు సమంజసం?

అనుమతులు లేకుండా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తుంటే పర్యవేక్షణ ఎక్కడ?

ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఎక్కడికి వెళ్తోంది?

ప్రజల భద్రత, సౌకర్యాల కంటే ప్రకటనల ఆదాయానికే ప్రాధాన్యత ఇస్తున్నారా?

రాత్రికి రాత్రే షెల్టర్లు వేస్తుంటే జీహెచ్ఎంసీ సిబ్బంది ఏం చేస్తున్నారు?

నగర అందం కోసం పనిచేయాల్సిన అధికారులు అక్రమాలకు ఎలా సహకరిస్తున్నారు?

ప్రభుత్వం, జీహెచ్ఎంసీ తక్షణమే స్పందించాలి! అక్రమ ప్రకటనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తి చేసి ప్రజలకు నడిచే హక్కును కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నగరాన్ని ప్రకటనల మాఫియా నుంచి కాపాడాలని, అక్రమ బోర్డులన్నింటినీ తొలగించాలని ప్రజా సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.

వెంకటాపురం మండలంలో 501 మందికి పెన్షన్లు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

లబ్ధిదారులకు స్వయంగా అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

వెంకటాపురం నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) : ములుగు జిల్లా,వెంకటాపురం మండలం పాత్రాపురం గ్రామపంచాయతీ పరిధిలోని బుధవారం రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్లు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు మండలంలోని 501 మంది లబ్ధిదారులకు మంజూరైన పెన్షన్లు, స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన చేతుల మీదుగా అందజేశారు.2026 -27 సంవత్సరం కు స్వయంసహాయక సంఘాల కు బ్యాంకు లింకేజి ద్వారా 347 సంఘాలకు రుణాల పంపిణీ చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తూ సంక్షేమం ,అభివృద్ధి రెండు కళ్లు గా భావించి ముందుకు.సాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిడెం మోహన్ రావు, మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, మన్యం సునీల్, శ్రీరాముల రమేష్,డ్రరావి,సర్పంచ్ లు, వార్డు మెంబర్ లు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.

నేపాల్, టిబెట్‌కు చెందిన స్వెటర్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)నేపాల్ టిబెట్ కు చెందిన సెట్వర్ విక్రియ కేంద్రాన్ని ఎమ్మెల్యే న్యాయం రాజేంద్రరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్న నేపాల్, టిబెట్ ప్రాంతాల వారికి మనమంతా అండగా నిలవాలని అన్నారు. ప్రతి సంవత్సరం వారు ఇక్కడికి వచ్చి స్వెటర్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు.వారు మన సమాజంలో భాగమై, మనతో కలిసిమెలిసి జీవిస్తున్నారని, వారి జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. స్థానికులుగా వారికి ప్రోత్సాహం అందించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్థానిక డివిజన్ అధ్యక్షులు శ్యామ్ నాయకులు తాడిచెట్టి విద్యాసాగర్ నలుబోల సతీష్, కట్ల శ్రీను, తోట రాజకుమార్, బియబాని, కల్లూరి పవన్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్



జవహర్ నగర్, నవంబర్ 18, విజన్ ఆంధ్ర : జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్ కాలనీ లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం మాజీ మేయర్, జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్ల వినయ్, ప్రధాన కార్యదర్శి డి ఎస్ ఎస్ వెంకటేశ్వర్, విజయరాయ్, యువజన అధ్యక్షులు సోమేశ్ చారి, వీర్ల భుజంగం రాజు యాదవ్, గజ్వెల్ శంకర్,రఫిక్, అజయ్, మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ బీమా ప్రారంభం

రెండు వారాలు ప్రత్యేక శిబిరాలు కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించే సమయంలోనే జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ఒకేసారి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు, ఏర్పాట్లు, ప్రారంభోత్సవాలు, దరఖాస్తుల సేకరణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19వ తేదీ సాయంత్రం సిద్దిపేట జిల్లా నుంచి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో కూడా పథకాన్ని ఒకేసారి ప్రారంభించాలని కలెక్టర్లకు సూచించారు.ప్రారంభోత్సవ కార్యక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని, ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించాలని, రాబోయే రెండు వారాల పాటు గ్రామాల వారీగా, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తుల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తులో బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు తదితర అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా నమోదు చేయించాలని తెలిపారు.పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తు విధానంపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాలు, ప్రజా సమావేశాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శి సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ప్రారంభోత్సవానికి, ప్రత్యేక శిబిరాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు సేకరించేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.కార్యక్రమంలో డీఆర్ఓ రామ్ రెడ్డి, డీఆర్డీఓ ఉమాదేవి, సీపీఓ హరికృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తు స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 18:(విజన్ ఆంధ్ర)రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే విధంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా పథకం వర్తింప చేస్తుందని, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం కానుందని, ఈ పథకంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొరకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ఈ పథకానికి తెలంగాణలో పుట్టి, ఆధార్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ అర్హులని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తింప కొరకు, దరఖాస్తులు స్వీకరించేందుకు శిబిరాలను నిర్వహించి, ప్రజలకు టామ్ టామ్ ద్వారా తెలియపరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, ఆన్ లైన్ లో వివరాల నమోదు ప్రక్రియ, నోడల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకునేలా దృష్టి సారిస్తామని తెలిపారు.

26 వేల జీతం పెంపుకై GGH ఆసిఫాబాద్ జనరల్ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 18:(విజన్ ఆంధ్ర)ప్రభుత్వ భోధనాసుపత్రులు, మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కాలేజీలు,జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని కాంట్రాక్టు కార్మికుల జీతాలు 26వేలు పెంచాలని,, వారి సంక్షేమం చేయాలని ూఖజ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచాలని కాలం పరిమిత ముగిసిన ఏజెన్సీలను రద్దు చేయాలని కార్పొరేషన్ ద్వారా వేతనాలు అందించాలని పండగ సెలవులు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకై గత 7వ రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆసుపత్రి కార్మికుల ఆందోళనలో భాగంగా తెలంగాణ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో 7వ రోజు మంగళవారం ఆసిఫాబాద్ GGH ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కాంట్రాక్టు పారిశుద్ధ సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ విభాగాల కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు 90% పైగా దళితులు,గిరిజనులు, బలహీనవర్గాల కార్మికులే ఉన్నారని ఇలాంటి సామాజిక వర్గాల కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని న్యాయబద్ధంగా అడుగుతున్న ప్రభుత్వం న్యాయం చేయడం కోసం ముందుకు రాకుండా మీనమేషాలు లెక్కించడం శోచనీయమని అన్నారు. ఆసుపత్రులలో ఏ దిక్కులేని పేదల ఆరోగ్యాలు పరిశుభ్రతకు భద్రతకు వెలకట్టలేని సేవలందిస్తున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా కార్మికులకు జీతాలు పెరగలేదని ఎన్నికల ముందు ప్రభుత్వం ఏజెన్సీల వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ నెలకొల్పి కాంట్రాక్టు కార్మికులకు నేరుగా వేతనాలు అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో దోపిడీ ప్రైవేటు ఏజెన్సీలు అనుమతి కాలపరిమితి ముగిసిపోయి రెండేళ్లకు పైగా అవుతుందని వాటిని రద్దుచేసి కొత్త టెండర్లు నోటిఫికేషన్ విడుదల చేయడంలో ప్రభుత్వం తీవ్రమైన అలసత్వ తాత్సార పూరిత ధోరణి అవలంబించడం సబబు కాదని అన్నారు. గత ఆరు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులు టోకెన్ సమ్మె చేస్తు సేవలో నిమగ్నం కావాల్సిన సిబ్బంది రోడ్లపై ఆకలి కేకలతో జీతాలు పెంచాలని అలమటిస్తున్న వైద్య శాఖ ఉన్నత అధికారులు కానీ, ప్రభుత్వం కానీ స్పందించడం లేదని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే కార్మికులతో చర్చించి న్యాయం చేయాలని లేకపోతే కార్మికుల ఆందోళన మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ూఖజ జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ++ఎ ఆస్పత్రి బ్రాంచ్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు నీల, అధ్యక్షులు మమత, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగన్న, నరేందర్, కోశాధికారి మాదేవిలి,సిబ్బందితోపాటు తదితరులు పాల్గొన్నారు,.

కొండపాక మార్కండేయ దేవాలయంలో హుండీ లెక్కింపు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి విజన్ ఆంధ్ర నవంబర్ 18 కొండపాక మండల కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ దేవాలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగిందిఆలయ కమిటీ అధ్యక్షులు మంతెన నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీని తెరిచి పారదర్శకంగా లెక్కించారు.ఈ లెక్కింపు కార్యక్రమంలో దూడం ఆనంద్, మామిడాల మంతెన భరత్, చంద్రమౌళి, మంతెన కిషన్, మామిడాల బాలయ్య, మంతెన యాదగిరి, పేర్ల కిరిటి, షేర్ల బలరాం క్యాథమ్ రాజు క్యాతం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించి నమోదు చేశారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి పనులకు, నిత్య పూజా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు అధ్యక్షులు మంతెన నాగరాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా బద్దినేని అనంతలక్ష్మి



జవహర్ నగర్, నవంబర్ 18, విజన్ ఆంధ్ర : మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా బద్దినేని అనంత లక్ష్మీ నియమితులయ్యారు. ఈసందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా బద్దినేని అనంత లక్ష్మీ జిల్లా అధికార ప్రతినిధిగా నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా బద్దినేని అనంతలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి బాధ్యతాయుతంగా పనిచేస్తానని అన్నారు.గతంలో మాదిరిగానే ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటనాని,ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిారు.ముఖ్యంగా ప్రజల మౌలిక సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తానని అన్నారు.తనకు జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించి,తనపై నమ్మకం ఉంచిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తన నియామకానికి సహకరించి,ప్రోత్సహించిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ,ప్రజలకు పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తానని బద్దినేని అనంతలక్ష్మీ అన్నారు.

యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి – తోటకూర వజ్రేష్ యాదవ్



కీసర, నవంబర్18, విజన్ ఆంధ్ర : కీసరలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కీసర డివిజన్ అధ్యక్షులు రామిడి స్వప్న విజయ్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థులకు పోటీ పరీక్షల సన్నద్ధతకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు సాధించేందుకు అవసరమైన పుస్తకాలు, సమాచారాన్ని అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు.యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధిలో విద్య, విజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో 'సురక్షిత్' గా వనపర్తి

జిల్లా కలెక్టర్ ను అభినందించిన టీజీఎస్ఏసీఎస్ డిప్యూటీ డైరెక్టర్



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర)హెచ్ఐవీ నియంత్రణలో మెరుగైన ప్రగతి సాధించి వనపర్తి జిల్లా 'సురక్షిత్' జిల్లాగా గుర్తింపు పొందింది. నాకో నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనలో మెరుగైన ప్రగతి కనబరిచినందుకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 20 జిల్లాల్లో వనపర్తి చోటు దక్కించుకుంది.నాకో ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమ్మాన్ సమారోహ్' కార్యక్రమంలో ఈ గుర్తింపు లభించిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజీఎస్ఏసీఎస్) డిప్యూటీ డైరెక్టర్ పి.మేఖల బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ నివారణ, నియంత్రణ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సతో పాటు హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి నిరంతర వైద్య సేవలు అందించే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ గుర్తింపును కొనసాగిస్తూ భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.95-95-95 లక్ష్యాల ప్రకారం హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ వ్యాధి స్థితిపై అవగాహన, నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి ఏఆర్టీ చికిత్స, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరల్ సప్రెషన్ సాధించడం ప్రధాన లక్ష్యమని అధికారులు వివరించారు. ఈ ప్రమాణాల ఆధారంగా జిల్లాలను సురక్షిత్, సక్షమ్, సంఘర్ష్ శీల్ గా గుర్తిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.భాస్కర్ నాయక్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రమోహన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, దిశా సిబ్బంది, సీపీఓ, ఐసీటీసీ, పీపీఐసీటీసీ, డీఎస్ఆర్సీ కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, హోప్ ఎన్జీవో బృందం, ఏఆర్టీ బృందం, సీఎస్సీ కోఆర్డినేటర్లు, లింక్ వర్కర్స్ స్కీమ్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు జాబితా గడువులోగా పూర్తి చేయాలి – కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర) పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు జాబితాల రూపకల్పన ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఓటరు జాబితా పరిశీలకులతో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటరు జాబితాల రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు.జిల్లాలో 29,232 మంది పట్టభద్రుల ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా, 27,961 మంది దరఖాస్తులు పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి ఓటరు నమోదు జాబితా తయారీపై వివరిస్తున్నట్లు చెప్పారు.అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఫారం-18 ద్వారా అందిన దరఖాస్తులను నంబంధిత ధ్రువీకరణ పత్రాలతో నహా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుదారుల విద్యార్హతలు, సాధారణ నివాసం, ఉపాధ్యాయుల బోధనా సేవలు, నంబంధిత విద్యానంస్థల ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని తెలిపారు. అర్హులైన పట్టభద్రుల పేర్లు జాబితాలో చేరేలా చూడటంతో పాటు అనర్హుల పేర్లు నమోదు కాకుండా, డబుల్ ఓట్లు నమోదు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఈ నెల 25వ తేదీన ముసాయిదా పట్టభద్రుల ఓటరు జాబితా విడుదల కానున్న నేపథ్యంలో దానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం తదుపరి ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాల ప్రకారం పూర్తి చేసి, డిసెంబర్ 30వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్ఓ రామ్ రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

దళిత నాయకుడిపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

అక్రమాలను ప్రశ్నిస్తే దాడులకు పాల్పడతారా.. బాధితుడికి న్యాయం చేయాలి

ఆసిఫాబాద్, నవంబర్ 18 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సాలెగూడ గ్రామంలో టీఆర్ఎస్ దళిత నాయకుడు చాపిడి సురేష్‌పై జరిగిన దాడిని జిల్లా టీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కిర్మిల వినోద్ మాట్లాడుతూ, సురేష్ ఇంటి ముందు నిర్మించిన మురికి కాలువపై ప్రజలు నడిచేందుకు బిళ్లలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌ను కోరినందుకు మంగళవారం ఆమె అనుచరుడు, బీసీ నాయకుడు బామ్మే రాజారాం కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడిలో సురేష్ ఎడమ చెంప, చెవి తీవ్రంగా వాచిపోయాయని తెలిపారు. ఏదైనా తప్పు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలి తప్ప, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడటం సరికాదన్నారు. పోలీసులు వెంటనే స్పందించి బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ ఘటనపై పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఇదే ఘటనపై తెలంగాణ రక్షణ సేన పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావేటి సవిత మనోహర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో చేపట్టిన మురికి కాలువ నిర్మాణంలోని లోపాలను ప్రశ్నించినందుకు దాడి చేయడం అన్యాయమన్నారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగితే ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని స్పష్టం చేశారు. దాడులు, బెదిరింపులతో ప్రజల గొంతును నొక్కలేరని, బాధితుడు సురేష్‌కు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలిపారు. బాధితుడి తరఫున ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావేటి మనోహర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్, సహాయ కార్యదర్శులు పెండోర్ ధార్ము, మాచర్ల శ్రీనివాస్, సాయి, ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్నాక కిషన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం శ్యామ్‌రావు, రైతు విభాగం అధ్యక్షుడు నగేష్, నాయకులు అరుణ్, తిరుపతి, మహిళా నాయకురాలు లలిత తదితరులు పాల్గొన్నారు